

తిరుమల తిరుపతి దేవస్థానములు
సప్తగిరి
ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక
ఫిబ్రవరి 2025
వెల రూ. 20/-
పుటలు - 56
SAPTHAGIRI
SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:55, Issue: 09
February - 2025, Price Rs.20/-.
"మాఘస్యైవ తు యో దేవి! హారం బిల్వేన అర్చయేత్
బాలార్కశశియుక్తేన - విమానేన స గచ్ఛతి"
(ఈ నెల 19 నుండి 28వ తేది వరకు
శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు)



05-12-2024న తి.తి.దే. గోగర్భండ్యామ్ వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించింది. ఈ పూజాకార్యక్రమంలో తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు, తి.తి.దే. బోర్డు సభ్యులు శ్రీ శాంతారామ్, తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్., గార్లు పాల్గొన్నారు.



09-12-2024న తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు గారు శ్రవణం కేంద్రాన్ని సందర్శించారు. ఆ సందర్శనలో వీరితో పాటు తి.తి.దే. బోర్డు సభ్యులు శ్రీ జి.భానుప్రకాష్ రెడ్డి, తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం.గౌతమి, ఐ.ఏ.ఎస్. గార్లు పాల్గొన్నారు.



11-12-2024న శ్రీరంగం(తమిళనాడు)లోని శ్రీరంగనాథస్వామికి తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., సతీసమేతంగా పట్టువస్త్రాల్ని సమర్పించిన దృశ్యం.



22-12-2024న తిరుమలలోని గరుడాద్రినగర్ కాటేజీవద్ద ఆధునీకరించిన ఉపవిచారణ కార్యాలయాన్ని తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్. వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్., గారితో కలిసి ప్రారంభించిన దృశ్యం. ఈ కార్యక్రమంలో తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం.గౌతమి, ఐ.ఏ.ఎస్. గారు పాల్గొన్నారు.



01-12-2024న తి.తి.దే. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాన్ని తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్., గారు ప్రారంభించిన దృశ్యం.



17-12-2024న తి.తి.దే. తిరుచానూరు అన్నదానం కాంప్లెక్స్‌లో తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., గారు సెల్ఫ్ సర్వీస్ కియోస్క్ యంత్రాన్ని ప్రారంభించిన దృశ్యం.



## గీతాశ్లోకార్థసారం

**శ్లో : అవ్యక్తోఽ_యమచిన్త్యో ఽ_యమవికార్యోఽ_యముచ్యతే**
**తస్మాదేవం విదిత్వైనం నానుశోచితు మర్హసి ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-25వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** అయమ్= ఈ ఆత్మ; అవ్యక్తః= ఇంద్రియాలకు గోచరింపనివాడు; అయమ్= ఈ ఆత్మ; అచిన్త్యః= మనస్సుచే చింతింపనలవికానివాడు; అయమ్= ఈ ఆత్మ, అవికార్యః = వికారమునొందింపబడనివాడు; (ఇతి= అని) ఉచ్యతే= చెప్పబడుచున్నాడు; తస్మాత్= అందువల్ల; ఏనమ్= ఈ ఆత్మను; ఏవమ్= ఈ ప్రకారంగా; విదిత్వా= తెలిసికొని; అనుశోచితుం= దుఃఖించడానికి, న అర్హసి= తగవు.

**భావం:** ఈ ఆత్మ ఇంద్రియాలకు గోచరం కానివాడు, మనస్సుచే చింతింపశక్యం కానివాడు, వికారాలు బొందింపదగనివాడునని చెప్పబడుతున్నాడు. కావున ఈ ప్రకారంగా తెలిసికొని నీవు దుఃఖింపతగవు.

---

## ఎంచగ శ్రీవేంకటేశుడెక్కె యిదే తేరు..

దిక్కులు సాధించఁబూని దేవదుందుభులు మ్రోయ
యెక్కువతో శ్రీవేంకటేశుఁ డెక్కెఁ దేరు

పన్నిద్దరుసూరియుల బండికండ్లతేరు
సన్నుతి శేషాదిదేవాసనపుఁదేరు
కన్నులపండుగైన గరుడధ్వజపుఁదేరు
యెన్నఁగ శ్రీవేంకటేశుఁ డెక్కె నిదె తేరు

మించు నానామేఘముల మేలుకట్లతేరు
చుంచులనక్షత్రాల కుచ్చులతేరు
అంచెదేవతలే బొమ్మలై వుండినట్టితేరు
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డెక్కె నిదె తేరు

అట్టె కిందేడులోకములంతరువులైన తేరు
నట్టనడుమను బ్రహ్మాండపుతేరు
దిట్ట యలమేల్మంగతోఁ దిరమై వుండేటితేరు
యిట్టె శ్రీవేంకటేశుఁ డెక్కె నిదె తేరు

అధ్యాత్మసంపుటం-02; సంకీర్తన-239





శ్రీవేంకటేశుడు దిక్కులన్నిటినీ జయించాలని దేవదుందుభులు మ్రోయగా అతిశయంతో తేరు ఎక్కాడు అని అన్నమయ్య స్వామివారు ఊరేగే తేరును వర్ణించాడు.

స్వామితేరుకి పన్నిద్దరు ఆళ్వారులే చక్రాలుగా, నిరంతరం స్తుతించే శేషుడు మొదలైన దేవతలే ఆసనాలుగా నిలిచారు. కన్నులపండుగగా గరుడధ్వజంగల తేరు అది. మెఱుపులతో మెరిసే అనేక రకాల మేఘాలు ఆ తేరుకి చాందినీలుగా ఒప్పి ఉన్నాయి. ఆ తేరు పైభాగంలో చాందినీకి కిందుగా నక్షత్రాలు కుచ్చులు కుచ్చులుగా చేసి కట్టారు. ఆ సమీపంలోనే దేవతలే బొమ్మలుగా వ్రేలాడారు. భూమికి క్రిందగల ఏడులోకాలూ అంతస్తులుకాగా, నట్టనడుమ ఈ బ్రహ్మాండపు తేరు ఉంది. ధీరురాలైన అలమేల్మంగతో స్థిరంగా ఉండే తేరుమీద శ్రీ వేంకటేశుడు ఇంతలోనే ఎక్కాడు అని స్వామివారి రథాలంకరణను ఈ కీర్తనలో అన్నమయ్య వివరించాడు.






తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

(తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, ఆంగ్లం, సంస్కృతభాషలు)


## 'సప్తగిరి' చందాదారులుగా చేరాలంటే...

01) చందాదారులుగా చేరేవారు తమ చిరునామా, పిన్‌కోడ్, సెల్‌ఫోన్ నెంబరును, మీకు కావలసిన పత్రిక భాషను స్పష్టంగా రాసి పంపాలి.

02) 'సప్తగిరి' పత్రిక సంవత్సర చందా రూ.240/-.

03) 'సప్తగిరి' పత్రిక జీవిత చందా (12 సంవత్సరాలు మాత్రమే) రూ.2400/-

04) 'సప్తగిరి' పత్రిక ఇతర దేశాలకు సంవత్సర చందా రూ.1030/-

05) 'సప్తగిరి' పత్రిక చందాను పాఠకులు డి.డి./ ఈ.ఎం.ఓ./ ఐ.పి.ఓ./ ఆన్‌లైన్ (ttdevasthanams.ap.gov.in) ద్వారా నమోదు చేసుకోవచ్చు.

06) 'సప్తగిరి' పత్రిక చందాను పాఠకులు ఏ జాతీయబ్యాంకులోనైన "చీఫ్ ఎడిటర్, సప్తగిరి మ్యాగజైన్, టి.టి.డి., తిరుపతి" పేర డి.డి. తీసి పోస్టు ద్వారా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, తిరుపతి-517 507" ఈ చిరునామాకు పంపవచ్చు.

## 'సప్తగిరి' సకాలంలో చేరాలంటే...

01) పాఠకులు తాము 'సప్తగిరి' చందాదారులుగా చేరినప్పుడు ఇచ్చిన చందా నెంబరును మరొక్కమారు పరిశీలించుకోగలరు.

02) ఎందుకంటే.. 'సప్తగిరి' పత్రిక ఒకవేళ అందనివారు, ఆ చందా నెంబరు కార్యాలయానికి చేరవేసి వివరాలు పొందవచ్చు.

03) 'సప్తగిరి'పత్రిక సకాలంలో చేరకపోయినా, చిరునామాలో మార్పులు ఉన్నా ఈ-మెయిల్ (chiefeditortpt@gmail.com) ఐడిని సంప్రదించాలి.

04) ఈ-మెయిల్ సౌకర్యంలేని వారు 0877-2264543, 0877-2264359 నెంబర్లకు ఫోన్ చేసి, చందా నెంబరు చెప్పి సమస్య పరిష్కరించుకోవచ్చు.

05) నేరుగా సంప్రదించదలచినవారు ప్రధాన సంపాదక కార్యాలయ పనివేళల్లో "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ భవనం, తిరుపతి-517 507" చిరునామాలో సంప్రదించవచ్చు.



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥


**గౌరవ సంపాదకులు**
శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,
పి.జి.డిప్లమో ఇన్ ఎపిగ్రఫీ, డిప్లమో ఇన్ యోగా,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., తెలుగు & ఇంగ్లీషు, ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359



విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-



వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.



24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333



తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 55 ఫిబ్రవరి, 2025 సంచిక : 09


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| దినకరా! శుభకరా!! | డా॥కంపల్లె రవిచంద్రన్ | 07 |
| సందేహాలు-సమాధానాలు | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 11 |
| శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు | డా॥ఆకెళ్ళ విభీషణశర్మ | 12 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 15 |
| వాణీ వాణీ నమో నమో!.... | డా॥కప్పగంతు రామకృష్ణ | 17 |
| జగమంత సంబరం | శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి | 19 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 21 |
| కనులను మూసి.. మనసును తెరవాలి! | డా॥ముంజులూరి నరసింహారావు | 22 |
| తిరువాలి-తిరునగరి (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| శ్రీసరస్వతీ పూజావిధానం | | 27 |
| శ్రీకామాక్షీ వైభవం | బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుశర్మ | 31 |
| అభిషేకప్రియుడు 'ఈశ్వరుడు' | డా॥నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి | 33 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 35 |
| వేయికన్నులు చాలవుగా... | డా॥చింతకుంట శివారెడ్డి | 36 |
| మాఘ పూర్ణిమ | శ్రీ గరిమెళ్ల శరవణ దీక్షితులు | 38 |
| రథసప్తమి నోము | డా॥డి.ఉదయ కుమార్ | 40 |
| పరిశోధక ప్రభాకరుడు | డా॥తొండాటి రాజశేఖర్ | 41 |
| తిరుమలలో మహాశివరాత్రి | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 42 |
| వేమన శతకం | కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు | 44 |
| భాస్కర శతకం | డా॥వడ్డేపల్లి శ్రీనివాసరావు | 44 |
| జీవితాన్ని మలుపు తిప్పి గెలిపించాడు | శ్రీ బొగ్గరపు రాధాకృష్ణమూర్తి | 45 |
| నీరసం తగ్గాలంటే... | డా॥చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 46 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 47 |
| భక్తితో ఏదైనా సాధ్యమే (చిత్రకథ) | కథ : డా॥కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు : శ్రీ తుంబలి శివాజీ | 48 |
| బాలవినోదం | | 50 |
| ఎప్పుడు ఏది పనికొస్తుందో తెలీదు! | డా॥నల్లాని రాజేశ్వరి | 51 |
| క్విజ్ | | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీకామాక్షీసమేత శ్రీకపిలేశ్వరస్వామివారు, కపిలతీర్థం (తిరుపతి)
వెనుకచిత్రం: చదువుల తల్లి సరస్వతీదేవి!




ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# సత్యాన్వేషణదృష్టి!

మహాత్ముల అవతారాలు సర్వజీవసంక్షేమాన్ని పురస్కరించుకుని ఏర్పడతాయి. కాల ప్రభావంవల్ల ఒక్కొక్క ప్రయోజనం సాధించటం కోసం సర్వేశ్వరుడు వివిధావతారాలను ధరించటం మనకు పురాణాలలో కన్పిస్తుంది. ఒక్కొక్కప్పుడు కేవలం అవతార స్వరూపస్వభావాల వల్లనే మానవాళికి అమూల్యసందేశం అందుతుంది. అదే సృష్టి వైచిత్రి. అందువల్లనే మానవులు అభిప్రాయభేదాలతో శిఖపట్లు పట్టుకుంటున్నా, అనంతసృష్టిస్వరూపంలో వివిధ పాత్రలను ధరించే ఆ చిజ్జ్యోతి ఒకటేనని తెలియచెప్పేందుకే భగవానుడు 'రుద్రాణాం శంకరశ్చాస్మి' అని భగవద్గీతలో పేర్కొన్నాడు.

"ఏకాదశ రూపమైన రుద్రస్వరూపాలలో శంకరుడను నేను" అని చెప్పటంలో ఒక తాత్త్వికమైన అభేదంతోపాటు, సాంకేతికరూపంగా సార్వకాలీన సమాజానికి అందించే అమూల్య సందేశం ఒకటి నిగూఢంగా ఉంది.

రుద్రుడు సంహారకమూర్తి, లయకారకుడు, కానీ ఆ తత్త్వం కూడా ఒక మహోన్నతమైన, శివంకరమైన కార్యసాధన కుపయోగించటం వల్లనే అతడు శంకరుడైనాడు. అతడు కంఠే కాలుడు. అంత కాలకూటవిషాన్ని కూడా, కంఠగతమాత్రం చేసి, సర్వలోకాలను సంరక్షించిన ఈ తత్త్వం లేదా గుణంవల్ల మానవులకు అమూల్యసందేశం లభిస్తోంది. కాలకూటంలాంటి ఎలాంటి తాపాన్నయినా తాత్కాలికంగా కంఠగతం చేసుకోవాలేగాని, ఉదరగతం చేసి తన్మూలకంగా దేహతాపానికిగాని, సమాజవినాశనానికిగాని కారకుడు కారాదు. అంతేకాదు కాల కంఠుడైన అతని చంద్రశేఖరత్వం, గంగాధరత్వంలో మానవుడు ఎంతటి కష్టదశలో ఉన్నా కూడా తాను దానికి లోనుగాక బుద్ధిని ఉద్వేగరహితంగా ఉంచాలన్న సందేశం కన్పిస్తుంది.

అతడు దిగంబరుడు, భోగిభూషణుడు, సర్వేశ్వరుడు, స్థాణువు. ఇవన్నీ కూడా అతని విషయనిరాసక్తత, కఠోరదీక్ష, ఆశ్రితవాత్సల్యాన్ని వ్యక్తం చేస్తాయి. అంటే భగవానుడు గీతలో చెప్పిన కర్మయోగం ఇదేనేమో. మానవుడు ఈ గుణాలలో శతాంశం సంకల్పించినా ఒక మెట్టు ఎక్కినట్లే. శ్రీనాథుడు చెప్పినట్లు 'సిరిగలవానికి చెల్లును' అన్నట్లుగాక, స్వప్రయోజనం కోసం కాక, పరహితం కోసం, తనకున్నదానిలో సహాయం చేయాలన్న సామాజిక మౌలికసూత్రాన్ని శర్వుని దగ్గర్నుండే స్వీకరించాలి.

అతడు త్రినేత్రుడు. పర్వతం నుండి పరమాణువు వరకు వ్యాపించి ఉన్న విశ్వరూపుని సత్యస్వరూపసందర్శనం కావాలంటే ప్రతిమానవుడు, భౌతికవాంఛలను దహింపచేసే జ్ఞాన నేత్రాన్ని తెరచి, మనస్సును అంతర్ముఖం చేయాలి. ఇక అర్ధనారీశ్వరత్వం ధర్మబద్ధమైన ఐహిక జీవనంలోగాని, ఉత్తరోత్తరా ఆధ్యాత్మికంగా గాని, స్త్రీరూప శక్తిస్వరూపంలేని మానవుడు అపరిపూర్ణుడనేది సూచిస్తుంది.

ఇలా ఒక్కొక్కమాటలో ఎన్నో అర్థాలను మన శ్రేయస్సుకుగాను సంతరించి పెట్టినవి పురాణదేవతాస్వరూపాలు. సత్యాన్వేషణదృష్టిలో శోధన సాగితే అమరత్వస్వరూపం తప్పక తెలుస్తుంది.

# దినకరా! శుభకరా!!

– డా॥ కంపల్లె రవిచంద్రన్



మాఘశుద్ధ సప్తమికి రథసప్తమి అని పేరు. సూర్యుని గమనాలు ఉత్తరాయణం, దక్షిణాయనమని రెండు విధాలు. ఆషాఢ మాసంనుండి  పుష్యమాసం వరకు దక్షిణాయనం. సూర్యుని గమనం ఏడు గుర్రాలతో కూడిన బంగారురథంమీద సాగుతుందని వేదం చెప్పింది. దక్షిణాయనంలో దక్షిణదిశగా పయనిస్తుంది సూర్యరథం; పుష్యమాసం చివరలో ఉత్తరాయణం ప్రారంభ మౌతుంది. సూర్యుని మకరరాశిప్రవేశం ఉత్తరాయణం ప్రారంభ సూచకం. మాఘశుద్ధ సప్తమినాడు ఆ రథం ఉత్తరదిక్కువైపు తిరుగుతుంది. అందుకనే మాఘశుద్ధసప్తమికి "రథసప్తమి" అని పేరు వచ్చింది. ఈ రోజును– అత్యంత పుణ్యదినంగా భావించి హైందవులు ఉపవాసముండి సూర్యుని ఆరాధిస్తారు. 'భా' అంటే సూర్య కాంతి. 'రతి' అంటే ఆరాధన. 'భారత' అంటే సూర్యుడు, కనుక సూర్యుణ్ణి ఆరాధించేవారు భారతీయులు. మాఘశుక్లసప్తమి సూర్యగ్రహణంతో సమానం కనుక ఆరోజు అరుణోదయవేళ చేసే స్నాన, జప, అర్ఘ్యప్రదాన, తర్పణ, దానాదులు అనేక కోట్ల పుణ్యఫలాలను, ఆయురారోగ్యసంపదలను ఇస్తాయి.

సప్తమినాడు షష్ఠీ తిథి కూడా ఉంటే షష్ఠీ సప్తమీ తిథుల యోగానికి "పద్మక" మని పేరు. ఈ యోగం సూర్యునికి అత్యంత ప్రీతికరం. ఆ సమయంలో ఏడు జిల్లేడు ఆకుల్ని ధరించి నదీస్నానం చేస్తే ఏడు జన్మల్లో చేసిన పాపాలు నశిస్తాయని గర్గమహాముని ప్రబోధం. ఈ పద్మకయోగం సూర్యగ్రహణతుల్యం. జిల్లేడుఆకుకు అర్కపత్రమని పేరు. సూర్యునికి "అర్కః" అని పేరు. అందువల్ల సూర్యునికి జిల్లేడు అంటే ఎక్కువ ప్రీతి. అందుకనే రథసప్తమినాడు సప్తాశ్వాలకు చిహ్నంగా ఏడు జిల్లేడు ఆకులను, అవి దొరక పోతే చిక్కుడు గాని, రేగిఆకులను గాని ధరించి స్నానమాచరిస్తారు. జిల్లేడు, రేగి ఆకులను రెంటిని కలిపి శిరస్సున ధరించాలని శాస్త్రం. ఈ ఏడు జిల్లేడు ఆకులు సూర్యుని రథానికి గల చిహ్నం మాత్రమే గాక ఏడు జన్మల్లో చేసిన పాపాలను, ఏడు రకాల వ్యాధుల్ని నశింపచేస్తాయి. సప్త అశ్వాలు గలిగినవాడు కనకనే సూర్యునికి మహాసప్త అని కూడా పేరు. తన సప్తాశ్వాలతో సప్త లోకాలను ఆయన ప్రకాశింపజేస్తున్నాడు.

అశ్వాలంటే కిరణాలు. సప్తాశ్వాలంటే ఏడు కిరణాలు. సప్తాశ్వరథమండలం అంటే సప్తకిరణమండలం. ఈ రథమండలాన్నే భౌతికశాస్త్రం 'స్పెక్ట్రం' అంటోంది. కిరణాలే కాంతులు, వర్ణాలు, రంగులు. కాబట్టి రథసప్తమిరోజు సప్తాశ్వరథస్థుడైన సూర్యుణ్ణి ఆరాధించడం అంటే సప్త కిరణాల లేక సప్త వర్ణాల సమారాధనమే.. సప్త అశ్వాలే సప్త స్వరాలు, సప్త ఛందస్సులు, సప్త వాక్కులు, సప్త విభక్తులు కూడా! ఇవన్నీ లోకయాత్రాకారకాలు. కాబట్టి సప్తాశ్వసమారాధన ఆయురారోగ్యైశ్వర్యప్రదం.

దేవాలయాలలో శివాది దేవులకు కల్యాణోత్సవాలు చేస్తారు. "బ్రహ్మాణం బ్రహ్మవాహనం" అనే శ్రుతివచనానుసారం పర బ్రహ్మస్వరూపులైన దేవతలకు గజ, శేష, గరుడాది వాహనాల మీద ఊరేగింపు చేసినా, చివరకు రథోత్సవం చేస్తారు. రథోత్సవమంటే సప్తాశ్వరథమండలంలో బ్రహ్మస్వరూపుడైన పరమేశ్వరుణ్ణి కూర్చోబెట్టి ఊరేగించడమే, ఆరాధించడమే. ఇదొక ప్రత్యేకమైన, విశిష్టమైన ఉత్సవం. ఈ ఉత్సవాలకు రథోత్సవంతో గాని పరిపూర్ణత సిద్ధించదు. సప్తాశ్వరథమండలమే వేదమండలం. వేదానికి బ్రహ్మ అని

పేరు. భగవంతునికి బ్రహ్మ అని పేరు గనుక "బ్రహ్మాణం బ్రహ్మావాహనం" అనే శ్రుతివచనానికి రథోత్సవరూపంగా రథసప్తమి సమారాధననే పరోక్షతాత్పర్యంగా భావించవచ్చు. అందుకే జగన్నాథరథచక్రాల్ని పురాణాలు నాలుగు వేదాలుగా కీర్తించాయి. మత్స్యపురాణం సూర్యుని రథచక్రాలను వేదాలని పేర్కొనింది.

అందుకనే రథసప్తమి రోజు బంగారంతోగాని, వెండితో గాని రథాన్ని చేయించి, కుంకుమతో, దీపాలతో అలంకరించి, అందులో ఎర్రని రంగుగల సూర్యుని ప్రతిమ ఉంచి, పూజించి, గురువుకు ఆ రథాన్ని దానమిస్తే మంచిది. ఆ రోజు ఉపవాస ముండి సూర్యసంబంధమైన రథోత్సవాది కార్యక్రమాల్ని చూస్తూ కాలక్షేపం చేయాలి. అందుకనే చాలా ఊర్లలోని ఆలయాల్లో రథసప్తమిరోజు తప్పకుండా తేరు ఉంటుంది. రథసప్తమివ్రతం వల్ల సూర్యభగవానుని అనుగ్రహంతో ఆయురారోగ్యాది సకల సంపదలు కురుస్తాయని పురాణప్రబోధం. అలాంటి రథసప్తమీ వ్రతం మన సంప్రదాయంలో నిలిచి ఉండడం భార తీయతకు చిహ్నం. ప్రతి రోజు సూర్యుడు చీకటిని పోగొడుతూ, అంధకారం మీదుగా పైకి రావటమే ఉత్తరాయణం. అందరిని తరింపచేయడం కోసం సూర్యుడు సప్తాశ్వరథారూఢుడై అవతరిస్తున్నాడు కనుక సూర్యుడు ఉత్తరుడు అవుతున్నాడు. అంద రిని తరింపజేసే ఆ సూర్యజ్యోతిస్సును చూస్తున్న లోకం తరిస్తోంది, "ఉత్తర"మౌతోంది.

**సప్తాస్యాసన్పరిధయః ......**
**వేదాహమేతం పురుషం మహాంతమ్ ।**
**ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్!**

అని పురుషసూక్తమంత్రం అర్థం కూడా పై విషయాన్నే బోధిస్తోంది. ఈ మంత్రంలో కూడా పరమపురుషుడైన భగవంతుడు ఆదిత్యుని యొక్క "వర్ణ" స్వరూపమని చెప్పడం ద్వారా తిరిగి వర్ణ (రంగు) సమారాధన ప్రధానంగా వేదంలో నిర్దిష్టం.

సూర్యోదయవేళ కనపడే ఉషఃకాంతి పుంజమే అరుణవర్ణమండలం, సంధ్యారుణ వర్ణ మండలం. అదే సప్తాశ్వరథమండలం. కాబట్టే ప్రతిరోజూ ఉషఃకాలంలో అరుణవర్ణోపాసన, సంధ్యావందనం చేయడం కూడా రథసప్తమివ్రతం ఆచరించుచున్నట్లే భావిం చాలి. పరోక్షంగా ప్రతిరోజూ ఉత్తరాయణపుణ్యకాలమే ఉషః కాలం, ఆ పుణ్యసమయంలో రథసప్తమీ సమారాధన, సప్తాశ్వ రథస్థుడైన సూర్యోపాసన; సంధ్యావందనం ప్రధానకర్తవ్యం అని వేదశాసనం.

సూర్యుని రథానికి శోభించే స్వభావం కల ఏడు గుఱ్ఱాలు పూన్చబడ్డాయి. అవి రథాన్ని పడేయకుండా జాగ్రత్తగా లాగుతాయి. ఆ గుఱ్ఱాలు రథం మీద సూర్యుణ్ణి యజ్ఞగృహానికి తీసుకువస్తాయి. అప్పుడు ఆ సూర్యునికి హవిస్సుల నీయాలి. మనం తపస్సును, రాత్రిని అధిగమించి ఊర్ధ్వదిశగా వస్తున్న



సూర్యుణ్ణి ఉత్తరాభిముఖంగా వచ్చే దివ్యజ్యోతిస్సుగా దర్శించి తరించాలి. దేవతలలో మిక్కిలి ఉత్తముడు, ఉత్తరుడు, ఉత్తరాయణం కలవాడు సూర్యుడు. ఈయన ఒక గొప్ప జ్యోతిస్సు. ఉత్తరదిశాభిముఖుడు ఉత్తరమైన ద్యులోకాన్ని అధిరోహించేవాడు, అందరిని తరింపజేసేవాడు అయిన సూర్య భగవానుడు, మన ప్రార్థనలు, ఆరాధనలు స్వీకరించి, మన హృద్రోగాన్ని, హరిమాణమనే రోగాన్ని నశింపచేస్తాడు. హరిమాణమంటే శరీరమంతా పసుపురంగులోకి మారే జబ్బు. అంటే పచ్చకామెర్లవ్యాధి. కాబట్టి సప్తాశ్వరథమండలస్థుడైన, సూర్యసమారాధన లేక రథసప్తమీసమారాధన హృద్రోగాన్ని, పచ్చకామెర్లవ్యాధిని పోగొట్టుతుంది. ఇందుకు ఉదాహరణ మయూరమహాకవి. ఈయన కేవలం సూర్యోపాసనతో తన వ్యాధిని రూపుమాపుకుని సూర్యారాధనను "మయూరశతకం" అనే పేరుతో లోకానికి చాటి చెప్పాడు.

సూర్యుడు సంచరించే రథానికి ఒకటే చక్రం. దాన్ని ఏడు గుఱ్ఱాలు వహిస్తున్నాయి. రంహణ స్వభావం కల్గింది రథం. రంహణమంటే అతివేగంగా తిరగడం. అలాంటి రథాన్ని సప్తాశ్వాలు జగత్తు యొక్క అహోరాత్రనిర్వహణను వహిస్తున్నాయి. అట్లే "సప్త" అనే పేరు గల ఒక అశ్వమే జగత్పాలనా భారాన్ని వహిస్తోంది. ఈ "సప్త" అనబడే అశ్వమే రథం. రథానికే 'సప్త' అని పేరు. అందుకే సూర్యుడు 'సప్త సప్త' అని, 'సప్తసప్తి' అని కీర్తింపబడుతున్నాడు. 'సప్త' అనే పేరుగల అశ్వమే సప్త అశ్వాలుగా మారింది. ఒకే వాయువు సప్త వాయురూపాలు గాను, ఒకే తేజస్సు సప్త తేజోరూపాలు గాను, ఒకే కిరణం సప్త కిరణాలుగాను రూపొంది రథాన్ని వహిస్తున్నాయి. ఆ అశ్వమే సూర్యుడు అని కీర్తించింది. ఈ సూర్యమండలమే రథమని మరొక అర్థం. సాధారణంగా ఋతువులు ఆరు, అధిక మాసం ఒక అసాధారణమైన ఋతువు. దీంతో ఋతువులు ఏడు. "సప్త చితికోగ్నిః- సప్త ఋతవః సంవత్సరః- సంవత్సరోగ్నిః" (శతపథశ్రుతి-9-2-2-47)- ఈ శ్రుతి కూడా సంవత్సరానికి ఏడు ఋతువులని పేర్కొంది. అట్లే సాధారణ మాసాలు పన్నెండు. పదమూడవ మాసం అసాధారణమైన అధికమాసం. పన్నెండు మాసాలు ఆరు ఋతువులు. అధిక మాసం ఏడవ ఋతువు. ఈ సప్త ఋతువుల ద్వారా రథరూపుడైన సూర్యుడు జగత్పరిపాలన చేస్తున్నాడు.

'సప్త' అనే పేరు గల అశ్వమే (వ్యాపనశీలుడు) సూర్యుడు, ఆ 'సప్త' అనబడే అశ్వం (సూర్యుడు) సప్త ఋషులచే స్తుతింపబడుతూ, సప్త రసాలను ప్రతిపాదించే సప్త కిరణాలనబడే సప్తాశ్వాలతో వహింపబడుతూ లోకపరిభ్రమణం చేస్తున్నాడు. ఆదిత్యమండలమే సంవత్సరమనే పేరు గల రథమట. ఈ సంవత్సరరూపరథాన్ని ఏడు గుఱ్ఱాలు సంవాహనం చేస్తుంటాయి. ఈ సప్తాశ్వాలు- ఆయన, ఋతు, మాస పక్ష, దివస, రాత్రి, ముహూర్తాలు, ఈ రథానికి సప్త చక్రాలు. శ్రీసాయణాచార్యభాష్యప్రకారం వేగసంచారం, క్రమణం అంటే వ్యాపించడం అనే లక్షణాలు కలవి చక్రాలు. ఆ రెండు లక్షణాల చక్రాలు రశ్ములు అంటే కిరణాలు. అట్టి సప్త కిరణరూపచక్రాలు గల సంవత్సరరూపరథాన్ని, ఆదిత్యమండలాన్ని ఆయన, మాస, పక్ష, ఋతు, దివస, రాత్రి ముహూర్తాలనే సప్తాశ్వాలు నిత్యం వహిస్తూ పరిభ్రమణం చేయిస్తూ లోకపాలన చేస్తున్నాయి. అలాంటి సంవత్సరరూపరథం యొక్క ఆరాధన రథసప్తమి రోజు అనుష్ఠించాలి.

శ్రీసూక్తంలోని ఈ మంత్రం -

**"అశ్వపూర్వాం రథమధ్యాం హస్తినాద ప్రబోధినీమ్।**
**శ్రియం దేవీముపహ్వయే శ్రీర్మా దేవీ జుషతామ్॥"**

**"ఆదిత్యవర్ణే తపసోఽధి జాతః"**

**"సూర్యాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మమావహ!!"**

సూర్యసంబంధమైన లక్ష్మి అనగా తేజస్సే సూర్యలక్ష్మి. ఈ లక్ష్మి సప్తాశ్వరథమండలం మధ్యలో ఉంటుంది. ఆమె నిరంతరం హస్తినాదంతో మేలుకొలుపబడుతుంది. ఈ లక్ష్మి మేలిమి బంగారుఛాయ గల్గింది, సూర్యుని వర్ణం కల్గింది. కాబట్టి సప్తాశ్వరథమండలం మధ్యస్థ అయిన లక్ష్మిని ఆరాధించటం రథసప్తమి నాటి ఆరాధనను స్ఫురింపజేస్తోంది.

కఠోపనిషత్తు ప్రకారం శరీరం ఒక రథం. ఆ రథంలో ఉండే రథియే ఆత్మ. బుద్ధి రథసారథి, మనస్సు కళ్లెం, సప్త ఇంద్రియాలు సప్త అశ్వాలు. భగవద్గీత కూడా ఇదే విషయాన్ని విశదపరచింది. బుద్ధియొక్క ఆజ్ఞను మన్నించకుండా అశ్వాలు (ఇంద్రియాలు) దుష్టాలైతే మనస్సు కళ్లెం అదుపు తప్పి శరీరాన్ని (రథాన్ని) ఇష్టం వచ్చినట్లు చెడుమార్గాలు పట్టించి

తిప్పుతుంది. వివేకవంతుని బుద్ధికి అశ్వాలు ఆజ్ఞానుబద్ధులై శరీరాన్ని సన్మార్గంలో తిప్పుతాయి. 'అశ్వపూర్వాం రథమధ్యాం" అనే శ్రీసూక్తమంత్రార్థం ఈ విషయాన్నే స్ఫురింపజేస్తోంది. శరీరమనే రథమధ్యస్థ అయిన లక్ష్మే చైతన్యలక్ష్మి. చెవులు మూసుకుంటే వినపడే నాదమే హస్తినాదం. అదే వేణునాదం, వీణానాదం, వేదనాదం, శంఖధ్వని. ఆ నాదం చేత నిరంతరం బోధింపబడుతూ చైతన్యలక్ష్మిని ఆరాధించడం రథసప్తమి ఆరాధనావైశిష్ట్యాన్ని బోధిస్తోంది. ఈ రథసప్తమినాటి ఆరాధనతో మానవులు తమ ఇంద్రియాల్ని సదశ్వాలుగా చేసుకుని, మనస్సును అదుపులో ఉంచుకుని, తమ తమ శరీర రూప రథాలను భగవంతుని వైపు ఉత్తరాభిముఖంగా తిప్పుకుని, అనగా సన్మార్గాల వైపు మరల్చి, ఉత్తరులై, తరించే పుణ్యం సంపాదించాలి.

లోకంలో మనుషులు అరవై సంవత్సరాలు నిండగానే మనోనియంత్రణం, మనోనిగ్రహం, మనశ్శుద్ధి కోసం, ఇంద్రియాశ్వనిరోధం కోసం ఉగ్రరథశాంతి, ఆపై భీమరథశాంతి జరుపుకునే సంప్రదాయం వచ్చింది. మనస్సు అదుపు తప్పినపుడు కోరికలు, విషయాలు, మహారథాలు ఉగ్రరూపం దాల్చి మానవుని శరీరరథాన్ని ఉగ్రవేగంతో నడుపుతాయి. అప్పుడు మానవుని మనస్సు చికాకు, కోపం, ద్వేషాదులతో ఉడికిపోతూ ఉంటుంది. ఆ ఉగ్రాన్ని నిరోధించడానికి ఉగ్రరథ శాంతి అవసరమే!

అలంకార, వ్యాకరణశాస్త్రాలు కూడా భంగ్యంతరంగా పై విషయాల నిలా బోధిస్తున్నాయి...

"ఇద మంధతమః కృత్స్నం జాయేత భువనత్రయం.
యది శబ్దాహ్వయం జ్యోతి రాసంసారం న దీప్యతే"
(కావ్యాదర్శ)

సృష్టి ఆరంభం నుండి శబ్దమనే జ్యోతిస్సు(దీపం) లేకుంటే ముల్లోకాలు కారుచీకటిలో, అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడి ఉండేవని అర్థం. శబ్దజ్యోతిస్సును శబ్దబ్రహ్మ అని అంటారు. ఈ శబ్దబ్రహ్మే వేదవాణి. సూర్యభగవానుడేవిధంగా మానవాళికి చీకటినుండి వెలుగును ప్రసాదించడం కోసం ఉదయిస్తున్నాడో శబ్దబ్రహ్మ అయిన వేదవాణి అజ్ఞానాంధకారం నుండి జ్ఞానప్రకాశం కల్గించడం కోసం ఉత్తరాభిముఖంగా మానవాళి ఉద్ధరణ కోసం అవతరిస్తోంది. ఇక్కడ శబ్దజ్యోతిస్సు కూడా రథియే. రామ, కృష్ణ, గోవింద ఇత్యాది ప్రాతిపదికలే రథాలు. ఆ ప్రాతిపదికలతో వాఙ్మయప్రపంచాన్ని నిర్వహించే, ఆ ప్రాతిపదిక రూపరథాల్ని వహించే సప్త విభక్తులే సప్తాశ్వాలు. ఈ సప్త విభక్తుల ద్వారా జ్ఞానజ్యోతిస్సు ఉత్తరమై ప్రజల్ని ఉత్తరులుగా తీర్చిదిద్దుతోంది, తరింపజేస్తోంది. జ్ఞానజ్యోతీ రూపిణి అయిన వేదవాణి ఉత్తరమే. అలాంటి జ్ఞానజ్యోతిస్సు ద్వారా మానవులు ఉత్తరులవ్వాలని ఆకాంక్ష!

చివరిగా, యజ్ఞం కూడా రథమే! అగ్ని రథి. అగ్నికి ఏడు జిహ్వాలు. కాళి, కరాళి, మనోజవా, ధూమ్రవర్ణా, స్ఫులింగినీ, విశ్వపద, సులోహిత. ఈ ఏడు జ్వాలలు ఏడు గుఱ్ఱాలు. యజ్ఞానికి "సప్త తంతుః" అని పేరు. "సప్త ఛందోభిః తవ్యతే" అని వ్యుత్పత్తి. సప్త ఛందస్సులే సప్త తంతువులు. ఈ యజ్ఞరథసప్తమి ఉంటే మానవాళికి శ్రేయోదాయకమే! ఈ విధంగా రథసప్తమి పర్వదినం జనానికి ఆయురారోగ్య ఐశ్వర్యాలనిచ్చి కాపాడాలని సూర్యభగవానుణ్ణి ప్రార్థిద్దాం!

## వైకుంఠపాళి
### :: 109 - సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 మ | హా | 2 శి | వ | 3 రా | త్రి | | | 4 వి | 5 జ | య |
| ద | | వు | | జ | | 6 చం | డి | | య | |
| 7 న | లు | డు | | 8 రా | ధ | | | 9 క | | 10 భీ |
| పం | | | | జ | | 11 క | చ్ఛ | పి | | ష్మా |
| చ | | 12 నీ | | న | | పా | | లే | | ష్ట |
| 13 మి | థి | ల | | రేం | | ల | | శ్వ | | మి |
| | | ము | | ద్రు | | 14 మో | ద | ర | | |
| | | | 15 కా | డు | | చ | | స్వా | | 16 గు |
| | 17 పూ | | న | | | న | | మి | | ణ |
| 18 పూ | ర్ణి | మ | | 19 భృం | 20 గ | ము | | | | ని |
| | మ | | | | య | | 21 జ | ల | ని | ధి |



సంసారసాగరాన్ని తరించడానికి శివస్మరణే తరణోపాయం

# సందేహాలు సమాధానాలు

-బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

**ప్ర) రుద్రుని ఆవిర్భావం ఎలా జరిగింది? బ్రహ్మనుండి జనించిన రుద్రుడు ఆతని తలనే ఖండించడం అధర్మం కదా? ఏకాదశ రుద్రులు ఎలా కలిగారు?**

**జ)** సృష్టికి పూర్వంలోనే బ్రహ్మదేవుడు శివ పరమాత్మ విషయంలో అజ్ఞానంతో అసత్య మాడాడు. అగ్నిలింగంగా వ్యక్తమైన పరమే శ్వరుని తుదిని తెలియలేని బ్రహ్మ తాను తెలుసుకున్నానని అబద్ధమాడిన కారణంగా శివుని ఫాలభాగం నుండి కాలభైరవుడు ఉద్భ వించి కల్లలాడిన బ్రహ్మశిరస్సును ఖండిం చాడు. ఈ సదాశివస్వరూపం బ్రహ్మనుండి జనించింది కాదు. జననమరణాలు లేని పరతత్త్వం సదాశివరుద్రుడు. ఆయన శాశ్వతుడు. అధర్మంపట్ల తను చూపించిన క్రోధమే శిక్షాస్వరూపుడైన భైరవుడు.

తర్వాత బ్రహ్మ పశ్చాత్తాపంతో శరణు వేడాడు. మన్నించిన పరమశివుడు అనుగ్ర హించాడు. అటు తరువాత బ్రహ్మ సృష్టిని చేయబోగా అనేక విచ్ఛిన్నాలు ఏర్పడ్డాయి. అప్పుడు వేదనతో శివుణ్ణి ధ్యానించాడు. ఆ సమయంలో బ్రహ్మప్రార్థనను మన్నించి, అతని కనుబొమ్మల నడిమి ప్రాంతం (ఆజ్ఞాచక్రస్థానం) నుండి రుద్రరూపంలో శివుడు ప్రకటమయ్యాడు. తన నుంచి అనేక రుద్రులను ప్రభవింపజేశాడు. వారు జగద్రక్షకులై విశ్వవ్యాపకులయ్యారు.

**ఇక ఏకాదశ రుద్రుల చరిత్ర...**

ఒకప్పుడు దైత్యుల ఉద్ధతికి దేవతల శక్తి క్షీణించింది. ఆ సమయంలో దేవతల తల్లి అయిన అదితీదేవి ప్రార్థన మేరకు, కశ్యప ప్రజాపతి శివునికై తపస్సు చేశాడు. ఆ తపస్సుకి ఫలంగా కశ్యపునకు సురభి ద్వారా శివుడు పదకొండు రూపాలలో అవ తరించాడు. వారే ఏకాదశ రుద్రులు. వీరు దైత్యుల్ని శిక్షించి, దేవతలను రక్షించిన వారు. ఈశాన్యదిశకు అధిపతులు. వీరి లోకం కూడా ఈశానలోకం. వీరి పేర్లు: కపాలి, పింగళుడు, భీముడు, విరూపా క్షుడు, విలోహితుడు, శాస్త, అజపాత్, అహి ర్బుధ్న్యుడు, శంభుడు, చండుడు, భవుడు.

**ప్ర) 'చండీప్రదక్షిణం' అంటే ఏమిటి? ఎలా చేయాలి?**

**జ)** 'చండేశ్వరుడు' అని శివుని గణాలలో ఒక ముఖ్యుడు. తన నిర్మాల్యంపై అధి కారాన్ని ఈయనకు ప్రసాదించాడు శివుడు. అందుకే చండేశ్వరప్రతిష్ఠ ఉన్న శివా లయంలోని ప్రసాదాన్ని, నిర్మాల్యాన్ని గ్రహించరాదంటారు. అయితే కొన్ని శైవాగమాల ప్రకారం, మహానైవేద్యంలో 'చండభాగం' అని విభజిస్తారు. ఆచోట్ల ఇచ్చే ప్రసాదాన్ని స్వీకరించవచ్చు. స్ఫటిక, బాణ, స్వయంభూలింగాలున్న గుడిలో చండేశ్వరునికి నిర్మాల్యాధికారం లేదు కనుక- అక్కడ నిర్మాల్య ప్రసాదస్వీకారం చేయవచ్చు. అయితే చండేశ్వరుడున్న ఆలయంలో ప్రదక్షిణ చేసే విధానాన్ని 'చండీప్రదక్షిణం' అంటారు.

సాధారణంగా శివాభిషేకతీర్థం వెలు పలికి వచ్చే సోమసూత్రం వద్ద చండేశ్వర ప్రతిష్ఠ చేస్తారు.

1)ఆ సోమసూత్రం నుండి ప్రారంభించి ధ్వజస్తంభం వద్దకు, ధ్వజం నుండి తిరిగి ప్రదక్షిణంగా సోమసూత్రం దగ్గరకు, 2)అటు నుంచి వెనక్కి తిరిగి ధ్వజం దగ్గరకు, 3)ధ్వజంనుండి ముందుకు సోమసూత్రం దగ్గరకు, 4)తిరిగి వెనుకకు ధ్వజం వద్దకు, 5)ధ్వజస్తంభంనుండి ముందుకు సోమ సూత్రం దగ్గరకు, 6)తిరిగి సోమసూత్రం నుండి వెనుకకు ధ్వజంవద్దకు, 7) ధ్వజ స్తంభంనుండి ముందుకు సోమసూత్రం వద్దకు, 8)సోమసూత్రం నుండి ధ్వజం దగ్గరకు, 9)అటునుంచి శివాలయంలోకి ధ్వజస్తంభపు ఎడమవైపునుండి వెళ్లాలి. దీన్ని చండీప్రదక్షిణం అంటారు. ఇది నవ ప్రదక్షిణాలతో కూడిన ప్రదక్షిణం. ఇది ఒక్కటిచేస్తే శివునకు ముప్పైవేలప్రదక్షిణలు చేసినంత పుణ్యం. రెండవ ప్రదక్షిణంలో ధ్వజాన్ని తాకరాదు. రెండు సోమసూత్రా లుంటే ఈ ప్రదక్షిణ పనికిరాదంటారు.

**ప్ర) ఏ ఊళ్లోనైనా శ్మశానం ఉంటుంది. మరి కాశీని మాత్రమే 'మహాశ్మశానం' అంటారెందుకు?**

**జ)** 'శ్మశానం' అంటే 'లయమయ్యే చోటు' అని ప్రధానార్థం. ప్రతి ఊళ్లోని శ్మశానా లలో శరీరాలు లయమౌతాయి. మళ్లీ జీవుడు జననమరణప్రవాహంలో పడ తాడు. కానీ కాశీలో మరణించినవారి శరీ రాలే కాదు, జీవుడే పరమాత్మలో లయ మౌతాడు. మరి జన్మించడు. జీవులు లయ మయ్యే చోటు, తిరిగి సంసారబంధంలో పడని శాశ్వతముక్తిని పొందేచోటు "మహా శ్మశానం". బ్రహ్మజ్ఞానం పొందిన యోగి కూడా మోక్షాన్ని (శాశ్వతలయని) పొందు తాడు కనుక, తత్త్వపరంగా 'బ్రహ్మజ్ఞానమే మహాశ్మశానం. అది అజ్ఞానాంధకారం లేని 'వెలుగు' కనుక 'కాశి' క్రాంతి క్షేత్రం. మరో కోణంలో- ప్రళయకాలంలో అన్నీ నశించినా, తాను మాత్రం శాశ్వతంగా ఉండే చోటు కనుక కాశీ 'మహాశ్మశానం' అవుతుంది

ముఖచిత్రకథనం




# శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

– డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ

శ్రీకామాక్షీసమేతుడైన కపిలేశ్వరస్వామి మహాశివ లింగంగా వెలసిన దివ్యక్షేత్రం కపిలతీర్థం.

కృతయుగంలో ఒకానొక శివరాత్రిరోజున పాతాళ లోకంలో కపిలమహర్షి ప్రార్థనలకు, అభిషేకానికి ప్రసన్నుడైన శివపరమాత్మ వేంకటాచలం దిగువన లింగస్వరూపుడై భూమిని ఛేదించుకుని పెరుగుతున్నాడు. పెరుగుతున్న శివలింగాన్ని చూసిన కామధేనువు నాలుగువైపులా పాదాలను ఉంచి తన పాలధారలతో అభిషేకం చేయాలన్న కోరికతో, భక్తితో శివ లింగపెరుగుదలను అరికట్టింది. ఆనాటినుండి కామాక్షీసమేతు డైన శివుడు సంతోషంతో సద్యోజాత లింగాకృతిలో కపిలతీర్థ క్షేత్రంలో భక్తుల కోర్కెలను తీర్చటానికి సంకల్పించాడు. కలి యుగంలో కోరిన కోర్కెలను తీర్చే చింతామణిగా అలరారుతూ అర్చనలతో, అభిషేకాలతో శోభిల్లుతూ శివమయమై కపిల తీర్థంగా, ఆళ్వారుతీర్థంగా ప్రసిద్ధి చెందింది.

ఈ ఆలయానికి విచ్చేసే భక్తులు ఆలయగోపురం, గర్భాలయశిఖరం, ధ్వజస్తంభం, బలిపీఠం, ప్రాకారం, మూల మూర్తిగా స్వయంవ్యక్తమైన శివలింగాన్ని, కామాక్షీదేవిని దర్శిస్తారు. ఈ క్షేత్రంలో శివభక్తులైన చండికేశ్వరస్వామిని, వినాయకస్వామిని, సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని, నవగ్రహాలను కూడా దర్శించి తరిస్తున్నారు. ప్రదోషపూజలు, కల్యాణోత్స వాలు, శరన్నవరాత్రి ఉత్సవాలు, తెప్పోత్సవాలు, కృత్తికా దీపోత్సవాదులు ఈ క్షేత్రంలో వైభవంగా జరుగుతాయి.

ఇందులో పదిరోజులపాటు నిర్వహించబడే బ్రహ్మోత్సవాలు ఘనమైనవి. మాఘమాసంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో ధ్వజారోహణకు ముందురోజు సాయంత్రం శ్రీవినాయకస్వామి ఆధ్వర్యంలో వాస్తుపూజ, మృత్సంగ్రహణయాత్ర జరుగుతాయి. తరువాత రోజున అంకురారోపణం సశాస్త్రీయంగా నిర్వహించబడుతుంది.

**వాస్తుపూజ-** దోషరహితంగా మహోత్సవాలు పరి పూర్ణమవడానికి కారకుడు వాస్తుపురుషుడు. కనుక వాస్తుపూజతో సమస్తఋషి, దేవతాదులను ఆహ్వా నించి కూష్మాండాన్ని బలిగా సమర్పిస్తారు. తరు వాత ఎండుదర్భలను త్రాడుగా పేని వాస్తుపురుష ఆకారాన్ని కల్పించి, ఆ త్రాడును అగ్నితో జ్వలింప జేసి, ఆలయం చుట్టూ తిప్పుతూ, మంత్రఘోషలతో వాస్తుపురుషశాంతి పరిపూర్ణమౌతుంది.

**ధ్వజారోహణం-** ఆలయముఖమండపం వెలుపల మూల లింగానికి ఎదురుగా ఎత్తైన ధ్వజస్తంభం అలరారుతోంది. అందంగా అలంకరించిన నందీశ్వరపటం కలిగిన ధ్వజా రోహణం భేరీమృదంగాది వాయిద్యశబ్దాలమధ్య వేదమంత్రో చ్చారణల మధ్య శైవాగమపద్ధతిలో జరుగుతుంది.

కపిలేశ్వరుని బ్రహ్మోత్సవాలకు అష్టదిక్పాలకులను, యక్ష, గంధర్వ, కిన్నర, కింపురుషాదులను, సమస్త భక్త, దేవతాబృందాలను వైదికంగా నందీశ్వరుడు స్వయంగా ఆహ్వా నించడం ఈ ధ్వజారోహణంలో ప్రధాన అంశం. ధ్వజారోహణ సందర్శనం సద్భక్తిని, ఆయురారోగ్యాలను, ఐశ్వర్యసంతోషాలను, జన్మాంతంలో కైలాసప్రాప్తిని ప్రసాదిస్తుంది.

**హంసవాహనం-** కపిలేశ్వరుని బ్రహ్మోత్సవాలలో తొలివాహనం హంసవాహనం. ఆదిదంపతులైన స్వామి, అమ్మవార్లు హంస మిథునంలా దర్శనమిస్తారు. కపిలాది యోగీశ్వరుల మానస సరస్సులో సంచరించే అనిర్వచనీయమైన హంసమిథునమే శివ పార్వతులు. ఆశ్రిత భక్తులకు ధర్మాధర్మాల జ్ఞానం కలుగుతుంది.

**సూర్యప్రభవాహనం-** మాయామోహాంధకారాన్ని తొలగించి వెలుగునిచ్చే సోమస్కందమూర్తి, సూర్యప్రభవాహనంతో భక్తుల సంసారతాపాన్ని పరిహరిస్తాడు. అంధకాసురుని సంహరించిన

కపిలేశ్వరస్వామిని సూర్యప్రభవాహనంపై దర్శించి భక్తితో నమస్కరిస్తారు. సూర్యప్రభాధీశుడిగా ఊరేగే శివుని పూజిస్తే ఆయుర్దాయం వృద్ధి చెందుతుంది.

**చంద్రప్రభవాహనం-** కామాక్షీసమేతుడైన చంద్రమౌళీశ్వరస్వామి వారు బ్రహ్మోత్సవాలలో చంద్రప్రభవాహనంపై విహరిస్తాడు. చంద్రుడు షోడశకళాప్రపూర్ణుడు. శివమహాదేవుడు ధవళ తేజస్సుతో వెలుగుతూ విభూతి సౌందర్యంతో, తన కరుణ కిరణాలతో అమృతశీతల కాంతులను జీవులకు అనుగ్రహిస్తాడు. చంద్రశేఖరుని సందర్శనంతో ఆశ్రయించిన చంద్రునికి క్షయ నివారణ, ఆశ్రితభక్తులకు అక్షయ సిరిసంపదలు లభిస్తాయి.

**భూతవాహనం-** కామాక్షీసమేతుడైన కపిలేశ్వరస్వామి సోమ స్కందమూర్తియై భూతవాహనంపై ఊరేగుతాడు. పూర్వం క్రూర భూతాలు ప్రజలను పట్టి పీడిస్తున్న వేళ బ్రహ్మదేవుడు పరమ శివుని భూతాలను నిగ్రహించి లోకరక్షణ చేయమని వేడు కొన్నాడు. శివుడు భూతాలను వశం చేసుకొని శ్మశానాలలో ఉంచడం ద్వారా భూతపతిగా జీవుల భయాలను తొలగిస్తున్నట్లు మహాభారతం చెబుతున్నది. కపిలతీర్థప్రాంతంలోని ఆలయ వీథులలో భూతవాహనంపై ఊరేగుతున్న వేళ భక్తులు ఆనందంతో శివవిభూతిని నోరార కీర్తించి తరిస్తారు.

**సింహవాహనం-** బ్రహ్మోత్సవాలలో సింహవాహనంపై కపిలేశ్వర స్వామి ఉత్సవమూర్తిగా ఊరేగుతూ భక్తుల తామసగుణాన్ని పరి హరిస్తున్నాడు. మృగరాజువంటి శివమహాదేవుడు కొలువై అభయ మిచ్చి పాలిస్తుంటే అరిషడ్వర్గాలనే క్రూరమృగాల భయం ఉండదు.



**2025, ఫిబ్రవరి 19 నుండి 28 వరకు**
**శ్రీకపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా...**

**మకరవాహనం-** బ్రహ్మోత్సవాలలో భాగంగా మకరవాహనుడై కపిలతీర్థవిభుడు ఊరేగుతాడు. జలచరమైనప్పటికి మకరం ఐశ్వర్యానికి సంకేతం. మకరం గంగాదేవికి వాహనం. గంగా దేవికి వాహనమైన మకరం తీవ్ర తపస్సు చేసి శివానుగ్రహాన్ని పొంది వాహనమయ్యేటట్లు వరాన్ని పొందినట్లు శైవాగమం తెలుపుతున్నది. భక్తులు మకరవాహనంపై ఉన్న పరమశివుని దర్శించి తరిస్తున్నారు.

**శేషవాహనం-** కామాక్షీసమేతుడై సోమస్కందమూర్తి శేష వాహనంపై ఊరేగుతారు. పాతాళలింగం వెలసిన ప్రదేశం కైలాసం వలె మహిమాన్విత దివ్యక్షేత్రంగా వెలసింది. ఆది శేషుడు క్షీరసాగరశయనుడైన శ్రీహరికి నిత్యశయ్య. ఆ సత్యాన్ని చాటి చెప్పడానికే శేషవాహనంపై సోమస్కందమూర్తి కామాక్షీ దేవితో బ్రహ్మోత్సవాలలో విహరిస్తున్నాడు.

**అధికార నందివాహనం-** అధికార నందివాహనం కపిలేశ్వర స్వామి వాహనసేవలలో విశిష్టమైనది. దీనికి నామాంతరమే కైలాసనంది. ఈ నంది తపస్సు, శౌచము, దయ, సత్యమనే నాలుగుపాదాలతో ఉన్న ధర్మరూపం. మాఘబహుళ చతుర్దశి రాత్రి శివరాత్రి సమయంలో సోమస్కందమూర్తి నందివాహనంపై ఊరేగుతారు. కపిలతీర్థమహోత్సవాలలో విశేషవాహనమైన నందివాహనసేవలో భక్తులు విశేషంగా పాల్గొంటారు.

**తిరుచ్చివాహనం-** యోగులు నిర్మల ధ్యానయోగమూర్తియైన కపి లేశ్వరుని తిరుచ్చివాహనంపై దర్శించగానే ప్రశాంతచిత్తాన్ని పొందుతున్నారు. భక్తులు కపిలతీర్థక్షేత్రానికి వచ్చి సాలోక్య ముక్తి, సామీప్యముక్తి, సారూప్యముక్తి, సాయుజ్యముక్తులను పొందుతున్నారు.

**వ్యాఘ్రవాహనం-** వ్యాఘ్ర చర్మాంబరధారియైన కపిలేశ్వరస్వామి వ్యాఘ్రవాహనంపై విహరిస్తూ భక్తలోకంలోని అజ్ఞాన తమస్సు లను తొలగిస్తున్నాడు. శివునికి భక్తితో బిల్వదళం సమర్పిస్తే చాలు, శివపదప్రాప్తి లభిస్తుంది. మాఘమాసంలో ఈ పూజ విశేషఫలదాయకమని శివధర్మం చెబుతున్నది.

**గజవాహనం-** గజచర్మధారి, కామాక్షీవల్లభుడైన కపిలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో కపిలతీర్థవీథులలో గజవాహనంపై ఊరేగుతాడు. తమోగుణానికి నిలువెత్తు రూపం గజం. అందు

వలన గజవాహనారూఢుడైన కపిలేశ్వరుని దర్శించి, తమలోని తమస్సును తొలగించుకొని, జ్ఞానస్వరూపమైన శివజ్యోతిని వెలిగించుకోవాలని భక్తులు ఆకాంక్షిస్తారు.

**కల్పవృక్షవాహనం-** కపిలేశ్వరస్వామి కల్పవృక్షవాహనంపై ఊరేగుతూ ఆశ్రయించిన భక్తులను కోరిన కోర్కెలను తీరుస్తాడు. భక్తులు ఈ శివకల్పవృక్షచ్ఛాయలో చల్లని అపవర్గ సుఖాలు సిద్ధిస్తాయని, లౌకిక సిరిసంపదలేకాక అలౌకికమైన ఆముష్మిక ఫలాలను పొందుతారని తెలుస్తున్నది.

**రథోత్సవం-** కపిలేశ్వరస్వామి భక్తుల మనోరథాలను పూరించాలని రథవాహనాన్నెక్కి ఊరేగుతారు. త్రిపురాసుర సంహార సమయంలో శివునికి భూదేవి రథంగా, వేదాలు గుర్రాలుగా, సూర్యచంద్రులు రథచక్రాలుగా, బ్రహ్మ రథసారథిగా అయ్యాడని మహాభారతం తెలియజేస్తోంది. శివరాత్రినాడు మహారథికుడైన శివుని త్రిపురాసురసంహారుడిగా, ఆయురారోగ్యప్రదాతగా భక్తులు స్తుతిస్తున్నారు. వాహనాలన్నిటిలో రథమే ప్రసిద్ధమైంది. రథస్థుడైన ఈశ్వరదర్శనం జన్మరాహిత్యాన్ని ఫలంగా ప్రసాదిస్తున్నది.

**పురుషామృగం-** బ్రహ్మోత్సవ సమయంలో కపిలేశ్వరుడు పురుషామృగంపై విహరిస్తూ, మానవమస్తిష్కంలోని పశుత్వాన్ని నియంత్రిస్తున్నాడు. పశుత్వంనుండి సుగతిని పొందాలంటే శివారాధనే మూలమవుతున్నది. భక్తబృందాలు పురుషామృగంపై అధిరోహించిన కపిలేశ్వరుని దర్శించి శివోహమనే అద్వైతసిద్ధిని, పరతత్త్వలబ్ధిని పొందుటకు కపిలతీర్థాన్ని సందర్శిస్తున్నారు.

**కల్యాణోత్సవం-** బ్రహ్మోత్సవ సందర్భంగా కపిలతీర్థస్వామికి, కామాక్షీదేవికి కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించబడుతుంది. ఈ సందర్భంలో స్వామికి, అమ్మవారికి ముమ్మార్లు పూమాలలు మార్చుకునే రసవత్తర సంఘటన జరుగుతుంది. వేదపండితులు శ్రీసూక్తాన్ని పఠిస్తుంటే మాంగల్యాన్ని పీచు కలిగిన కొబ్బరికాయపై ఉంచి, అర్చించి ధూపదీపనైవేద్యాలు సమర్పించి, అర్చకుల సహకారంతో మహాదేవుడు అమ్మవారికి మాంగల్యధారణ చేస్తాడు. ముక్కోటి దేవతలు ఆదిదంపతులను పుష్పవృష్టితో ముంచెత్తుతారు. అక్షతారోపణం, మంగళహారతి, లాజహోమం, పూర్ణాహుతి, హోమభస్మధారణం జరుగుతుంది. ప్రధానమహానివేదనం, మంగళహారతితో కల్యాణోత్సవం పరిపూర్ణమవుతుంది.

**అశ్వవాహనం-** బ్రహ్మోత్సవాలలో సోమస్కందమూర్తి అశ్వవాహనంపై ఊరేగగా, వెనువెంట కామాక్షీమాత కూడా సర్వాభరణభూషితురాలై అనుసరిస్తుంది. యాగాలలో అశ్వమేధ యాగం సుప్రసిద్ధమైనది. ఇది ఈశ్వరునికి ప్రీతిని కలిగిస్తుంది. సూర్యుడు అశ్వరూపందాల్చి శుక్లయజుర్వేదాన్ని యాజ్ఞవల్క్యునికి బోధించినట్లు విష్ణుపురాణం తెలియజేస్తున్నది. సర్వవిద్యలకు అధిదేవతగా హయగ్రీవుని భావించడం ప్రసిద్ధమైంది. విశేష దివ్యాభరణాలతో, సుపుష్పమాలికలతో కామాక్షీసమేతుడైన కపిలేశ్వరుడు అశ్వవాహనంపై దర్శించిన భక్తజనులు మహాఫలాలను వరంగా పొందగలరు.

**రావణాసురవాహనం-** భక్తచింతామణియైన కపిలేశ్వరస్వామి నందిధ్వజావరోహణం తరువాత రావణాసురవాహనంపై విహరిస్తారు. రావణుని శివభక్తి విశిష్టమైనది. భక్తితో చేసిన శివతాండవస్తోత్రం ఎందరో భక్తులు నిత్యం పఠిస్తున్నారు. భక్తులు రావణాసురవాహనంపై విహరిస్తున్న శివమహాదేవుని దర్శించి ధర్మవిరుద్ధమైన కోరికలు తొలగించుకుని, శివానుగ్రహంతో తరిస్తారు.

**త్రిశూలస్నానం-** బ్రహ్మోత్సవాలలో చివరి ఉత్సవం కపిలేశ్వరుని ఆయుధమైన త్రిశూలానికి స్నానం చేయించడం. 'శూలమస్యాస్తీతి శూలీ' అని వ్యుత్పత్తి. శివుని ఆయుధాలలో విశిష్టమైంది త్రిశూలం. శివభక్తుల పాపాలను పరిహరించే మహాశక్తి స్వరూపం త్రిశూలధారియైన శివుని మంగళస్వరూపం. చంద్రశేఖరస్వామి, మనోన్మణి అమ్మవార్లు ఒక పల్లకిపైన, త్రిశూలం మరో పల్లకిపైన కపిలతీర్థానికి వచ్చి పూజలందుకుంటారు. తరువాత జరిగే పవిత్ర త్రిశూలస్నానం భక్తుల మనస్సుల కల్మషాలను పరిహరిస్తుంది. త్రిశూలస్నానదర్శనం శివపద ప్రాప్తినిస్తుంది. శివుని త్రిశూలస్నానం పరమపవిత్రం, పరతత్త్వ ప్రాయకం. ఈ త్రిశూలస్నానంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.



# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



## గత సంచిక తరువాయి..

ఆ తర్వాత "మునులారా! బ్రహ్మదేవుడు కన్యామాసంలో నాకు మహోత్సవాలను నిర్వహించడంకోసం సకలసన్నాహాలు పూర్తి చేశాడు. చతుర్ముఖుని సంకల్పం నెరవేరడంకోసం నేను భూలోకవాసుల్ని నా చెంతకు వచ్చేలా చేస్తాను. కొండలెక్కి భక్తితో వచ్చేవారికి కోరిన కోరికలు తీరుస్తాను. నా లీలలను కర్ణాకర్ణిగ విని భక్తితో సేవించేవారికి వరాలు ప్రసాదిస్తాను. అలాంటివారు నా దగ్గరున్నా, సుదూరంలో ఉన్నా తప్పక వారు కోరిన వాటిని అనుగ్రహిస్తాను. కష్టాలలో తోడునీడగ ఉండి విశ్వాసం పెంచుతూ రక్షిస్తాను. అలాగే దేహాంతమయ్యాక అలాంటివారికి పుణ్యగతులు కల్పిస్తాను." అని స్వామి చెప్పాడు.

హరిపలుకులు విన్న మునులు చాల సంతోషపడ్డారు. శేషాద్రిపైనే ఐదేళ్లు గడిపారు. ఐదేళ్లు గడవగానే స్వామి "మునులారా! మీరింక ఇంతకాలముండడం ఎందుకు? మీమీ ఆశ్రమాలకు వెళ్లండి" అని అనుమతిచ్చాడు.

మునులు శ్రీభూనీళాది సతులతోడి శ్రీవేంకటేశ్వరునికి మొక్కారు. స్వామి సన్నిధానం వదలివెళ్లడానికి కాళ్లాడక అక్కడ తచ్చాడసాగారు. స్వామి ముఖారవిందాన్ని కనులారా దర్శించి దర్శించి ఆనంద బాష్పాలు రాలుస్తూ ముందడుగులు వేసి మరల వెనుకకు చూస్తూ తన్మయంలో కదలలేక, కదలలేక ఉంటే స్వామి మునులతో- "పరమశ్రేష్ఠులారా! నేను నిర్గుణబ్రహ్మను అయినా సామాన్యమానవులను రక్షించడంకోసం సగుణవిలాసుడనవుతాను. కనుక, ఇక్కడే ఉండినట్లుంటాను. కానీ, అంతటా ఉంటాను. అంచేత వివేకికి నా తోడ వియోగం అసలు లేదు. నా విమలస్వరూపాన్ని భావించేవారికి సదా దగ్గరివాడనే. మీరు కూడ అలాంటి చిత్తపరిపాకంతో మసలండి, పుణ్యతమమైన నైమిశారణ్యానికి వెళ్లండి" అని అనుమతిస్తూ స్వామి మౌనముద్రతో అర్చారూపుడయ్యాడు.

తాము చూస్తుండగానే శిలారూపుడైన స్వామి సర్వావయవ సౌందర్యాన్ని దర్శిస్తూ మునులు ఆశ్చర్యంతో స్తోత్రం చేశారు.

స్వామికి పునఃపునః ప్రణామాలు చేస్తూ వేంకటాద్రి దిగి కపిలతీర్థమార్గంలో గిరిప్రదక్షిణం చేసి నైమిశారణ్యం చేరారు. నైమిశారణ్యం చేరుకున్న మునులు సరాసరి సూతుల వారి దగ్గరికు వెళ్లి-

"స్వామీ! మీ పురాణకథాశ్రవణంతో వేంకటాద్రిని దర్శించాలని మీ అనుమతితో వేంకటగిరికి వెళ్లాం. మీరు కనులకు కట్టినట్లుగా వర్ణించిన ప్రదేశాలను అన్నిటిని తనివితీరా చూచాం. మీ వాక్కులు అమృతోపమానం. మీ ప్రసంగమే తిరుమలగిరి చేరాలనే ఉత్సాహాన్ని కల్గించింది. మీరు వర్ణించిన ప్రదేశాలు అలాగే ఉన్నాయి. మీరు ఇంత చక్కగా ఎలా చెప్పారో మాకు వింతగా ఉంది.

"మేము చూసిన కొండ బంగారుమయంగా ఉంది. అక్కడి వనాలు చైత్రరథంలా ఉన్నాయి. క్రూరమృగాలు ఖడ్గమృగాదులు ఏమాత్రం జాతివైరం లేక కలిసిమెలసి వనాలలో సంచరిస్తున్నాయి. స్వామిపుష్కరిణి సంపూర్ణంగా పుణ్యజలాలతో నిండి ఉంది. ఆ పుష్కరిణికి పడమటి దిక్కులో భూవరాహదేవుడు వేంచేసి ఉన్నాడు. ఆ ఆలయానికి దక్షిణంలో బంగారువన్నెగల కలశాల గోపురాలు మంటపాలున్నాయి. వాటి మధ్య కాంతులీనే విమానాన్ని చూశాం. ఆ విమానంలోని శ్రీలక్ష్మీకాంతుని దర్శించగలిగాం. ఆ సందర్భనంలో మమ్మల్ని మేము మరచి

పోయాం. తదనంతరం స్వామిని స్తుతించగా స్వామి అర మరికలు లేకుండా మాతో సంభాషణలు కొనసాగించాడు.

స్వామి మధురోక్తులు వింటూ మైమరచి ఉంటే స్వామి "మునులారా! మీరు నైమిశానికి వెళ్లండని అనుమతి ఇచ్చాడు. మేము చూస్తుండగానే స్వామి 'శిలాకృతి' ధరించాడు. మాతో సంభాషించిన స్వామి మౌని కావడం మాకు వింతనిపించింది. ఈ దృశ్యాలను స్వయంగా వీక్షించిన మేము ఆ తర్వాత కొండ దిగాం. అయినా తెలియక ప్రశ్నిస్తున్నాం. గిరికి వెళ్లినవారం మేము. స్వామిని దర్శించిన వారం మేము. అక్కడ రామణీయ కాన్ని కనులారా గాంచిన వారం మేము. అయినా మీరు ఆ దృశ్యాలన్నీ ఎలా చెప్పగలిగారు? మీరూ దర్శించారా లేదా భావనతో వీక్షించారా?" అని ప్రశ్నించారు.

సూతుడు మునుల మాటలు విని చిరునవ్వుతో "మును లారా! ఇదంతా వ్యాసమునికటాక్షమే! ఆ కృపావీక్షణంతో నాకు సర్వమూ అనుభూతమౌతుంది. ఇదంతా నా ప్రతిభ అని భావించకండి. బాదరాయణుని అనుగ్రహమే నా చేత పలికిం చింది. నన్ను గొప్పగా భావించకండి. బాదరాయణుని భావించి చెప్పడం వల్ల సర్వమూ సత్యవాక్కులే అని గ్రహించండి.

ఆకాశంలోని నక్షత్రాలను లెక్కపెట్టవచ్చు. మంచు తుంపరలను లెక్కగట్టవచ్చు. ఇసుకరేణువుల్ని లెక్కపెట్టవచ్చు. కానీ వేంకటనాథుని చరితలు, లీలలు అసంఖ్యాకం. జన్మ సార్థకం. నాకు తోచినరీతిలో మీకు చెప్పగలిగాను" అని తాపసులకు ప్రత్యుత్తరమిచ్చాడు.

*తృతీయాశ్వాసం సంపూర్ణం* *(ఇంకా ఉంది)*

## గ్రంథసమీక్ష

## శ్రీవేంకటేశ్వర చిత్రార్చన

**సంకలనం**– డా॥ జి.వెంకటేశ్వర్లు (సాగర్ గిన్నె), బి.ఆనంద్, ఎ.రామచంద్రయ్య, కె.మహేశ్వర్; **సైజు**–ఎ4 సైజు; **పుటలు**–204; **ధర**–రూ. 1,116/–; **ప్రతులకు**– భీసం కళారామం ఆర్ట్‌గ్యాలరీ, 11-22-101/3 ఎ, పూలవానిగుంట, రేణిగుంట రోడ్డు, తిరుపతి–517 507, సెల్: 94403 67826/ 94913 11407.

భారతీయులకు ఆధ్యాత్మికచింతన అనాది కాలం నుండి చాలా ఎక్కువ. నిత్యజీవితానికి లలితకళలను వాడుకున్న కళాకోవిదులందరూ, తమ కళానైపుణ్యాన్ని ఆధ్యాత్మికరంగంలో కూడా ప్రదర్శించారు. ఇందుకు నిదర్శనం ఆలయాలే! కలి యుగంలో తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆపదమొక్కుల వాడుగా, అనాథరక్షకుడుగా, అఖిలాండకోటి బ్రహ్మాండనాయ కుడుగా కొలువబడుతున్నాడు. ఇంతటి ప్రాశస్త్యం గల స్వామికి సంబంధించిన అనేకచిత్రాలు దేశం నలుమూలలనుండి ప్రసిద్ధ చిత్రకారులనుండి సేకరించి పొందుపరచిన విశిష్టగ్రంథం **'శ్రీవేంకటేశ్వర చిత్రార్చన'.**

ఈ గ్రంథానికి డా॥జి.వేంకటేశ్వర్లు, బత్తుల ఆనంద్, ఎ.రామచంద్రయ్య, కె.మహే శ్వర్‌లు సంపాదకులుగా వ్యవహరించారు. 200మంది చిత్రకారులు శ్రీవేంకటేశ్వర స్వామి రూపాన్ని, క్షేత్రాన్ని, స్వామివారిసేవ లను వివిధరీతుల్లో చిత్రించారు. వాటినన్ని టిని శ్రీకళాక్షేత్రసంస్థ సంకలన గ్రంథంగా మనకు అందించింది. ఒకరకంగా చెప్పా లంటే శ్రీవారికి చిత్రకైంకర్యహారతి ఈ పుస్తకం. 'శ్రీవారి పరదా' చిత్రంతో స్వాగతం పలికిన ఈ పుస్తకం 'ఆపదమొక్కులవాడు' అనే చిత్రంతో ముగిసింది. తంజావూరు




పెయింటింగ్స్, ఆయిల్‌కలర్ చిత్రాలు, రాజారవివర్మచిత్రాలు, కలంకారీ రేఖాచిత్రాలు... ఇలా అనేక చిత్రకళారీతుల్లో సర్వాంగ సుందరంగా పూర్తి ఆర్టుపేపరుపై రూపుదిద్దుకున్న పుస్తకమిది. ప్రతి చిత్రం క్రింద చిత్రకారుడి ఫోటో, చరవాణి సంఖ్య, బొమ్మకు తగిన సంక్షిప్త వ్యాఖ్య ఇవ్వడం అదనపు ఆకర్షణ. పుటలు తిప్పు తుంటే స్వామివారు మన ముందు ప్రత్య క్షమైనంత దివ్యానుభూతి కలుగుతుంది. శ్రీవారిభక్తులు, చిత్రకళాప్రియులు, పుస్తక సేకరణ చేసేవారు తప్పకుండా కొని దాచుకోదగ్గ పుస్తకమిది! ఇలాంటి పుస్తకాలు పాఠకలోకంలోకి రావడమే అరుదు. అలా వచ్చినపుడు ఆదరిస్తే, మరిన్ని పుస్త కాలు ఇలాంటివి వచ్చేందుకు అవకాశం ఉంటుంది. *–డా॥ కంపల్లె రవిచంద్రన్.*

# వాణీ వాణీ నమో నమో! వీణాపాణీ నమో నమో!

- డా॥ కప్పగంతు రామకృష్ణ
90320 44115




ఆమె అక్షరం.. ఆమె అక్షయం.. ఆమె గీర్వాణి.. ఆమె సకలశాస్త్రాలకూ రారాణి ఆమె జ్ఞానం.. ఆమె సర్వవిద్యలకూ మూలం... వాల్మీకి నోట ఆదికావ్యాన్ని పలికించిన తల్లి ఆమె. వ్యాసభగవానుడి చేత అపారసాహిత్యాన్ని రాయించిందీ ఆ తల్లే! యాజ్ఞ వల్క్యుడు, ఆదిశంకరులు, ఆదిశేషువు, బృహస్పతి అందరూ ఆమె అనుగ్రహంతోనే అనంతమైన జ్ఞానాన్ని వరప్రసాదంగా అందుకున్నారు. ఆ తల్లి సరస్వతి... మనలోని విజ్ఞానానికి మాతృమూర్తి. ఆమె ఆవిర్భవించిన రోజు వసంతపంచమి.

మాఘమాసం ప్రకృతి వికాసానికి, సరస్వతి మనోవికాసానికి సంకేతం. ఈ రెండింటి కలయిక పరిపూర్ణ వికాసానికి నిదర్శనం. దీనికి ప్రతీకగా వసంతపంచమి వ్యాప్తిలోకి వచ్చింది. మనిషిలో ఉండే అవిద్య లేదా అజ్ఞానం తొలగిపోయి ఎప్పుడు జ్ఞానం అనే వెలుగురేఖ ప్రసారమౌతుందో ఆ రోజు మనిషివికాసానికి ప్రారంభసూచిక అవుతుంది. అజ్ఞానం అనే మంచుతో గడ్డకట్టిన మనిషి హృదయాన్ని చదువు అనే వేడితో కరిగించి జ్ఞానం అనే వెలుగును ప్రసరింపజేయటమే వసంతపంచమి అంత రార్థం. మాఘమాసంలో వచ్చే శుక్లపక్ష పంచమిని వసంతపంచమిగా చేసుకుంటాం. ఈ రోజుకే శ్రీపంచమి, మదనపంచమి, సరస్వతీజయంతి అనే పేర్లు కూడా వాడుకలో ఉన్నాయి.

చైత్ర, వైశాఖమాసాల్లో వచ్చే వసంతఋతువుకు స్వాగతోపచారాలు మాఘ మాసంలోనే మొదలౌతాయి. కాలగమనాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే మకరసంక్రమణం (సంక్రాంతి) తర్వాత వాతావరణంలో స్పష్టమైన మార్పులు కనిపిస్తాయి. మాఘమాసం ప్రారంభం కావడంతోనే చెట్లు చిగురించడం, పూలు పూయడం మొదలౌతుంది. చలి, ఎండల మిశ్రమ వాతావరణం ప్రజలకు ఎంతో హాయి కలిగిస్తుంది. పంటలు నిండుగా చేతికి వచ్చి ఉంటాయి. పాడి పశువులకు పుష్కలంగా గ్రాసం లభిస్తుంది. దీంతో అవి సమృద్ధిగా పాలనిస్తాయి. గ్రహగమనాలన్నీ శుభస్థానాల్లో జరుగుతాయి. వివాహాది శుభకార్యాల సందడి మొదలౌతుంది. మొత్తంగా మానవజీవితానికి అత్యంత ఆనందాన్ని, సంతృప్తిని ఇచ్చేకాలం ప్రారంభమవుతుంది. ఇదంతా రాబోయే వసంతమాసానికి స్వాగతం పలుకుతున్నట్లుగా ఉండి వసంతసందడి ముందుగానే వచ్చిన అనుభూతి కలిగిస్తుంది.

పురాణ, ఇతిహాసపరంగా కూడా వసంతపంచమికి ఎంతో ప్రాధాన్యత ఉంది. బ్రహ్మవైవర్తపురాణం, హేమాద్రి తదితర గ్రంథాల్లో ఇందుకు సంబంధించిన అనేక విషయాలు వివరణాత్మకంగా ఉన్నాయి.

ఈరోజును బెంగాల్‌లో శ్రీపంచమిగా మూడు రోజులపాటు ఉత్సవం నిర్వహి స్తారు. ఉత్తరభారతంలో ఈ రోజున ఉదయం నుంచే సరస్వతీదేవిని పూజించి, సాయం కాలం ఆ ప్రతిమకు ఊరేగింపు జరిపి, నిమజ్జనం చేసే ఆచారం కొనసాగుతోంది. వసంతఋతువుకు స్వాగతం పలికే రోజు వసంతపంచమి అని, ఇది ఋతువులకు సంబంధించిన పండుగ అని శాస్త్రాలు చెబుతున్నాయి. పంజాబ్, బీహార్ రాష్ట్రాల్లో ఈ రోజున పతంగుల పండుగ చేసుకుంటారు. వేదవ్యాసమహర్షి గోదావరీనదీతీరంలో ఇసుకతో సరస్వతీదేవిని ప్రతిష్ఠించి, అర్చన చేశాడు. వ్యాసుడి కారణంగా ఏర్పడిన ఆ క్షేత్రమే 'వ్యాసర' లేదా 'వ్యాసపురి' కాలక్రమంలో 'బాసర'గా ప్రసిద్ధి పొందింది.

## శ్వేతరూపం... జ్ఞానదీపం

సరః అంటే కాంతి. కాంతి అంటే జ్ఞానం. మన జీవితాన్ని జ్ఞానంతో నింపే మాతశక్తి సరస్వతి. శుద్ధజ్ఞానానికి ఆమె ప్రతీక. వికాసం, విజ్ఞానాలకు ఆమె ఆకృతి. అక్షర అక్షయసంపదలకు మూల మైన ప్రణవస్వరూపిణి ఆమె. వేదజ్ఞానా నికి మాతృకగా, గాయత్రిగా, సావిత్రిగా, లౌకిక, అలౌకిక విద్యల ప్రదాతగా ఆమె పూజలందుకుంటోంది. సరస్వతి అనే శబ్దానికి ప్రవాహం అనే అర్థం కూడా

ఉంది. ప్రవాహం అంటే నిరంతరం సాగిపోయే చైతన్యం. సాధారణంగా జలం నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. జలం జీవ శక్తికి సంకేతం. దాన్నుంచే అన్ని జీవులకూ శక్తి అందుతోంది. తద్వారా ప్రకృతిలో ఉత్పాదకత జరుగుతోంది. ఈ ఉత్పాదకతకు ప్రతిఫలమే సరస్వతి(జ్ఞానం). సృష్టికార్యాన్ని నిర్వహించే బ్రహ్మ దేవుడికి కూడా అందుకు తగిన జ్ఞానాన్ని సరస్వతి అందిస్తుంది.

సరస్వతీ అవతారం అహింసకు కూడా తార్కాణంగా కనిపిస్తుంది. తెల్లటి వస్త్రాలు, తెల్లటి పువ్వులు, తెల్లటి ముత్యాల సరం, గంధపు పూత ఇవన్నీ గీర్వాణికి ఇష్టమైనవి. ఇవన్నీ శాంతికి, స్వచ్ఛతకు చిహ్నాలు. ఏవిధమైన ఆయుధాలూ ఆమె చేతిలో ఉండవు. మనలో ఉన్న అజ్ఞానమనే రాక్షసుడిని సంహరించే విజ్ఞానమనే ఆయుధాన్ని అందించే పుస్తకాన్ని చేతుల్లో పట్టుకుని ఉంటుంది. జ్ఞానం ఉన్న చోట హింసకు, అశాంతికి తావుండదు కదా. ఇంకో ఉపమానంలో తెలుపు శుభ్రతకు, నిర్మలత్వానికి, స్వచ్ఛతకు ప్రతీక. ఈ ప్రకారం సరస్వతి స్వచ్ఛతకు ఆలంబనగా నిలుస్తుంది. అన్నిరకాలైన విద్యలు సరస్వతీదేవి అనుగ్రహంతో లభిస్తాయి. అంటే, విద్య ద్వారా మనిషి స్వచ్ఛంగా తయారై, నిర్మలహృదయంతో ప్రకాశిస్తాడని అర్థం చేసుకోవచ్చు.

నదుల పరంగా చూస్తే గంగ, యమునలతో కలిసి సరస్వతి అంతర్వాహినిగా ప్రవహిస్తుంది. ఈ కోణంలో చూస్తే జ్ఞానం మనిషిలో అంతర్లీనంగా ప్రవహించాలే కానీ బాహ్య ప్రదర్శనల కోసం విజ్ఞానాన్ని ప్రకటించకూడదనే సందేశాన్ని సరస్వతీనది ద్వారా మనకు అందుతుంది.

సరస్వతీదేవి చేతిలో ఉన్న పుస్తకం జ్ఞానానికి సంకేతం. పుస్తకం ద్వారా జ్ఞానం లభిస్తుంది. జ్ఞానం మనిషిలో తీర్చిదిద్దిన సంపూర్ణవ్యక్తిత్వానికి, హృదయనిర్మలత్వానికి ప్రతీక. సంహరించాల్సింది వ్యక్తిని కాదు... అతడిలోని రాక్షసగుణాన్ని మాత్రమే అనే సంకేతాన్ని సరస్వతిచేతిలోని పుస్తకం ద్వారా అందుతుంది.

అమ్మ చేతిలో వీణ సంగీతానికి ప్రతిరూపం. ఈ వీణ పేరు 'కచ్ఛపి'. చదువంటే కేవలం పుస్తకాల్లో ఉండేది మాత్రమే కాదు. కళలన్నీ చదువులో భాగమే. కళాకారుడు అత్యుత్తమ సంస్కారం, ఆత్మీయత కలిగి ఉంటాడు. మనుషులందరూ ఇలాంటివారు కావాలని సరస్వతిచేతిలోని వీణ చెబుతుంది. అందులో ఏడు తంత్రులు ఉంటాయి. వీటిద్వారా నాదం ఉత్పత్తి అవుతుంది. మనం చూసే ప్రపంచమంతా నాదమయం. పరమేశ్వరుడు నాదస్వరూపుడు. కాబట్టి, పరమేశ్వరుడిని చేరుకోవాలంటే నాదోపాసన చెయ్యాలన్న సందేశం కూడా సరస్వతీదేవి చేతిలోని వీణ చెబుతుంది.

ఆమె వాహనం హంస. పాలలో కలిసిన నీటిని వేరు చేసి కేవలం పాలను మాత్రమే స్వీకరించే గుణం హంసకు ఉంది. సమాజంలో మంచి, చెడూ పాలూనీళ్లలా కలిసే ఉంటాయి. ఉత్తమ జ్ఞానం కలిగిన వ్యక్తి హంసలాగా చెడును వదిలేసి మంచిని మాత్రమే గ్రహించాలని చెప్పటం హంస వాహనం ఇచ్చే సందేశం.

కమలం వికాసానికి, పవిత్రతకూ చిహ్నం. కమలం పుట్టుక బురదలోనే. కానీ, బురద వాసన, అపవిత్రత దానికి సోకవు. అందుకే అమ్మకు కమలం ఆసనమైంది. అలాగే మనిషి కూడా అనేక అపవిత్రాలు ఉండే సమాజంలో ఉంటూనే తన పవిత్రతను కాపాడుకోవాలి. మనోవికాసాన్ని సాధించాలనే సందేశాన్ని కమలం అందిస్తుంది. మన శరీరంలో ఉండే కుండలినీశక్తి జాగృతమైనప్పుడు అందుకు ప్రతీకగా కూడా కమలాన్ని యోగసాధకులు చెబుతారు.

సరస్వతీదేవి ధరించే ధవళవస్త్రాలు స్వచ్ఛతకు చిహ్నం. మనిషి కూడా స్వచ్ఛంగా ఉండాలని ఇవి సూచిస్తాయి. తెలుపు వస్త్రం ఏ చిన్న రంగు పడినా అది సహజత్వాన్ని కోల్పోతుంది. చూడటానికి ఇంపుగా ఉండదు. మనిషి కూడా అంతే. ఏ చిన్న అపవాదు వచ్చినా, తప్పుచేసినా ఆ ఫలితం అతడి జీవితాంతం వెన్నంటి ఉంటుంది. అందుకే, ఏ తప్పూ చెయ్యకుండా స్వచ్ఛంగా, తెల్లటి వస్త్రంలా ఉండాలని ధవళవస్త్రాలు సూచిస్తాయి.

ఆమె చేతిలోని రుద్రాక్షమాల ఆత్మచైతన్యాన్ని సూచిస్తుంది. కేవలం భౌతిక, లౌకికమైన విద్య మాత్రమే మనిషిని భగవంతుడి వద్దకు చేర్చలేదు. అతడు ఆధ్యాత్మికసాధన చెయ్యాలి. రుద్రాక్ష సాక్షాత్తు శివస్వరూపం. ఆత్మసాక్షాత్కారం పొందటానికి రుద్రాక్ష మార్గం చూపుతుంది. రుద్రాక్షను ఋషులు భూమికి, స్వర్గానికి మధ్య వారధిగా భావిస్తారు.

# జగమంత సంబరం

– శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి, 90325 22382

శివుడు.. బోళాశంకరుడు, భక్తవశంకరుడు. పత్రం, పుష్పం, ఫలం, తోయం...వీటిలో ఏది సమర్పించినా ఎంతో ఆనందంగా స్వీకరిస్తాడు. త్రికరణశుద్ధిగా తనను కొలిచే భక్తులను ఎంతో ప్రేమతో అనుగ్రహిస్తాడు. ఇంతటి పరమ కరుణామూర్తిని జగమంతా నిత్యం ఎంతో భక్తిశ్రద్ధలతో సేవించుకుంటుంది. శివాలయం లేని గ్రామం కూడా మన దేశంలో ఉండదంటే అతిశయోక్తి కాదు. ఇంతగా జన జీవితాల్లో, హృదయాల్లో శివయ్య నిండుగా కొలువై ఉన్నాడు.

ఓం నమశ్శివాయ... అని పంచాక్షరీమంత్రాన్ని ఒక్క సారి పలికినంతలోనే జన్మజన్మల పాపాల్ని పోగొట్టే పుణ్యమూర్తి పరమేశ్వరుడిని మహాశివరాత్రి పర్వదినాన జగమంతా ఎంతో భక్తిశ్రద్ధలతో పూజిస్తుంది. శివుడు అభిషేకప్రియుడు కాబట్టి నిత్యాభిషేకంతో పాటు మహాశివరాత్రి రోజున అనేక రకాలైన ద్రవ్యాలతో ప్రత్యేకంగా అభిషేకాలు చేస్తారు. వివిధ రకాలైన పుష్పాలతో అర్చిస్తారు. ప్రతి శివాలయంలోనూ ఈ అర్చనలన్నీ సాధారణంగా జరిగేవే. అయినప్పటికీ, కాల, ప్రాంత, ఆచార, ఆగమ భేదాల్ని బట్టి ఒక్కో ఆలయంలో ఒక్కోవిధంగా శివరాత్రి చేసుకోవటం అలవాటుగా వస్తోంది. స్థానిక సంప్రదాయాలతో పాటు పౌరాణిక నేపథ్యం కూడా ఈ మార్పులకు కారణంగా నిలుస్తోంది.

## శివరాత్రి... పౌరాణిక నేపథ్యం

సమస్తదేవతలలోనూ శివుడు భక్తసులభుడు. అందుకే అతడిని బోళాశంకరుడని అంటారు. శంకరుడు భక్త వశంకరుడు. అమృతం కోసం దేవదానవులు క్షీరసాగరమథనం చేశారు. అప్పుడు అమృతం కంటే ముందు హాలాహలం పుట్టింది. హాలాహలాన్ని అలాగే విడిచిపెట్టేస్తే అది ముల్లోకా లనూ దహించేసే ప్రమాదం ఉండటంతో దేవదానవులందరూ భీతావహులయ్యారు. హాలాహలం బారి నుంచి లోకాలను రక్షించాలంటూ మహాదేవుడైన శంకరుడిని శరణు వేడారు. లోకరక్షణ కోసం ఆ గరళాన్ని తానే మింగి, గొంతులో బంధించి గరళకంఠుడయ్యాడు. హాలాహలప్రభావానికి అతడి కంఠం కమిలి, నీలంగా మారడంతో నీలకంఠుడిగా పేరుపొందాడు. గరళాన్ని గొంతులో బంధించడం వల్ల అది శివునిలో విపరీత మైన తాపాన్ని పుట్టించసాగింది. ఆ తాపాన్ని తగ్గించుకోవడా నికి క్షీరసాగరమథనంలో పుట్టిన చంద్రుడిని తలపై ఉంచుకున్నాడు. నిరంతర తాపోపశమనం కోసం గంగను కూడా నెత్తిన పెట్టుకున్నాడు. అయినా, శివుడిని హాలాహలతాపం ఇబ్బంది పెడుతూనే ఉంటుందట. అందుకే భక్తులు నిత్యం శివలింగానికి అభిషేకం చేస్తూ ఉంటారు. హాలాహలం మింగి నప్పుడు దాని ప్రభావానికి శివుడు మూర్ఛిల్లాడట. ఆందోళన చెందిన దేవతలు శివుడికి మెలకువ వచ్చేంతవరకు జాగారం చేశారట. అందుకే ఏటా మాఘబహుళచతుర్దశినాడు వచ్చే మహాశివరాత్రిరోజున భక్తులు ఉపవాసం చేసి, జాగారం ఉంటారు. జాగారం ఉన్న సమయంలో శివనామసంకీర్తన తోనూ, జపధ్యానాలతోనూ కాలక్షేపం చేస్తారు. ఇదంతా మహాశివరాత్రిపర్వదినానికి గల పౌరాణిక నేపథ్యం.

## శివరాత్రి ఎక్కడెక్కడ? ఎలా?

నేపాల్‌లోని పశుపతినాథ్ ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం అత్యంత వైభవంగా జరుగుతుంది. స్థానికులతో పాటు ప్రపంచదేశాల నుంచి భక్తులు ఈ ఉత్సవాలకు హాజరవుతారు. పశుపతినాథ్‌ఆలయంలో నేతితో దీపాలు వెలిగించి, వీటితోనే ఆలయాన్ని పూర్తిగా అలంకరిస్తారు. ఈ దీపపు వెలుగులతో పశుపతినాథ్ కోవెల సరికొత్త అందాన్ని సంతరించుకుంటుంది. నేపాల్‌లోని శివశక్తిపీఠం వద్ద ఎంతో వేడుకగా అభిషేకాలు జరుపుతారు. ట్రినిడాడ్‌లో కూడా శివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని లింగోద్భవ సమయంలో ప్రత్యేకద్రవ్యాలతో అభిషేకాలు చేస్తారు.



బంగ్లాదేశ్‌లో ప్రజలు శివరాత్రిని ఎంతో భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. ఈ రోజున పరమేశ్వరుడు తమను అనుగ్రహించి వరం ఇవ్వటానికి తప్పకుండా తమ చెంతకు వస్తాడని భావిస్తారు. పరమేశ్వరుడి ప్రీతిగా అందరూ ఉపవాసాలు చేస్తారు. దీనివల్ల ఉత్తమ జీవిత భాగస్వామి దొరుకుతారని స్థానికుల విశ్వాసం.

మనదేశంలోని ఉజ్జయినీలో జరిగే మహాశివరాత్రి వేడుకల్లో భక్తులు బృందాలుగా పాల్గొంటారు. ఈరోజు తెల్ల వార్లూ ప్రార్థనలు చేస్తారు. జబల్పూర్ నగరంలోని తిల్వారా ఘాట్ ప్రాంతంలో కూడా శివరాత్రి ఉత్సవాలు వర్గ, ప్రాంత విభేదాల్లేకుండా అందరూ సమైక్యంగా జరుపుకుంటారు.

పరమపవిత్రమైన కాశీక్షేత్రంలో శివరాత్రిరోజున అన్ని ఇతర పూజాకార్యక్రమాలతో ప్రత్యేకంగా ఊరేగింపు జరుగుతుంది. ప్రధానమైన విశ్వనాథ ఆలయంలో రోజంతా అభిషేకాలు జరుగుతూనే ఉంటాయి. ప్రత్యేకంగా అర్ధరాత్రివేళ లింగోద్భవకాలంలో ఇక్కడ జరిగే అభిషేకార్చనలు అలౌకికమైన ఆనందానుభూతిని కలిగిస్తాయి. లక్షలాది ప్రజలు ఏకకంఠంతో చేసే శివపంచాక్షరీనామస్మరణ ఆధ్యాత్మిక భావతరంగాలను భక్తుల హృదయాల్లో ప్రవహింపజేస్తుంది. ఆలయానికి చేసే అలంకరణలు, భక్తులు చేసే శంఖనాదాలు, వేలసంఖ్యలో ఆలయానికి చేరుకునే సాధువులు... మొత్తంగా కైలాసమే దివి నుంచి భువికి దిగివచ్చిందా అన్నట్లు కాశీక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంతవైభవంగా జరుగుతాయి. వీటన్నిటితో పాటు ఇక్కడ జరిగే ఊరేగింపు శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఇక్కడి మృత్యుంజయ ఆలయం నుంచి విశ్వనాథ ఆలయం వరకు ఈ ఊరేగింపులో లక్షలాదిగా ప్రజలు పాల్గొంటారు.

కోటప్పకొండ క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రభల ప్రదర్శన అత్యంత వైభవంగా జరుగుతుంది. ప్రభల బండ్లకు కావలసిన ఎడ్లపై భక్తులు ఎంతగానో శ్రద్ధచూపుతారు. వాటిని రంగురంగుల కాగితాలతో అందంగా అలంకరిస్తారు. కొన్ని ప్రభలకు విద్యుత్ దీపాలు అమర్చుతారు. ఈ ప్రభల ఊరేగింపులో మొక్కుబడులున్న వారు ప్రభ ముందు నడుస్తారు. ప్రభ ముందు తప్పెట వాయిద్యాన్ని గమకాలతో సాగిస్తూ ఉంటే వాయిద్యానికి తగినట్టుగా బండికి కట్టిన ఎద్దులు ఠీవిగా నడుస్తూ ఉంటే, అలంకరించిన మువ్వల, గజ్జల, గంటల మోతలు తాళానికి అనుగుణంగా మోగినట్లుంటుంది. గ్రామాల గుండా ప్రయాణించేటప్పుడు గ్రామస్థులు ఎదురు వచ్చి స్త్రీలు కడవలతో నీరుపోయగా, పురుషులు కత్తిచేత బట్టి, దండకాలను చదువుతారు.

ఈ ఉత్సవంలో భాగంగా చిన్నపిల్లలు చిన్నప్రభలు నిర్మిస్తే, పెద్దలు దాదాపు 100 అడుగులకు పైగా ఎత్తు ప్రభలను నిర్మిస్తారు. గతంలో ఎడ్లబండ్లలో తీసుకువచ్చేవారు. ప్రస్తుతం ట్రాక్టర్లను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వీటిని ఊరేగింపుగా తీసుకువెళ్లి శివుడికి కానుకగా త్రికూటపర్వతం ముందు నిలుపుతారు. తెలుగురాష్ట్రాల్లో మేడారం తరువాత రెండో అతిపెద్ద జనజాతర శివరాత్రి రోజున కోటప్పకొండలోనే జరుగుతుంది. కోటప్పకొండ తిరునాళ్లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రపండుగహోదాను కల్పించింది.

శ్రీకాళహస్తిక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వారంరోజులపాటు అంగరంగవైభోగంగా జరుగుతాయి. ఈ రోజులలో ఆలయం లోపలనే కాకుండా నాలుగు ప్రధానవీథులైన నెహ్రూవీథి, కుంకాలవీథి, తేరువీథి, నగరివీథులు జనంతో కిటకిటలాడుతుంటాయి. చుట్టుపక్కల గ్రామాలనుంచే కాక పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకల నుంచి కూడా విశేషసంఖ్యలో భక్తులు హాజరౌతారు. మహాశివరాత్రి రోజున సుమారు లక్షకు పైగా భక్తులు స్వామిదర్శనార్థం విచ్చేస్తారు. శివుడు కళాప్రియుడు కాబట్టి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన వేదికపై రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన గాయకులు, హరికథకులు, నాట్యకళాకారులు, నర్తకీమణులు, భజనకళాకారులు, ధ్వన్యనుకరణ కళాకారులు, సంగీతవాయిద్యకారులు భక్తులను తమ కౌశలంతో రంజింపజేస్తారు.

మహాశివరాత్రి పర్వదినాన జరిగే నందిపై ఊరేగింపు కన్నుల పండుగగా ఉంటుంది. నందివాహనమెక్కి ఊరేగు శివుని ముందు అనేక జానపద కళాబృందాలు ప్రదర్శించే కళలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటాయి. మహాశివరాత్రి తరువాతి రోజు జరిగే రథయాత్రలో కూడా ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొంటారు. ఇంకా నారదపుష్కరిణిలో జరిగే తెప్పోత్సవం కూడా ఉత్సవాల్లో ప్రధాన వేడుక. అందంగా అలంకరించిన తెప్పలపై స్వామి వారిని మరియు అమ్మవారిని కోనేటిలో విహారం చేయిస్తారు. పట్టణం నడిబొడ్డులోగల పెళ్ళిమంటపంలో జరిగే కల్యాణోత్సవంలో వేలాది భక్తులు పాల్గొంటారు.

ధారావాహిక



# తిరుమల సమయాచారములు

## (తిరుమల–తిరుపతి ఐతిహ్యమాల)

**తెనుగు అనువాదకులు:**

**కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,**

**కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు**

*(గత సంచిక తరువాయి భాగం...)*

మరునాడు ఆరంభించి శ్రీరంగంలో వలే తిరుప్పల్లాండు మొదలైన ప్రబంధాలను, తరువాత ఏకాదశి మొదలు ఆరంభించి శ్రీముఖసూక్తిని (తిరువాయ్‌మొళి) అనుసంధించి, పూర్తిచేసి మరుసటిరోజున అనంతార్యుడు వేంకటాచలంపై శ్రీవేంకటాచలపతి శ్రీపాదాలందు నిర్దుష్టమైన కైంకర్యము తాము చేయవలెనని ప్రార్థించిన కైంకర్యాన్ని ప్రతిరోజూ చేసుకుంటూ మోక్షంకోరె శ్రీవైష్ణవులకు నిత్యానుసంధేయమగునట్లు దివ్యసూరి శ్రీసూక్తాల్ని ప్రవచనం చేస్తూ మధురకవివలే నమ్మాళ్వారుల శ్రీపాదాల పైని ప్రేమాతిశయంచేత చరమపురుషార్థ (ఆచార్య నిష్ఠా) ప్రతిపాదకమైన 'కణ్ణినుణ్ శిఱుత్తాంబు' అనే ప్రబంధాన్ని అనుష్ఠానపర్యంతమైన అనుసంధానంతోడ చరమపర్వమున (ఆచార్య నిష్ఠ) నిలచి మధురకవి దాసుడనే నామధేయము పొందడం వల్ల, వారు ప్రేమతోడ అనుభవించే 'కణ్ణినుణ్ శిఱుత్తాంబు' అనే ప్రబంధాన్ని సన్నిధిలో అనుసంధించు అనంతార్యునకు ఈ ప్రకారంగా ఒక శ్రీముఖ శాసనాన్ని అనుగ్రహించినట్లుగ నియమించి, అనుగ్రహించి 'మలై కునియనిన్నార్' అనే ప్రబంధగాయకులను 'వేంకటాచలమునే వాసస్థానంగా చేసికొనియుండుడు' అని నియమించి తిరుమలకు పంపారు.

ప్రబంధగాయకులు శ్రీముఖశాసనాన్ని శిరసావహించి సహకుటుంబులై తిరుమలకు వచ్చి మొదట శ్రీశైలానంతార్యుల భవనానికి పరస్పరాభ్యుత్థానాభివందనాదులైన తర్వాత శాసన శ్రీముఖాన్ని ఈయగా అనంతార్యులు దాన్ని తీసుకుని మిగుల సంతోషించి గాయకుల తోడ శ్రీశైలపూర్ణుల భవనానికి వెళ్లగా అతిప్రీతులై పరస్పరం అభినందించుకున్నారు. తర్వాత గాయకులు వారితో ఆ వృత్తాంతాల్ని విన్నవించగా శ్రీపూర్ణులు దాన్ని విని చిత్తమున మోదమంది అనంతార్యులతోను, గాయకులతోను, శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధికి వెళ్లి "దేవరవారు భగవద్రామానుజుల నియమన ప్రకారమే స్వీకరింపవలెను" అని మనవి చేయగ శ్రీవేంకటపతి కూడా ఆనందించి అర్చక ముఖంగా శ్రీశైలపూర్ణులు అనంతార్యులు, గాయకులు భగవదనుగ్రహపాత్రులగుదురు గాక!" అని మంగళాశాసనం ప్రసాదించారు.

తర్వాత అనంతార్యుడు ప్రతిసంవత్సరం అధ్యయనోత్సవానికి ముందుగ ఇయఱ్పా మొదలైన దివ్యప్రబంధాలన్నీ అనుసంధింపవలెనని, తరువాత అధ్యయనోత్సవంలో శ్రీముఖసూక్తి అనుసంధించి పూర్తిచేసి మరుసటిదినం 'కణ్ణినుణ్ శిఱుత్తాంబు' ప్రబంధాన్ని సన్నిధిలో అనుసంధింపవలెనని కట్టడి చేశాడు. ఇలా రామానుజ దివ్యాజ్ఞ ఉత్తరోత్తరంగా సాగుతున్న ప్రాచీనకాలంలో–

శ్రీభగవద్రామానుజాచార్యుల అవతారసమాప్తిని శ్రీవైష్ణవులు వచ్చిచెప్పగా అనంతార్యులు విని మిగుల మనసు కలిగి ఒక సంవత్సరకాలం శ్రీనందనవన కైంకర్య ముపేక్షించి శ్రీవేంకటాచలపతిపై తటస్థభావంతో ఉన్నాడు. *(ఇంకా ఉంది)*

ఈ నెల 05-భీష్మాష్టమి, 08-భీష్మఏకాదశి సందర్భంగా...

# కనులను మూసి.. మనసును తెరవాలి!

– డా॥ ముంజులూరి నరసింహారావు

భీష్ముడనే పేరు దేవవ్రతుడికి రెండో పేరే అయినా అదే మనందరికీ తెలిసిన ప్రసిద్ధమైన పేరు. భీష్ముడంటే భయంకరుడని అర్థం. ఏవిధంగా ఇతను భయంకరుడు? దేవవ్రతుడు తన తండ్రి మనోబాధను తీర్చడానికి రాజ్యాధికారాన్ని విడిచిపెట్టి, వివాహాన్ని కూడా చేసుకోనని భీష్మమైన ప్రతిజ్ఞ చేసిన మీదట, భీష్ముడనే పేరు స్థిరపడిందని చెబుతారు. ఉన్నతోన్నతమైన పదవిని విడిచిపెట్టడమూ, కామాన్ని సహిస్తూ వివాహానికి దూరంగా ఉండడమూ రెండూ చాలా దొడ్డ ప్రతిజ్ఞలే. అయితే, అవి ఎవరికి భయాన్ని పుట్టిస్తాయి? అబ్బో, ఎంత కష్టమైన ప్రతిజ్ఞ చేశాడని అబ్బురపడతాం తప్ప, మనకు దానివల్ల భయం ఎందుకు కలుగుతుంది?



తండ్రి చెప్పకుండానే ఆయనకు కావలసింది చేసిన వైనంలో రాముడితో భీష్ముణ్ణి సరిపోల్చవచ్చు. కానీ రాముణ్ణి భీష్మవ్రతం చేపట్టాడని ఎవరూ అనలేదు. రాముడూ రాజ్యాధికారాన్ని వదిలిపెట్టాడు. పద్నాలుగేళ్లు అడవుల్లో ఉండడంవల్ల ప్రజలకు దూరం కావడంతో, దగ్గరగా ఉన్న రాజునే ఎక్కువగా ప్రేమించడం జరుగుతుంది గనక, రాజ్యాధికారం శాశ్వతంగానే పోయే అవకాశం కూడా ఉంది. భీష్ముడు ఏళ్లతో ప్రమేయం లేకుండా శాశ్వతంగానే సింహాసనానికి, రాజ్యంలోనే సింహాసనానికి దగ్గరగానే ఉంటూ కూడా, దూరంగా ఉన్నాడు. ఇది రాముడు చేసినదానికన్నా దుష్కరమైన పనే.

## దేవవ్రతుణ్ణి భీష్ముడని ఎందుకని అంటారు

భీష్ముడు ఇరవైయొక్కసార్లు నేలమీద క్షత్రియుల్లేకుండా చేసిన పరుశురాముణ్ణి ఓడించిన దిట్ట. తమ్ముడు విచిత్రవీర్యుడికి పెళ్లిచేద్దామని కాశీరాచకన్నెల స్వయంవరానికి తానే వెళ్లాడు. అతనికోసం ఇతను వెళ్ళడమేమిటి? ఒట్టుతీసిగట్టుమీద పెట్టి మరీ ఎలాగ వచ్చాడబ్బా అని అక్కడి వాళ్లందరూ ముక్కుమీద వేలేసుకున్నారుకూడా. స్వయంవరానికి వచ్చిన రాజులనందర్నీ గడ్డిపరకలమాదిరిగా తీసేసి, రాచకన్నెల్ని రథం ఎక్కించుకుని తెస్తూ ఉంటే, అడ్డుపడ్డ రాజుల్ని మట్టికరిపించాడు. ఆ ముగ్గురు రాచకన్నెలలో అంబ అనే పెద్దమ్మాయిని ప్రేమించి పెళ్లిచేసుకుందామని ఉబలాటపడి వచ్చిన సాల్వుణ్ణి కూడా భంగపరిచి ప్రాణాలతో విడిచిపెట్టాడు. అప్పుడేమీ కిక్కురుమనని అంబ, తీరా ఇంటికి వచ్చిన తరువాత, తన ప్రేమకథను చెప్పి సాల్వుడి దగ్గరికి పంపించమని అడిగింది. సరే, అంబికా అంబాలికల్ని ఇద్దరినీ విచిత్రవీర్యుడికి ఇచ్చి పెళ్లిచేశారు. అతనేమో ఆ వ్యామోహంలో మునిగిపోయి రాజయక్ష్మరోగాన్ని తెచ్చుకుని ఏడేళ్ళలోనే చచ్చిపోయాడు. అతను పోయిన తరువాత, సత్యవతి భీష్ముణ్ణి అంబికా అంబాలికలతో కాపురంచేసి పిల్లల్ని కనమంది. కానీ ధర్మానికి కట్టుబడినవాడుగనక ఆ పనికి అతను ఒప్పుకోలేదు.

అంబ వెళ్లడమైతే వెళ్లిందిగానీ సాల్వుడు ఆమెను పెళ్లి చేసుకోవడానికి ససేమిరా అన్నాడు. భీష్ముడు తీసుకొనివెళ్లిన నిన్ను నేనెలాగ పెళ్లిచేసుకుంటానని అటు భయంతోనూ, ఇటు బెట్టుతోనూ కూడా ఆమె ప్రేమను కాదన్నాడు. రెండందాలా చెడిన అంబ భీష్ముడిమీద కక్షకట్టి పరుశురాముడి సాయాన్ని కోరింది. క్షత్రియులనందర్నీ పనిగట్టుకొనిమరీ నాశనం చేసిన పరుశురాముణ్ణి ఓడించిన జగజ్జెట్టి భీష్ముడు. అంబ దెబ్బతిన్న

పాముకి మల్లే కసితో తపస్సు చేసింది. శివుడివరాన్ని పొంది, చితిలో ఆ శరీరాన్ని ఆహుతిచేసుకుని, ద్రుపదమహారాజుకు కూతురుగా పుట్టింది. మగపిల్లవాడు కావాలనుకుంటే అమ్మాయి పుట్టిందని, పట్టుదలకొద్దీ ఆ అమ్మాయికి శిఖండి అని పేరు పెట్టి, మగ దుస్తులు వేసి మగవాడిగా పెంచడమేగాక, హిరణ్య వర్మ కూతురికిచ్చి పెళ్లికూడా చేశారు. పెళ్లికాగానే అసలు విషయం బయటపడింది. మామగారు అగ్గిమీద గుగ్గిలమై దండెత్తడానికి వస్తున్నాడని తెలిసి, శిఖండి ఒక వనంలోకి పారిపోయింది. ఆ వనాన్ని స్థూణాకర్ణుడనే యక్షుడు పరిపాలిస్తూ ఉండేవాడు. అతని దగ్గర తన గోడు చెప్పుకొంది. 'గండం గడిచేంతదాకా నా మగతనాన్ని నీకు బదలాయిస్తాను, నీ ఆడతనాన్ని నేను భరిస్తాను. మీ మామగారు తృప్తిపడి వెళ్లి పోగానే తిరిగి నా పుంస్త్వాన్ని నాకు ఇచ్చేద్దుగానిలే' అని ఒడంబడికను చేసుకుని శిఖండిని మగవాడిగా చేశాడు. స్థూణాకర్ణుడు స్త్రీ కాగానే అతని దురదృష్టంకొద్దీ అతన్ని చూద్దానికి యక్షుల రాజు కుబేరుడు వచ్చాడు. స్థూణాకర్ణుడు సిగ్గుపడుతూ ఎదురుగా రాకపోయేసరికి కోపంతో 'ఇలాగ స్త్రీగానే ఉండిపో' అని కుబేరుడు శపించేశాడు. అతను వచ్చి కాళ్లావేళ్లాపడగా "శిఖండి యుద్ధంలో చనిపోయిన మీదట నీ పుంస్త్వం నీకు తిరిగి వస్తుంది" అని చెప్పి కుబేరుడు వెళ్లాడు. ఆవిధంగా శిఖండి మొదట స్త్రీగా ఉండి తరువాత మగాడిగా మారినవాడు.

పెళ్లి సత్యవతితో కాగానే సంతోషించిన శంతనుడు గంగాపుత్రుడైన భీష్ముడికి స్వచ్ఛంద మరణమనే వరాన్నిచ్చాడు. తాను ఇష్టపడితేగానీ తనకు చావు రాదంటే, ఇక అతనికి చావు ఎలాగ వస్తుంది? తనకుగా తాను చావాలని ఎవ్వడూ అనుకోడు గదా! కానీ భగవంతుడు అఘటనఘటనా సమర్థుడు. ఎన్నెన్ని వరాలనైనా పొందనీ చావు ఏదోవిధంగా వచ్చి తీరుతుంది. హిరణ్యకశిపుడు తాను గాలిలోగానీ, నేలమీదగానీ, నిప్పులో గానీ, ఇంట్లోగానీ, బయటగానీ, కత్తులతోగానీ, కటారులతోగానీ, నరులచేతగానీ, జంతువులచేతగానీ చావకూడదని వరాన్ని పొందితే ఏమైంది? నరుడూ సింహమూ గాని రూపంతో గడప మీద కూర్చొని, తొడలమీద పండబెట్టుకుని గోళ్లతో చీల్చి మరీ చంపడం జరిగింది. అలాగే స్వచ్ఛంద మరణమున్న భీష్ముడు మనిషిగానే పుట్టాడుగనక చావు రావలసిందే. దానికి మార్గాన్ని అతనే ఏర్పరుచుకున్నాడు. భీష్ముడికి ఒక వ్రతం ఉంది– స్త్రీని గానీ, ముందు స్త్రీగా ఉండి, తరువాత మగవాడిగా మారినవాణ్ణిగానీ, స్త్రీ పేరుపెట్టుకున్నవాణ్ణి గానీ, స్త్రీరూపమున్నవాణ్ణిగానీ ఎదురుగా చూస్తే అతను బాణాన్ని వేయడమే మానేస్తాడు. నిజానికి చైతన్యానికి స్త్రీపురుష తేడా ఉండదు. అలాగ వేరుతనాన్ని చూడడమే అహంకారమంటే.

ఏరోజుకారోజు పదివేలమందిని చంపుతూ భీకరమైన యుద్ధాన్ని చేస్తూన్న భీష్ముడి దగ్గరికి ఓరోజు రాత్రి ధర్మరాజు వెళ్లి 'నువ్వెలాగ చచ్చిపోతావో నువ్వే చెప్పాలి' అని వింతైన కోరిక కోరాడు. అప్పటికే చాలా విసుగెత్తి ఉన్నాడు భీష్ముడు. "శిఖండిని అడ్డుపెట్టుకొని అర్జునుడు బాణాలువేస్తే నేను ప్రతిగా బాణాల్ని వేయను గనక నేను పతనమైపోతాను" అని తన చావును తానే తెచ్చుకున్నాడు. అలాగ బాణాలు గుచ్చుకోగా అంపశయ్య మీదనే పడుకుని ఇంకాకొన్నాళ్లు బతికే ఉన్నాడు. చివరికి యుద్ధమైపోయిన తరవాత, అందర్నీ చంపిన పాపానికి కుమిలిపోతూ ఉన్న ధర్మరాజును తీసుకుని శ్రీకృష్ణుడు వచ్చి ఎదురుగా కూర్చొని, ధర్మాల్ని చెప్పించాడు భీష్ముడిచేత. ఆ పని చేసిన తరవాత ఎదురుగా శ్రీకృష్ణమూర్తిని చూస్తూ బొందిని వదిలిపెట్టాడు భీష్ముడు.



పాండవులకు జయం విషయంలో భీష్ముడంటేనే అతి భయం. ఇక్కడుంది అసలు భీష్మత్వానికి మూలం. ఐదుగురు పాండవులూ ఐదు మహాభూతతత్త్వాలకు ప్రతినిధులు. ధర్మరాజు

శాంతాకాశానికి ప్రతీక. భీముడు ప్రాణవాయుబలానికి ప్రతీక. అర్జునుడు మనోనిగ్రహానికి ప్రతీక. నకులుడు శమప్రవాహానికి ప్రతీక. సహదేవుడు ఘనమైన దమానికి ప్రతీక. ఈ శాంతమూ మనోనిగ్రహమూ మొదలైనవాటికన్నిటికీ అహంకారమంటేనే భయం. అదే మానవమాత్రులందరికీ తాతలాంటిది. అహంకారంనుంచే జ్ఞానేంద్రియాలూ, కర్మేంద్రియాలూ, శబ్దమూ స్పర్శారూపమూ, రసమూ, గంధమూ అనేవిషయాలూ మనస్సూ బుద్ధి పుట్టుకొనివచ్చాయి. అహంకారం నెత్తికెక్కితే ఎంతెంతటి మంచిగుణమూ మట్టికరుస్తుంది. అశాంతి చుట్టుముట్టుతుంది. మనస్సు అదుపులో ఉండనే ఉండదు. ఇంద్రియాలూ అదుపు తప్పుతాయి. అందుకోసమనే ధర్మరాజాదులకు భీష్ముడంటే బెరుకు. మనం ఇంతకుముందే భీష్ముడు అహంకారచైతన్యమని చెప్పుకున్నాం. జూదంలో ద్రౌపదిని గెలుచుకుని దుర్యోధనుడు దుశ్శాసనుడి చేత జులుం చేయించడానికి సిద్ధపడ్డప్పుడు, ఇంతటి భయంకరుడన్న పేరున్న భీష్ముడు కిక్కురుమనలేదు. సింహాసనాన్ని కాపాడడానికి వ్రతంబూనితే మాత్రం అధర్మం జరుగుతూంటే చూస్తూ ఊరుకోవడంగానీ నామమాత్రంగా మంచిచెప్పి ఊరుకోవడంగానీ ఎంతటి యోధుడినైనా భయపెట్టగలిగే ఇతనికి తగనే తగదు. ఇతను ధర్మాలన్నీ ఎరిగినవాడే. ధర్మాలను చెప్పగలిగినవాడే. వినకపోతే చెవిమెలిపిమరీ వినేలాగ నిర్బంధపెట్టగలిగిన కురువృద్ధుడూ మహాశూరుడూను. రాజ్యాన్ని కాపాడడమంటే, సింహాసనం మీద ఉన్నవాణ్ణి కాపాడడంమాత్రం కాదు. రాజ్యం ధర్మపరంగా ఉండాలంటే, సింహాసనంమీద ఉన్నవాడుకూడా ధర్మంగా ఉండాలి. సింహాసనంమీద అధర్మపరుడుంటే, అతన్ని కాపాడడం చాలా అపరాధం. కానీ, దుర్యోధనుడూ, శకునీ, దుశ్శాసనుడూ, కర్ణుడూ మరీ పెట్రేగి ప్రవర్తిస్తూంటే, ఇంతటి మహాధనుర్ధారీ వాళ్లను కట్టడి చేయలేదు. ద్రోణుడంటారా ఒక రాజోద్యోగి. అతని భయాలు అతనికుంటాయి. కానీ భీష్ముడు వాళ్లందరికీ తాతే కాదు, అతని మాటంటేనే అందరికీ హడలు. కయ్యానికి పదే పదే కాలుదువ్వుతున్న దుర్యోధనుడికి ఎన్నిసార్లు చెప్పినా వినకపోతే ఈ కురువృద్ధుడు అంతకన్నా మించి మరేమీ చేయలేదు. అప్పుడైనా, ధర్మం ఎటువైపు ఉందో తెలిసిన ధర్మవేత్త పాండవుల వైపుకు వెళ్లకుండా దుర్యోధనుడి కొమ్మే కాశాడు. అంచేతనే భీష్ముడు ధర్మాన్ని కాదని తన ప్రతిజ్ఞ మిన్న అనుకున్న అహంకారరూపమయ్యాడు.

ఈ యుద్ధం వెనుక ఉన్న మానసికమూ, ఆధ్యాత్మికమూ అయిన స్వరూపాన్ని చూస్తే, భీష్మమైన అహంకారమే బుద్ధిమంతులైన పాండవుల ధర్మప్రవర్తనకు గండికొట్టడానికి ఎదురై నిలుచుందని అర్థమౌతుంది. అదే, అంతస్సులో ఆత్మచైతన్య సామ్రాజ్యాన్ని తిరిగి స్థాపించడానికి ప్రయత్నంచేసే అంతశ్శక్తుల గుండెల్లో అతి గుబులు పుట్టిస్తూ ఉండేది. పతంజలి చెప్పిన 'అస్మిత' అనే క్లేశం ఇదే. 'అస్మి' అంటే 'నేనున్నాన'ని అర్థం. దానిభావమే 'అస్మిత'. లోపలున్న భగవంతుడి ప్రతిబింబమైన ఆత్మను మరిచిపోయి, తనను శరీరమూ, మనస్సులకు సంబంధించిన పరికరాలతో ఒకటిగా అనుకోవడమే అహంకారం. ఇదే కురువృద్ధత్వం. దీనికి మామూలు అర్థం కౌరవుల్లో పెత్తనమున్నవాడని. కానీ అసలైన అర్థం 'సృష్టి మొదలైన దగ్గర్నుంచీ అనాదిగా ఉంటూనే ఉన్న ప్రాపంచికత్వం' అని. మొత్తం సృష్టి అంతా ఇతని వ్యక్తిగతమైన బలంమీదనే ఆధారపడి ఉంటుంది.

ఎప్పుడూ మారిపోతూ ఉండే మన ఆలోచనలూ, ఇంద్రియాల అనుభవాలూ అనే వాటి వెనుక మారకుండా ఉండే చైతన్యం తాలూకు ఏకత్వమే అహంకారం. "నేను ఆలోచిస్తున్నాను, నేను రాస్తున్నాను, నేను చూస్తున్నాను, నేను వింటున్నాను, నేను బాధపడుతున్నాను, నేను సుఖిస్తున్నాను" అనే రకరకాల మార్పులవెనక వాటికన్నిటికీ కర్త అయిందే అహంకారం. ఈ అనుభవాలకు ప్రభువైన 'నేను' నిజానికి ఈ ఆలోచనలకన్నా వేరైన వాడే. కళ్లు చూడలేనప్పుడు, కళ్లను మాత్రమే అంధత్వం అనాల్సిందిపోయి, 'నేను అంధుణ్ణి' అని తనకే అంధత్వాన్ని ఆపాదించుకోవడం తప్పేగదా. కళ్లు పోయినంతమాత్రాన మనం నాశనమై పోవటంలేదు. కానీ ప్రతివాడూ అనుభవాన్నీ, అనుభవించేవాణ్ణి కలిపేస్తూ ఉంటాడు.

ఈ అహంకారం చనిపోవాలంటే, కళ్లుమూసుకుని, లోపలికి చూపును తిప్పి, అక్కడున్న మహాచైతన్యాన్ని తదేకంగా ధ్యానం చేయాలి. ఆ చైతన్యంతో ఒకటైపోవాలి. భీష్ముడు శ్రీకృష్ణమూర్తిని ఎదురుగాచూస్తూ ఆ మూర్తిని ధ్యానపథంలో ఉంచుకునే ప్రాణాలను వదిలిపెట్టాడంటే ఇదే అర్థం. అహంకారాన్ని జయించాలంటే ధ్యానమొక్కటే మార్గం. లేకపోతే అహంకారం చావనేచావదు.

108 దివ్యదేశాలు

# తిరువాలి-తిరునగరి

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

తిరువాలి, తిరునగరి అనేవి రెండు వేరు వేరు క్షేత్రాలే అయినా, ఈ రెండు దేవాలయాలను కలిపి ఒక్క దివ్యదేశంగానే పరిగణిస్తారు.

## తిరువాలి క్షేత్రం

ఇందులో తిరువాలిక్షేతం శీర్గాళికి 10కి.మీల దూరంలో రాజగోపురమండపాలతో, ప్రకృతి రామణీయకతతో శోభిల్లుతోంది. ఈ దివ్యదేశమే తిరుమంగై ఆళ్వార్లను శ్రీవైష్ణవ సంప్రదాయానికి తీసుకుని వచ్చి పరమోపకారం చేసినటువంటి ఆళ్వారుల ధర్మపత్ని అయిన కుముదవల్లి నాచ్చియార్ పెరిగిన ప్రదేశంగా చెప్పబడుతోంది. ఈ తిరువాలి దివ్యదేశం నరసింహ దేవాలయమని, తిరువాలిక్కోయిల్ అని, పూర్ణపురీస్థలమని... ఇలా ఇంకా పలుపేర్లతో పిలువబడుతోంది. ఈ దివ్యదేశమూల మూర్తి కూర్చున్న భంగిమలో తూర్పుముఖంగా లక్ష్మీనృసింహ స్వామిగా అనుగ్రహిస్తుండగ ఉత్సవమూర్తి తిరువాలి నగరాళన్ అనేపేరుతో దర్శనమిస్తున్నాడు. తిరుమంగైఆళ్వారులు వయలాలి మణవాళన్ అని ఈ స్వామిని మంగళాశాసనం చేసినట్లు ఉన్నా ఆస్వామి తిరునగరిలో వేంచేసి ఉన్నారు. ఈ క్షేత్రంలో అమ్మ వారు అమృతఘటవల్లిగా దర్శనభాగ్యమిస్తున్నారు. ఈ తిరువాలి క్షేత్రం కర్దమప్రజాపతి, తిరుమంగైఆళ్వార్, కులశేఖరాళ్వారుల ద్వారా మంగళాశాసనం చేయబడింది. తిరుమంగై ఆళ్వారులు ఈ తిరువాలిని పరిపాలించడంవల్ల తిరువాలినాడన్ అనే పేరు కలిగింది. తిరునగరికి సమీపంలో క్కురైయలూర్ అనే క్షేత్రం లోనే తిరుమంగై ఆళ్వారులు అవతరించారు.



### తిరువాలి

| | | |
|---|---|---|
| భగవంతుడు | : | వయలాళిమణవాళన్, లక్ష్మీనరసింహస్వామి |
| అమ్మవారు | : | అమృతఘటవల్లి |
| తీర్థం | : | లక్షణిపుష్కరిణి, ఆహ్లాదపుష్కరిణి |
| విమానం | : | అష్టాక్షరీవిమానం |
| ప్రత్యక్షం | : | కర్దమప్రజాపతి, తిరుమంగై ఆళ్వార్ |
| మంగళాశాసనం | : | తిరుమంగైఆళ్వార్, కులశేఖరాళ్వార్ |
| ఆగమం | : | వైఖానసం |

## తిరునగరి

తిరువాలిక్షేత్రాధీనుడైన వయలాలిమణవాళన్ వేద రాజన్ అనే తిరునామంతో పడమరదిక్కును చూస్తూ కూర్చున్న భంగిమలో ఈ తిరునగరిలో వేంచేసి ఉన్నాడు. ఉత్సవమూర్తి, కల్యాణరంగనాథుడు, అమ్మవారు అమృతవల్లి తిరువాలి వలె తిరునగరిలోనూ అష్టాక్షరీవిమానం, లక్షణిపుష్కరిణి, ఆహ్లాద పుష్కరిణి ఉండడం వల్ల తిరువాలి, తిరునగరి రెండింటిని కలిపి ఒకే దివ్యదేశంగా పరిగణిస్తారు. అలాగే ఈ తిరునగరి క్షేత్రం బిల్వారణ్యం, లక్ష్మీపురం, ఆలింగనపురం, శ్రీనగరి, శ్రీపురి అనే పేర్లతో పిలువబడుతోంది.



### తిరునగరి

| | | |
|---|---|---|
| భగవంతుడు | : | వేదరాజన్ (వయలాళి మణవాళన్) |
| ఉత్సవమూర్తి | : | కల్యాణరంగనాథుడు |
| అమ్మవారు | : | అమృతవల్లితాయార్ |
| విమానం | : | అష్టాక్షరీవిమానం |
| తీర్థం | : | లక్షణిపుష్కరిణి, ఆహ్లాదపుష్కరిణి |
| ప్రత్యక్షం | : | తిరుమంగై ఆళ్వార్ |
| మంగళాశాసనం | : | కులశేఖరాళ్వార్, తిరుమంగైఆళ్వార్ |
| ఆగమం | : | వైఖానసం |

## స్థలపురాణం

కర్దమప్రజాపతి, కలియుగంలో తిరుక్కుఱైయలూర్ అనే దివ్యస్థలంలో నీలుడు అనే పేరుతో జన్మించి 86 దివ్యదేశాలను మంగళాశాసనం చేసిన మహనీయుడు తిరుమంగై ఆళ్వారు.

ఈ ఆళ్వారులు ఇన్ని దివ్యదేశాలను మంగళాశాసనం చేయడానికి అనుగ్రహించినటువంటి భగవానుడు ఈ తిరువాలిలో విలసిల్లి ఉన్నటువంటి ఈ లక్ష్మీనరసింహస్వామియే! హిరణ్యకశిపుని సంహరించిన తర్వాత కోపాన్ని నిగ్రహించుకోలేకపోయిన స్వామి ఈ తిరువాలితో ఉగ్రరూపిగా వేంచేసి ఉండగా దేవతలందరి ప్రార్థనమేరకు శ్రీనరసింహస్వామి ఆగ్రహాన్ని తీర్చడానికై మహాలక్ష్మిని ప్రార్థింప ఆవిడ జగన్మంగళంకోసం దేవదేవుణ్ణి కోపాన్ని ఉపశమించుకోవాలని వేడుకోగా భగవంతుడు, అమ్మవారి ప్రార్థనను అనుగ్రహించాడు. కేవలం అనుగ్రహించడమే కాకుండా అమ్మవారిని తన దక్షిణ ఊరువునందు కూర్చుండబెట్టుకుని ఆలింగనం చేసుకొన్నాడు. భగవంతుడు అమ్మవారిని ఆలింగనం చేసుకున్న





ప్రదేశం అవ్వడం చేత ఈ దివ్యస్థలం తిరు–ఆలి అని పేర్కొనబడుతోంది. ఇచ్చట స్వామి లక్ష్మీదేవిని ఆలింగనం చేస్తున్నటువంటి భంగిమలోనే భక్తులను అనుగ్రహిస్తున్నాడు.

ఈ దివ్యదేశం తిరుమంగై ఆళ్వారుల మహిమను చక్కగా తెలియజేస్తోంది. తిరుమంగైఆళ్వారు నీలుడుగా ఉన్న సందర్భంలో వెయ్యిమంది శ్రీవైష్ణవులకి ప్రతిదినం భాగవత తదీయారాధనం(భోజనం) చేసేటట్టు కుముదవల్లి నాచ్చియార్ షరతు పెట్టింది. ఆళ్వారుల ధనమంతా కూడా ఇందుకే వినియోగించబడి కప్పం కట్టడానికి కూడా ధనంలేని సమయంలో అరణ్యంలో యాత్రికుల్ని అడ్డగించి సొమ్ము దొంగిలించి తద్వారా భాగవత తదీయారాధన కైంకర్యాన్ని నిర్వర్తిస్తూ వచ్చాడు. నీలుడిని అనుగ్రహించాలని సంకల్పించిన శ్రియఃపతి ఆలి నగరంలో వయలాళి మణవాళన్‌గా అవతరించి అమ్మవారిని పూర్ణమహర్షి పుత్రికగా అవతరింపజేసి నవదంపతులుగా తిరునగరి నుండి ఒక కి.మీ.దూరంలో ఉన్న వేదరాజపురం అనే ఊరికి వేంచేస్తున్న సందర్భంలో నీలుడైన ఆళ్వార్ వీరు దివ్య దంపతులు అని తెలీక ఆపాదమస్తకం ఆభరణాలను అపహరించి చివరగా కాలిమెట్టెలను తీసి ఇవ్వమని చెప్పగా "మా వల్లకాదని, నీవే నీ బలంతో వాటిని తీసుకో" అని భగవంతుడు చెప్పగా పలుమార్లు తన బలంతో మెట్టెలు తీసుకోవడానికి ప్రయతించగా అదిరాకపోగా నీలుడు తన యొక్క పళ్లతో లాగుతుండగ దివ్యదంపతుల పాద స్పర్శచేత పునీతుడై జ్ఞానోదయాన్ని పొంది లక్ష్మీనారాయణులను స్తుతించి నీలుడు తిరుమంగై ఆళ్వారులుగా కలియుగంలో ప్రసిద్ధి చెందాడు. ఈనాటికి కూడా ఈ ఉత్సవం తిరువాలినత్తిరునగరిలో జరుపబడుతోంది.

### విశేషాలు

1) తిరుమంగై ఆళ్వారులు ఈ స్వామి అనుగ్రహంతో ఆరు దివ్యప్రబంధాలు అనుగ్రహించారు.

2) తిరుమంగైఆళ్వారుల చేత ఆరాధించబడ్డ పంచ నృసింహ మూర్తులను ఈ క్షేత్రంలో దర్శించుకోవచ్చు.

3) అష్టాక్షరీమహామంత్రాన్ని సాక్షాత్తు మహాలక్ష్మితో పాటు నారాయణుడు ఆళ్వారులకు అనుగ్రహించాడు.

4) వేదరాజపురంలోనే తిరుమంగై ఆళ్వారులు దివ్యప్రబంధాలు గానం చేశారు.

# శ్రీసరస్వతీ పూజావిధానం



'వసంతపంచమి' సందర్భంగా శ్రీసరస్వతీపూజావిధానం.. 'సప్తగిరి' పాఠకుల కోసం...!!

చదువుల తల్లి సరస్వతీదేవి. లౌకిక, అలౌకికవిద్యలకు ఆమె అధిష్ఠానదేవత. ఆ తల్లి అనుగ్రహంతో అన్ని విద్యలు మనకు అవగతం అవుతాయి. మాఘ శుద్ధ పంచమి సరస్వతీదేవి అవతరించిన రోజు. వసంతపంచమిగా ప్రసిద్ధి పొందిన ఈ రోజున సరస్వతీదేవిని ఆరాధించడం ద్వారా చక్కటి విద్యాబుద్ధులు అలవడతాయి. పాఠకులు, ప్రత్యేకించి విద్యార్థులు మరియు యువతరం కోసం ప్రత్యేక కానుకగా మహాసరస్వతీపూజావిధానాన్ని సప్తగిరి అందిస్తోంది.

## సంకల్పం

శ్రీమహావిష్ణోరాజ్ఞయా ప్రవర్తమానస్య అద్య బ్రహ్మణః ద్వితీయపరార్థే శ్వేతవరాహకల్పే వైవస్వతమన్వంతరే కలియుగే ప్రథమపాదే జంబూద్వీపే భరతవర్షే భరతఖండే అస్మిన్ వర్తమాన వ్యావహారిక చాంద్రమానేన స్వస్తిశ్రీ ......నామ సంవత్సరే, .....అయనే, .....ఋతౌ, .....మాసే, .....పక్షే, .....తిథౌ, ....వాసరే, శుభయోగ, శుభనక్షత్ర ఏవంగుణవిశేషణ విశిష్టాయాం శుభతిథౌ మమ (అస్మాకం సహ కుటుంబానాం) చతుర్విధ పురుషార్థ సిద్ధ్యర్థం సకలవిద్యాపారంగత్వార్థం శ్రీసరస్వతీదేవతా ముద్దిశ్య శ్రీసరస్వతీదేవతాప్రీత్యర్థం కల్పోక్తప్రకారేణ యావచ్ఛక్తి ధ్యానావాహనాది షోడశోపచారపూజాం కరిష్యే.

తదంగత్వేన కలశారాధనం కరిష్యే. కలశం గంధ, పత్ర, పుష్ప, అక్షతైః అభ్యర్చ్య....

కలశంపై చేతినుంచి...

కలశస్య ముఖే విష్ణుః, కంఠే రుద్రః సమాశ్రితాః, మూలే తత్ర స్థితో బ్రహ్మా, మధ్యే మాతృగణాః, స్మృతాః కుక్షౌ తు సాగరాః సర్వే సప్తద్వీపా వసుంధరా, ఋగ్వేదోఽథ యజుర్వేదః సామవేదో హ్యథర్వణః అంగైశ్చ సహితాస్సర్వే కలశాంబుసమాశ్రితాః.... కలశోదకేన దేవం, ఆత్మానం, పూజాద్రవ్యాణి సంప్రోక్ష్య..

(కలశంలోని నీటిని ఒక పువ్వుతో, దేవునిపై, మన తలపై, పూజాద్రవ్యాలపైన కేశవాది నామాలు చదువుతూ జల్లాలి).

## ధ్యానం

పుస్తకే తు యతో దేవి క్రీడతే పరమార్థతః।
తత్ర తత్ర ప్రకుర్వీత ధ్యానమావాహనాదికం॥

ధ్యానమేవం ప్రకుర్వీత సాధకో విజితేంద్రియః।
ప్రణవాసనమారూఢాం తదర్థత్వేన నిశ్చితాం॥

అంకుశం చాక్షసూత్రం చ పాశం వీణాం చ ధారిణీం।
ముక్తాహారసమాయుక్తాం మోదరూపాం మనోహరాం॥

కృతేన దర్పణాభ్యేన వస్త్రేణోపరిభూషితాం।
సుస్తనీం వేదవేద్యాం చ చంద్రార్థ కృతశేఖరాం॥

జటాకలాపసంయుక్తాం పూర్ణచంద్రనిభాననాం।
త్రిలోచనాం మహాదేవీం స్వర్ణనూపురధారిణీం॥

కటకైస్స్వర్ణరత్నాద్యైర్ముక్తాం వలయభూషితాం।
కంబుకంఠీం సుతామ్రోష్ఠీం సర్వాభరణభూషితాం॥

కేయూరైర్మేఖలాద్యైశ్చ ద్యోతయంతీం జగత్త్రయీం।
శబ్దబ్రహ్మాత్మికాం దేవీం ధ్యానకర్మసమాహితః॥

సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివారసమేతాం
శ్రీ సరస్వత్యై నమః. ధ్యాయామి

## ఆవాహనం

అత్రాగచ్ఛ జగద్వంద్యే సర్వలోకైకపూజితే।
మయా కృతమిమాం పూజాం గృహాణ జగదీశ్వరీ॥

సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః. ఆవాహయామి

## ఆసనం

ఆవాహితా భవ, స్థాపితా భవ, సన్నిహితా భవ, సన్నిరుద్ధా భవ, అవకుంఠితా భవ, సుప్రీతా భవ, సుప్రసన్నా భవ, సుముఖీ భవ, వరదా భవ, ప్రసీద ప్రసీద

కనకమయ వితర్ధిస్థాపితే తూలికాఢ్యే వివిధకుసుమకీర్ణే కోటి బాలార్కవర్ణే, భగవతి రమణీయే రత్నసింహాసనేఽస్మిన్ ఉపవిశ పదయుగ్మం హేమపీఠే నిధాయ.

సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః నవరత్నఖచిత సువర్ణ సింహాసనం సమర్పయామి

## పాద్యం

గంధపుష్పాక్షతైస్సార్థం శుద్ధతోయేన సంయుతం।
శుద్ధస్ఫటికతుల్యాంగీం పాద్యం తే ప్రతిగృహ్యతాం॥

సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః పాద్యం సమర్పయామి.

## అర్ఘ్యం

భక్తాభీష్టప్రదే దేవి దేవదేవాది వందితే।
ధాతృప్రియే జగద్ధాత్రి దదామ్యర్ఘ్యం గృహాణ మే॥

సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః అర్ఘ్యం సమర్పయామి

## ఆచమనం

పూర్ణచంద్రసమానాభే కోటిసూర్యసమప్రభే।
భక్త్యా సమర్పితం వాణి గృహాణాచమనీయకం॥
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః ఆచమనీయం సమర్పయామి

## మధుపర్కం

కమలభువనజాయే కోటిసూర్యప్రకాశే
విశద శుచి విలాసే కోమలే హారయుక్తే।
దధిమధుఘృతయుక్తం క్షీరరంభాఫలాద్యం
సురుచిర మధుపర్కం గృహ్యతాం దేవవంద్యే॥
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః మధుపర్కం సమర్పయామి

## పంచామృతం

దధిక్షీరఘృతోపేతం శర్కరామధుసంయుతం।
పంచామృతస్నానమిదం స్వీకురుష్వ మహేశ్వరి॥
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః పంచామృతస్నానం సమర్పయామి.

## స్నానం

శుద్ధోదకేన సుస్నానం కర్తవ్యం విధిపూర్వకం।
సువర్ణకలశానీతైః నానాగంధసువాసితైః॥
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః శుద్ధోదకస్నానం సమర్పయామి

## వస్త్రయుగ్మం

శుక్లవస్త్రద్వయం దేవి కోమలం కుటిలాలకే।
మయి ప్రీత్యా త్వయా వాణి బ్రహ్మాణి ప్రతిగృహ్యతాం॥
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః వస్త్రయుగ్మం సమర్పయామి

## యజ్ఞోపవీతం

శబ్దబ్రహ్మాత్మికే దేవి శబ్దశాస్త్రకృతాలయే।
బ్రహ్మసూత్రం గృహాణ త్వం బ్రహ్మశక్రాది పూజితే॥
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః యజ్ఞోపవీతం సమర్పయామి

## ఆభరణం

కటకమకుటహారైర్నూపురైరంగదాద్యైః
వివిధసుమణియుక్తై మేఖలారత్నహారైః
కమలదళవిలాసే కామదే సంగృహీష్వ
ప్రకటిత కరుణార్ద్రే భూరిశో భూషణాని
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః ఆభరణాని సమర్పయామి

## గంధం

చందనాగరు కస్తూరీ కర్పూరైశ్చ సుసంయుతం।
గంధం గృహాణ వరదే విధిపత్ని! నమోఽస్తు తే॥
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః గంధం ధారయామి

## అక్షతలు

అక్షతాన్ ధవళాన్ దివ్యాన్ శాలీతండుల నిర్మితాన్।
గృహాణ వరదే దేవి బ్రహ్మశక్తి శుభాక్షతాన్॥
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః అక్షతాన్ సమర్పయామి

## పుష్పం

నంద్యావర్తాది పుష్పైశ్చ మల్లికాభిర్మనోహరైః
కరవీరసుమైః రమ్యైర్వకులైః కేతకైః శుభైః
పున్నాగైర్జాతికుసుమైర్మందారైశ్చ సుశోభితైః
నీలోత్పలైః శుభైశ్చాన్యైః తత్కాల తరుసంభవైః
కల్పితాని చ మాల్యాని గృహాణామరవందితే
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః పుష్పైః పూజయామి.

## అంగ పూజ

| | | | | |
|---|---|---|---|---|
| శ్రీ బ్రహ్మాణ్యై | నమః | - | పాదౌ | పూజయామి |
| శ్రీ భారత్యై | నమః | - | గుల్ఫౌ | పూజయామి |
| శ్రీ జగత్స్వరూపిణ్యై | నమః | - | జంఘే | పూజయామి |
| శ్రీ జగదాద్యై | నమః | - | జానునీ | పూజయామి |
| శ్రీ చారువిలాసిన్యై | నమః | - | ఊరూన్ | పూజయామి |
| శ్రీ కమలభూమ్యై | నమః | - | కటిం | పూజయామి |
| శ్రీ జన్మహీనాయై | నమః | - | జఘనం | పూజయామి |
| శ్రీ గంభీరనాభయే | నమః | - | నాభిం | పూజయామి |
| శ్రీ హరిపూజ్యాయై | నమః | - | ఉదరం | పూజయామి |
| శ్రీ లోకమాత్రే | నమః | - | స్తనౌ | పూజయామి |
| శ్రీ విశాలవక్షసే | నమః | - | వక్షస్థలం | పూజయామి |
| శ్రీ గానవిచక్షణాయై | నమః | - | కంఠం | పూజయామి |
| శ్రీ స్కంధప్రపూజ్యాయై | నమః | - | స్కంధౌ | పూజయామి |
| శ్రీ ఘనబాహవే | నమః | - | బాహూన్ | పూజయామి |
| శ్రీ పుస్తకధారిణ్యై | నమః | - | హస్తౌ | పూజయామి |
| శ్రీ శ్రోత్రియబాంధవే | నమః | - | శ్రోత్రం | పూజయామి |
| శ్రీ వేదస్వరూపాయై | నమః | - | వక్త్రం | పూజయామి |
| శ్రీ సునాసిన్యై | నమః | - | నాసికాం | పూజయామి |
| శ్రీ బింబసమానోష్ఠ్యై | నమః | - | ఓష్ఠౌ | పూజయామి |
| శ్రీ కమలలోచనాయై | నమః | - | నేత్రౌ | పూజయామి |
| శ్రీ తిలకధారిణ్యై | నమః | - | ఫాలం | పూజయామి |
| శ్రీ చంద్రమూర్త్యై | నమః | - | చక్షూన్ | పూజయామి |
| శ్రీ సర్వప్రదాయై | నమః | - | ముఖం | పూజయామి |
| శ్రీ సరస్వత్యై | నమః | - | శిరః | పూజయామి |
| శ్రీ బ్రహ్మరూపిణ్యై | నమః | - | సర్వాణ్యంగాని | పూజయామి |

# శ్రీసరస్వతీ అష్టోత్తర శతనామాలతో పూజ

ఓం శ్రీ సరస్వత్యై నమః
ఓం శ్రీ మహాభద్రాయై నమః
ఓం శ్రీ మహామాయాయై నమః
ఓం శ్రీ వరప్రదాయై నమః
ఓం శ్రీ పద్మనిలయాయై నమః
ఓం శ్రీ పద్మాక్ష్యై నమః
ఓం శ్రీ పద్మవక్త్రాయై నమః
ఓం శ్రీ శివానుజాయై నమః
ఓం శ్రీ పుస్తకధృతే నమః
ఓం శ్రీ జ్ఞానసముద్రాయై నమః 10

ఓం శ్రీ రమాయై నమః
ఓం శ్రీ పరాయై నమః
ఓం శ్రీ కామరూపాయై నమః
ఓం శ్రీ మహావిద్యాయై నమః
ఓం శ్రీ మహాపాతకనాశిన్యై నమః
ఓం శ్రీ మహాశ్రయాయై నమః
ఓం శ్రీ మాలిన్యై నమః
ఓం శ్రీ మహాభోగాయై నమః
ఓం శ్రీ మహాభుజాయై నమః
ఓం శ్రీ మహాభాగ్యాయై నమః 20

ఓం శ్రీ మహోత్సాహాయై నమః
ఓం శ్రీ దివ్యాంగాయై నమః
ఓం శ్రీ సురవందితాయై నమః
ఓం శ్రీ మహాకాళ్యై నమః
ఓం శ్రీ మహాపాశాయై నమః
ఓం శ్రీ మహాకారాయై నమః
ఓం శ్రీ మహాంకుశాయై నమః
ఓం శ్రీ సీతాయై నమః
ఓం శ్రీ విమలాయై నమః
ఓం శ్రీ విశ్వాయై నమః 30

ఓం శ్రీ విద్యున్మాలాయై నమః
ఓం శ్రీ వైష్ణవ్యై నమః
ఓం శ్రీ చంద్రికాయ్యై నమః
ఓం శ్రీ చంద్రవదనాయై నమః
ఓం శ్రీ చంద్రలేఖావిభూషితాయై నమః
ఓం శ్రీ సావిత్ర్యై నమః
ఓం శ్రీ సురసాయై నమః
ఓం శ్రీ దేవ్యై నమః
ఓం శ్రీ దివ్యాలంకారభూషితాయై నమః
ఓం శ్రీ వాగ్దేవ్యై నమః 40

ఓం శ్రీ వసుధాయై నమః
ఓం శ్రీ తీవ్రాయై నమః
ఓం శ్రీ మహాభద్రాయై నమః
ఓం శ్రీ మహాబలాయై నమః
ఓం శ్రీ భోగదాయై నమః
ఓం శ్రీ భారత్యై నమః
ఓం శ్రీ భామాయై నమః
ఓం శ్రీ గోవిందాయై నమః
ఓం శ్రీ గోమత్యై నమః
ఓం శ్రీ శివాయై నమః 50

ఓం శ్రీ జటిలాయై నమః
ఓం శ్రీ వింధ్యవాసాయై నమః
ఓం శ్రీ వింధ్యాచలవిరాజితాయై నమః
ఓం శ్రీ చండికాయై నమః
ఓం శ్రీ వైష్ణవ్యై నమః
ఓం శ్రీ బ్రాహ్మ్యై నమః
ఓం శ్రీ బ్రహ్మజ్ఞానైకసాధనాయై నమః
ఓం శ్రీ సౌదామిన్యై నమః
ఓం శ్రీ సుధామూర్త్యై నమః
ఓం శ్రీ సుభద్రాయై నమః 60

ఓం శ్రీ సురపూజితాయై నమః
ఓం శ్రీ సువాసిన్యై నమః
ఓం శ్రీ సునాసాయై నమః
ఓం శ్రీ వినిద్రాయై నమః
ఓం శ్రీ పద్మలోచనాయై నమః
ఓం శ్రీ విద్యారూపాయై నమః
ఓం శ్రీ విశాలాక్ష్యై నమః
ఓం శ్రీ బ్రహ్మజాయాయై నమః
ఓం శ్రీ మహాఫలాయై నమః
ఓం శ్రీ త్రయీమూర్త్యై నమః 70

ఓం శ్రీ త్రికాలజ్ఞాయై నమః
ఓం శ్రీ త్రిగుణాయై నమః
ఓం శ్రీ శాస్త్రరూపిణ్యై నమః
ఓం శ్రీ శుంభాసురప్రమదిన్యై నమః
ఓం శ్రీ శుభదాయై నమః
ఓం శ్రీ సర్వాత్మికాయై నమః
ఓం శ్రీ రక్తజనిహంత్ర్యై నమః
ఓం శ్రీ చాముండాయై నమః
ఓం శ్రీ అంబికాయై నమః
ఓం శ్రీ ముండకప్రహరణాయై నమః 80



శ్రీసరస్వతీదేవి అలంకారంలో శ్రీమలయప్పస్వామివారు

ఓం శ్రీ ధూమ్రలోచనమర్దనాయై నమః
ఓం శ్రీ సర్వదేవస్తుతాయై నమః
ఓం శ్రీ సౌమ్యాయై నమః
ఓం శ్రీ సురాసుర నమస్కృతాయై నమః
ఓం శ్రీ కాళరాత్ర్యై నమః
ఓం శ్రీ కలాధారాయై నమః
ఓం శ్రీ రూపసౌభాగ్యదాయిన్యై నమః
ఓం శ్రీ వాగ్దేవ్యై నమః
ఓం శ్రీ వరారోహాయై నమః
ఓం శ్రీ వారాహ్యై నమః 90

ఓం శ్రీ వారిజాసనాయై నమః
ఓం శ్రీ చిత్రాంబరాయై నమః
ఓం శ్రీ చిత్రగంధాయై నమః
ఓం శ్రీ చిత్రమాల్యవిభూషితాయై నమః
ఓం శ్రీ కాంతాయై నమః
ఓం శ్రీ కామప్రదాయై నమః
ఓం శ్రీ వంద్యాయై నమః
ఓం శ్రీ విద్యాధరసుపూజితాయై నమః
ఓం శ్రీ శ్వేతాననాయై నమః
ఓం శ్రీ నీలభుజాయై నమః 100

ఓం శ్రీ చతుర్వర్గఫలప్రదాత్రే నమః
ఓం శ్రీ చతురాననసామ్రాజ్యై నమః
ఓం శ్రీ రక్తమధ్యాయై నమః
ఓం శ్రీ నిరంజనాయై నమః
ఓం శ్రీ హంసాసనాయై నమః
ఓం శ్రీ నీలజంఘాయై నమః
ఓం శ్రీ శ్రీప్రదాయై నమః
ఓం శ్రీ బ్రహ్మవిష్ణుశివాత్మికాయై నమః 108

సాంగాం సాయుధాం సవాహనాం
పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః
అష్టోత్తరశతనామపూజాం సమర్పయామి

## ధూపం

దశాంగం గుగ్గులోపేతం సుగంధం సుమనోహరం।
ధూపం గృహాణ దేవేశి సర్వదేవ నమస్కృతే॥
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః ధూపమాఘ్రాపయామి

## దీపం

ఘృతాక్తవర్తి సంయుక్తం దీపితం దీపమంబికే।
గృహాణ చిత్స్వరూపే త్వం కమలాసనవల్లభే॥
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః సాక్షాత్ దీపం దర్శయామి

## నైవేద్యం

అపూపాన్ వివిధాన్ స్వాదూన్ శాలిపిష్టోపపాచితాన్
మృదులాన్ గుడసమ్మిశ్రాన్ సజీరక మరీచికాన్
కదలీ పనసామ్రాణాం పక్వానిష ఫలాని చ
కందమూలం వ్యంజనాది సోపదంశం మనోహరం
అన్నం చతుర్విధోపేతం క్షీరాన్నం చ ఘృతం దధి
శీతోదకం చ సుస్వాదు కర్పూరైలాది వాసితం
భక్ష్యభోజ్యసమాయుక్తం నైవేద్యం ప్రతిగృహ్యతాం
అమ్మవారికి పాలు, పాయసం, అన్నం, పండ్లు నివేదించి,
వీటిపై తమలపాకుతో నీళ్లు చల్లుతూ...
'ఓం భూర్భువః సువః' అని మంత్రం పఠిస్తూ...
అనయా ధ్యాన ఆవాహనాది షోడశోపచారపూజయా చ
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః నైవేద్యం సమర్పయామి.
మధ్యే మధ్యే పానీయం సమర్పయామి.
ఉత్తరాపోశనం సమర్పయామి. హస్తౌ ప్రక్షాళయామి.
పాదౌ ప్రక్షాళయామి. శుద్ధాచమనీయం సమర్పయామి.

## తాంబూలం

తాంబూలం చ సకర్పూరం పున్నాగదళైర్యుతం।
గృహాణ దేవదేవేశి తత్త్వరూపే నమోఽస్తు తే॥
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః తాంబూలం సమర్పయామి



శ్రీసరస్వతీదేవీ అలంకారంలో శ్రీపద్మావతీఅమ్మవారు

## నీరాజనం

నీరాజనం గృహాణ త్వం జగదానందదాయిని।
జగత్తిమిర మార్తాండ మండలే తే నమో నమః॥
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః ఆనందకర్పూరనీరాజనం సమర్పయామి.

## పుష్పాంజలి

శారదే లోకమాతస్త్వమాశ్రితాభీష్టదాయినీ।
పుష్పాంజలిం గృహాణ త్వం మయా భక్త్యా సమర్పితం॥

యా కుందేందుతుషారహారధవళా యా శుభ్రవస్త్రాన్వితా।
యా వీణావరదండమండితకరా యా శ్వేతపద్మాసనా॥

యా బ్రహ్మాచ్యుతశంకరప్రభృతిభిః దేవైః సదా పూజితా।
సా మాం పాతు సరస్వతి భగవతి నిశ్శేషజాడ్యాపహా॥
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః మంత్రపుష్పం సమర్పయామి.

## ప్రదక్షిణ నమస్కారం

పాహి పాహి జగద్వంద్యే నమస్తే భక్తవత్సలే।
నమస్తుభ్యం నమస్తుభ్యం నమస్తుభ్యం నమో నమః॥
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః ఆత్మప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి

ఈ క్రింది శ్లోకం చదువుతూ పద్నాలుగు ప్రదక్షిణలు కూడా చెయ్యవచ్చు.

పాశాంకుశధరా వాణీ! వీణాపుస్తకధారిణీ।
మమ వక్త్రే వసేన్నిత్యం దుగ్ధకుందేందు నిర్మలా॥

## ఛత్రచామరం

చతుర్దశాసు విద్యాసు రమతే యా సరస్వతి।
చతుర్దశేషు లోకేషు సా మే వాచి వసేత్ సదా॥

ఛత్రం ధారయామి. చామరం వీజయామి. గీతం శ్రావయామి.
నృత్యం దర్శయామి. ఆందోళికా మారోపయామి.
అశ్వానారోహయామి. గజానారోహయామి.
సమస్త రాజోపచార శక్త్యుపచార భక్త్యుపచారాన్ సమర్పయామి
కుడిచేతిలోకి అక్షతలు, నీరు తీసుకుని అమ్మవారికి
సమర్పిస్తున్న భావనతో పళ్లెంలో వదలాలి.

అనయా ధ్యాన ఆవాహనాది షోడశోపచారపూజయా చ
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వతీదేవతా సుప్రీతా సుప్రసన్నా వరదా భవతు।
సాంగాం సాయుధాం సవాహనాం పతి, పుత్ర పరివార సమేతాం
శ్రీ సరస్వత్యై నమః .. ప్రసాదం శిరసా గృహ్ణామి.

- అంటూ పూజ చేసిన అక్షతలు శిరసుపై వేసుకోవాలి.

# శ్రీకామాక్షీ వైభవం

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుశర్మ

మనకు భారతదేశంలో సప్తమోక్షపురాలు ఉన్నాయి. ఆ నగరాలకు ఒక ప్రత్యేకమైన శక్తి ఉంది. అలాంటి నగరాలు ప్రవేశం చేసినంత మాత్రం చేత మోక్షానికి కారణమౌతాయి. వాటిని సప్త మోక్షపురాలు అని పిలుస్తారు. ఇందులో ఆరు పురాలు ఉత్తరభారతదేశంలో ఉన్నాయి. ఏడవది కాంచీపట్టణం ఒక్కటే దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక మోక్షపురి. కాబట్టి కాంచీ పురానికి విశేషమైన ప్రాధాన్యం.

కాంచీపురంలో పరదేవత సాక్షాత్ కామాక్షి. ఆమెకు ఆ పేరు రావడానికి కారణం 'క' అన్న అక్షరం బ్రహ్మని ప్రతిపాదిస్తుంది. 'మ' అన్న అక్షరం లక్ష్మిని ప్రతిపాదిస్తుంది. బ్రహ్మ శక్తి సరస్వతి. విష్ణువు శక్తి లక్ష్మి. కామాక్షి అంటే ఒక కంటిలో సరస్వతీదేవి అనుగ్రహాన్ని, ఒక కంటిలో లక్ష్మీదేవి అనుగ్రహాన్ని తన దృష్టిప్రసారం చేత అనుగ్రహించగలిగిన తల్లి.

కేవలం ఆవిడ చూపు పడితే చాలు, సరస్వతీ కటాక్షం కావాలనుకున్న వాళ్లకు సరస్వతీకటాక్షం, లక్ష్మీకటాక్షం కావాలనుకున్నవాళ్లకు లక్ష్మీకటాక్షం. ఒకటి గమనించాలి. రెండుకళ్లు తిప్పి చూస్తున్నప్పుడు ఏ వస్తువుని చూస్తున్నామో, ఆ వస్తువుని రెండుకళ్లతో చూస్తాం తప్ప ఒక కంటితో చూసి ఒక కన్ను మూసి వేయడం, ఒక కంటితో చూడకపోవడం అన్నది ఉండదు. రెండు కళ్లూ కలిసే చూస్తాయి. ఎవరు కామాక్షి అనుగ్రహానికి పాత్రులు అవుతారో వారు సరస్వతీ, లక్ష్ముల కటాక్షానికి పాత్రులు అవుతారు. లక్ష్మీకటాక్షమన్న మాటని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. లక్ష్మీకటాక్షమంటే విపరీతమైన ఐశ్వర్యం అని అర్థం కాదు. లక్ష్మి అంటే గుర్తు. గుర్తించబడటానికి వీలుగా ఉంటాడు. దేని చేత అంటే, ఆయనకు ఉండవలసిన ఐశ్వర్యం ఏమిటి అంటే, ఆ వేళకు తినవలసిన పదార్థానికి అమ్మవారు లోటు రానివ్వదు. ఏ సమయానికి కావలసిన అన్నం ఆ సమయానికి అందుతుంది. ఏ సమయానికి కావలసిన సౌకర్యం ఆ సమయానికి అందుతుంది. సరస్వతీ కటాక్షం కావాలి అనుకున్నవాళ్లకు సరస్వతీకటాక్షం కలుగుతుంది. ఆయన నిత్యతృప్తుడై ఉంటాడు. ఇది ఐశ్వర్యం అన్న మాటకు సరైన అర్థం. నాకు ఇది లేదు అన్నమాట ఉండదు. నాకు ఈశ్వరుడు అన్నీ ఇచ్చాడన్న పరమతృప్తితో ఉంటాడు. తృప్తే ఐశ్వర్యం. ఎన్ని ఉన్నా నాకు ఏదో లేదు అన్నవాడు దరిద్రుడౌతాడు తప్ప ఐశ్వర్యవంతుడు అవడు.



కాంచీపురం అమ్మవారి అనుగ్రహం కలిగిన క్షేత్రం. అక్కడ ఆలయంలో అమ్మవారు కూర్చున్న తీరు, ఆవిడ ఆయుధాలు పట్టుకున్న తీరు, పట్టిన ముద్రలు లోకానుగ్రహానికి మాత్రమే తప్ప ఏదో పట్టుకోవడం కోసం పట్టుకున్నవి కాదు. కామాక్షీపరదేవత దర్శనం చేస్తే చాలు. అటువంటి నిష్ఠ కలిగిన వారికి కనబడుతుందంటారు. కామాక్షి రెండు కన్నులు ఈ చివరినుంచి ఆ చివర వరకూ తిరుగుతాయి. కొంతమంది పరమభక్తితత్పరులైన వారు అమ్మవారి ముందు కూర్చున్నప్పుడు అమ్మవారి తెల్లటి కనుగుడ్డు భాగం, నల్లటి కనుగుడ్డు భాగం విస్ఫుటంగా కనబడతాయి. ఆ కన్నులు

ఇటువైపు చివరవరకు, అటువైపు చివరవరకు ఆవిడ తిప్పుతుంది. చివరనుంచి చూస్తే కటాక్షం అంటారు. ఆవిడ కళ్లు తిప్పి చూసుకుంటూ ఉంటుంది.

కామాక్షీ తల్లి ఎందరికో సరస్వతీకటాక్షాన్నిచ్చింది. ఆ తల్లే ఒకనాడు కాళిదాస మహాకవిని అనుగ్రహించింది. ఆ తల్లే జంబుకేశ్వరంలో వరదన్ అనబడే ఒక వంటవాడిని అనుగ్రహించింది. కాలమేఘన్ అని పేరు మార్చుకున్నాడు. నల్ల మబ్బు ఎలా వర్షిస్తుందో ఆయన నోటివెంట అలా కవిత్వం వచ్చేస్తుంది. ఆవిడ అనుగ్రహం కలిగితే తిరుగులేని ధార నోటివెంట ప్రవహిస్తుంది. ఆవిడ కవిత్వమనే సరస్వతీకటాక్షాన్ని ఇవ్వగలదు. అదే సమయంలో శ్రద్ధని కూడా కల్పించగలదు.

రెండిటినీ ఇవ్వగలిగిన తల్లి, కాబట్టి ఆమె కన్నులవెంట సరస్వతీలక్ష్మీకటాక్షాలు రెండిటినీ ప్రసరింపచేయగలిగిన తల్లిగా పూజలందుకుంటూ ఉంటుంది. అటువంటి కామాక్షి దర్శనం అక్కరలేదని మనుష్యుడుగా జన్మనెత్తినవాడెవడూ అనడు. ఏ మనుష్యునికైనా కావలసింది సరస్వతీ, లక్ష్మీకటాక్షాలే. ఆ రెండు కటాక్షాలూ లేని నాడు మనుష్యజన్మకి ప్రయోజనం లేదు. కేవలం తన చూపుల చేత అటువంటి కటాక్షాలను ప్రసరింపచేయగలిగిన శక్తి కలిగిన తల్లి కామాక్షీపరదేవత.

కాంచీపురంలోని విశేషం ఏమనగా, ఏవైనా ఆ తల్లి దేవాలయానికి ప్రదక్షిణం చేస్తాయి. కంచిలో ఏ శివాలయంలో కూడా అమ్మవారు ఉండదు. అన్ని శివాలయాలకూ కలిపి ఒకటే కామాక్షీపరదేవత అమ్మవారి స్వరూపం. ఒక్క కామాక్షి దేవాలయంలో అమ్మవారే అన్ని శివాలయాలలోనూ ఉన్నట్లు. వరదరాజస్వామి ఉత్సవమైనా, కామాక్షి ఆలయానికి ప్రదక్షిణంగా వెళుతుంది. అంత గొప్పక్షేత్రం!

కాంచీ అంటే చిరుగంటలతో కూడుకున్న మొలనూలు ఏది ఉన్నదో దానిని కాంచీదామా అని పిలుస్తారు. ఆవిడ చిరుగంటలతో కూడిన వడ్డాణాన్ని పెట్టుకుని ఉంటుంది. ఆవిడ కదలి వెడుతుంటే కొన్ని మంగళధ్వనులు వినపడతాయి. పాద మంజీరాల చప్పుడు వినపడుతుంది. ఎవరికి వినపడుతుందంటే ఆ యోగ్యత కలిగిన పరమభక్తితత్పరులైన వారికి ధ్యానంలో కూర్చున్నప్పుడు అమ్మవారి పాదమంజీరాల సవ్వడి వినపడుతుంది. నడుముకి పెట్టుకున్న వడ్డాణం చిరుగంటల సవ్వడి వినపడుతుంది. చేతికి వేసుకున్న గాజుల శబ్దం వినపడుతుంది. మెడలో వేసుకున్న నగలు ఒక దానితో ఒకటి ఒరుసుకునే శబ్దం వినపడుతుంది. విశేషమైన పరిమళం వస్తుంది. అమ్మవారు పూజ స్వీకరించిందనటానికి గుర్తు ఇప్పటికీ పరమభక్తితత్పరులైనవారి పూజామందిరాలు సువాసనలు వెదజల్లుతూ ఉంటాయి.

ఎందుచేతనంటే స్వయంగా అమ్మవారు వచ్చి ఆ పూజని స్వీకరిస్తూ ఉంటుంది. అలా స్వీకరించిన కారణం చేత ఆమె వస్తే సువాసన వస్తుంది.

శంకరులు సౌందర్యలహరి స్తోత్రం చేస్తూ అమ్మవారి వైభవం చేత ఏర్పడ్డ- గొప్ప గొప్ప క్షేత్రాలు చెప్పారు. అవి కామాక్షీమాత దృష్టి చేత ఏర్పడ్డాయి. అమ్మ వారి దృష్టి పడిన కాంచీపురం చాలా గొప్పక్షేత్రం.

అలాంటి కాంచీపురాన్ని స్మరించి అందులో అడుగు పెట్టడమే చాలు. అందరికీ అమ్మవారి అనుగ్రహం కలగాలి. అందరూ సుఖసంతోషాలతో ఉండాలి.

## 2025, మార్చి నెల ఉత్సవాలు, పర్వదినాలు

**06- 14** శ్రీలక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవం, తరిగొండ

**07** తిరుక్కచ్చినంబి శాత్తుమొఱ

**09** కులశేఖరాళ్వార్ వర్షతిరునక్షత్రం

**09- 13** తిరుమల శ్రీవారి తెప్పోత్సవం

**14** శ్రీలక్ష్మీజయంతి, కుమారధారాతీర్థముక్కోటి

**24- 28** శ్రీవేదనారాయణస్వామివారి సూర్యపూజ మరియు తెప్పోత్సవం, నాగులాపురం

**26** అన్నమాచార్య వర్ధంతి

**మార్చి 27 నుండి ఏప్రిల్ 04 వరకు** శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం, తిరుపతి

**30** శ్రీవిశ్వావసునామ ఉగాది

**31** మత్స్యజయంతి

# అభిషేకప్రియుడు 'ఈశ్వరుడు'

-డా॥నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి



దేవతలను సంతృప్తిపరచడం ద్వారా వారి అనుగ్రహం కలిగి, మానవులకు కష్టాలు తీరడమే కాక, సుఖశాంతులు కలుగుతాయనేది నిర్వివాదాంశం. పూజలద్వారా దేవతల అనుగ్రహం పొందవచ్చు.

పాద్యం, అర్ఘ్యం, ఆచమనీయం, ఆసనం, స్నానం, గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం, తాంబూలం, నీరాజనం, స్తోత్రం... మొదలైనవన్నీ పూజలో భాగాలే. పూజించటానికి ముందు దైవాన్ని ఆవాహన చేయడం ఉంటుంది.

ఇంకా యజ్ఞోపవీతం, వస్త్రం, ఛత్రం, చామరం, నృత్యం, గీతం, ఆందోళిక మొదలైన వాటిని కూడా పెద్ద పూజలలో చేర్చుకోవచ్చు. క్లుప్తంగా అయితే పంచోప చారాలతో పూజ ఉంటుంది.

ప్రతి పూజలోను దేవునికి స్నానం ఉంటుంది. దీన్నే స్వామికి చేసే 'అభిషేకం' అంటారు.

ఒక్కొక్క దేవునికి ఒక్కొక్క ప్రక్రియ ఇష్టంగా ఉంటుంది. పూజలో అన్నీ ఉన్నా వారికిష్టమైన ప్రక్రియ ద్వారా ఆరాధిస్తే త్వరలో భక్తుల ననుగ్రహిస్తారు. సాధా రణంగా దేవతలందరూ "స్తుతిప్రియా వై దేవాః" అనే వచనం ద్వారా స్తోత్రాలు చదివితే అనుగ్రహిస్తారు.

కాగా, "నమస్కారప్రియ స్సూర్యః" అని సూర్యుడు నమ స్కారాల ద్వారా అనుగ్రహిస్తాడు. అలంకారాలద్వారా విష్ణువు, పూజద్వారా అమ్మవారు అనుగ్రహిస్తారు. ఈశ్వరుడు అభిషేకం ద్వారా ఎక్కువ అనుగ్రహిస్తాడు. కావునే 'అభిషేకప్రియశ్శమ్భుః' అని ప్రసిద్ధి ఏర్పడింది.

108 కలశాలతో కూడా అభిషేకం చేయవచ్చు. జలంలో ఉండే దోషాలు ముందుగా పోగొట్టుకుని, అభిషేకం చేయడం శాస్త్రపద్ధతి. **"వస్త్రపూతజలేనైవ అభిషేకం తు కారయేత్"** అని శాస్త్రం. వస్త్రంలో వడగట్టి అభిషేకం చేయాలి. ఇంకా అభిషేకం చేసే జలంలో దోషం పోగొట్టడానికి తార్క్ష్య ముద్ర. మృత్యుంజయ మంత్రాలు ప్రయోగించి అమృతీకరణం అనే ప్రక్రియ ద్వారా అమృతంగా మార్చి అభిషేకం చేయడం శాస్త్రపద్ధతి.

ప్రతినెలలోనూ బహుళచతుర్దశి మాసశివరాత్రి. ఈ రోజులలో అభిషేకం గొప్పది. అయితే మాఘమాసంలో బహుళచతుర్దశి మహాశివరాత్రి. ఈ రోజు శివాభిషేకం ఇంకా ఇంకా గొప్పది. నమకచమకాలతో, మన్యుసూక్తంతో, పాశు పత మంత్రాలతో లేదా పురుషసూక్తంతో అభిషేకం చేయ వచ్చు లేదా శివమంత్రాలతో చేయవచ్చు. సామాన్యులు శివ నామాలతో చేయవచ్చు. సామాన్యులైనా, పండితులైనా ఎవరైనా సరే భక్తితో అభిషేకం చేస్తే చాలు. అయితే భక్తిశ్రద్ధలుండాలి. బోళాశంకరుడు అందరినీ అనుగ్రహిస్తాడు.

యజుర్వేదంలో రుద్రుని వర్ణిస్తూ, నమక చమకాలు చెప్పబడ్డాయి. రుద్రుడంటే శివుడు. పదకొండు రూపాలలో ఉండడం వలన ఏకాదశ రుద్రులంటారు. అజ్ఞానాన్ని పోగొట్టే

## అభిషేకం ఎందుకు?



**ఈశ్వరుడు అభిషేకం వలననే ఎక్కువ ప్రీతి చెందుతాడని ప్రారంభంలో చెప్పకున్నాం కదా. పాలకడలిని దేవదానవులు చిలికినప్పడు వచ్చిన... హాలాహలాన్ని ఈశ్వరుడు మింగి, లోకాలను కాపాడి మహాదేవుడయ్యాడు. ఆ తాపం శమించడానికి అభిషేకం చేయాలి.**

వాడు, వ్యాధులు తగ్గించేవాడు కనుక రుద్రుడయ్యాడు. శివుడంటే మంగళకరుడు."

అభిషేకానికి ఎన్ని కడవల నీరు వాడాలనే విషయంలో ఆగమాలు కొన్ని నియమాలను చెబుతున్నాయి. పారమేశ్వరాగమం పదమూడవ పటలంలో...

**"శ్లో॥ సహస్ర ఘటతోయేన త్వష్టోత్తరశతేనా వా"** అని ప్రారంభించి చాలా విశేషాలు చెబుతోంది.

1000 / 108 / 64 / 32 / 24 / 16 / 12 / 8 / 5 / 2 / 1 కడవల సంఖ్యగా గ్రహించి అభిషేకం చేయవచ్చు. (13-44) యథాశక్తి చేయవచ్చు. భక్తి ముఖ్యం. **"శీతలం లఘు సద్గంధం శతధా వస్త్రశోధితమ్"** అనే శైవపరమైన పారమేశ్వరాగమం వల్ల చల్లగా, సుగంధంగా, మధురమైన నీటిని వందసార్లు శుద్ధిచేసి అభిషేకం చేయాలని తెలుస్తోంది.

### అభిషేకాలు- ఫలాలు

ఏ ద్రవ్యంతో అభిషేకం చేస్తే ఏ ఫలం కలుగుతుందో శాస్త్రాలు చెప్పాయి. ఆవుపాలతో అన్నిసౌఖ్యాలు కలుగుతాయి.

ఆవు పెరుగుతో ఆరోగ్యం కలుగుతుంది. ఆవునేయి ఐశ్వర్యాన్ని, పంచదార దుఃఖనాశాన్ని కలుగజేస్తాయి. తేనె వల్ల తేజస్సు పెరుగుతుంది, చెఱకురసం వల్ల ధనవృద్ధి, కొబ్బరి నీటితో అభిషేకం వల్ల సంపదలు పెరగటం, విభూతి వల్ల పాపనాశం, పన్నీరు వల్ల పుత్రలాభం, పుష్పోదకం వల్ల భూలాభం, బిల్వజలం వల్ల భోగభాగ్యాలు, నువ్వులనూనె వల్ల అపమృత్యు దోషాలు నివారింపబడటం, సువర్ణోదకం వల్ల పేదరికం పోవడం, ద్రాక్షరసం వల్ల పనులు నెరవేరడం, ధనలాభం, ఖర్జూరజలం వల్ల సుఖజీవనం, శత్రుహాని, మోక్షం, నేరేడు పండ్లరసం వల్ల సకలకార్యాలలో జయం, కస్తూరీజలం వల్ల శత్రుభయాలు పోవడం, మామిడి పండ్లరసం వల్ల గృహలాభం, నవరత్నజలం వల్ల రాజ్యం, సుగంధజలం వల్ల పుత్రలాభం, దూర్వోదకం అనగా గరికనీటివల్ల పోయినసొమ్ము లాభించడం, రుద్రాక్షజలం వల్ల గొప్ప ఐశ్వర్యం. అన్నం వల్ల రాజ్యం, ఆయుర్దాయం, సుఖజీవనం, మోక్షం కలుగుతాయి. అయితే నేరేడు పండ్ల రసం వల్ల వైరాగ్యం లభిస్తుందని, కస్తూరీ జలం వల్ల చక్రవర్తిత్వం, మామిడి పండ్ల రసం వల్ల దీర్ఘవ్యాధినివారణ అని మరికొన్ని గ్రంథాలలో ఉంది. పసుపునీటి వల్ల సౌభాగ్యాలు, మంగళాలు లభిస్తాయని రుద్రకామ్యార్చనావిధిలో చెప్పబడ్డాయి. సాధారణంగా పాలు, పెరుగు, నేయి, తేనె, పంచదార కలిపి పంచామృతం చేసి అభిషేకం చేస్తే 'పంచామృతాభిషేకం' అవుతుంది. ఇంకా అక్షతల జలంతో, బంగారం నీటితో, శంఖోదకం, ఫలోదకాలతో కూడా అభిషేకాలు చెప్పబడ్డాయి.

ముఖ్యంగా మహాశివరాత్రి పర్వదినం రోజు పరమేశ్వరుణ్ణే తలచుకోవాలి. ధ్యానం చేయాలి. సత్యస్వరూపుడు, శాశ్వతుడు మహాశివుడే.

కనుక 'హర హర శంభో మహాదేవా' అంటూ అభిషేకాలలో పాల్గొని శివుని అనుగ్రహం పొందుదాం.



ధారావాహిక



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు

ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్
తెలుగు- శ్రీదేవీ మురళీధర్

*గత సంచిక తరువాయి భాగం....*

రామానుజులు సాలిగ్రామనివాసుల నుండి సెలవు తీసుకొని తొండనూరు నంబినివాసానికి చేరుకుంటారు. ఆ కాలంలో మేల్నాడు హొయసల రాజ్యపాలనలో ఉంది. రామానుజులు మేల్నాడుకు చేరుకునే సమయానికి అచ్చటి పాలకుడు బిట్టిదేవ అని పిలువబడే విఠలదేవుడు.

యతిరాజు రామానుజులకు మేల్నాడులో ఎందరెందరో శిష్యులు ఉన్నారు; కొందరిని ఇక్కడ ప్రస్తావించాలి. వంగీపురత్తు అచ్చి, వంగీపురత్తు నంబి, తొండనూర్ నంబి, మరుదూర్ నంబి (మద్దూర్ నరసింహాలయంలో ఈ మహాభక్తుడి సన్నిధి ఉంది), మల్లూరు నంబి (ప్రస్తుతం దొడ్డమల్లూర్ అని పిలువబడే ప్రాంతానికి చెందినవాడు. దొడ్డమల్లూర్‌లోని అప్రమేయ నవనీతకృష్ణ దేవాలయంలో ఈ భక్తుని సన్నిధిని చూడవచ్చు), అనంతాళ్వాన్ మొదలైనవారు.

తొండనూరు నంబి పరమభాగవతుడు, పండితుడు, సాధువు. కీళ్నాడు (ప్రస్తుత తమిళనాడు) తీర్థయాత్రలో, అతడు శ్రీరంగంలో రామానుజులను దర్శించాడు. యతిరాజుల ఉన్నత వ్యక్తిత్వం, తత్త్వబోధలు, ప్రగతిశీల ఆలోచనలతో ప్రభావితుడైనాడు. సరళమైన బోధనలతో సమాజంలో మార్పు తీసుకురావాలనే యతిరాజుల అభిప్రాయం నంబిని ఆకట్టుకుంది. రామానుజాచార్యలో ఒక గొప్ప ఆచార్యుడిని దర్శించిన తొండనూరు నంబి ఆయన శిష్యుడైనాడు (రామానుజులు నియమించిన 74 మంది సింహాసనాధిపతులలో తొండనూర్ నంబి ఒకరు).

తొండనూరు అప్పటి హొయసల రాజు విఠలదేవుని వేసవి రాజధాని. తొండనూరు నంబి విఠలదేవుని ఆస్థానంలో ప్రధానపూజారి. విఠలదేవుడు తొండనూరులో ఎక్కువ సమయం గడిపేవాడు. రాజు విఠలదేవుడితో పాటు అతని పట్టమహిషి రాణి శాంతలాదేవికి కూడా నంబి ఎంతో పూజ్యుడు, సన్నిహితుడు. తొండనూరు నంబి తన ఆచార్యులు రామానుజులు సాలిగ్రామంలో ఉన్నారని తెలుసుకున్న తర్వాత ఒక రోజు రామానుజులను కలవడానికి సాలిగ్రామానికి వెళతాడు. అతను తన గురువును కలుసుకుని, ఆయన శుశ్రూషలో కొంతకాలం గడిపి, యతిరాజులను తొండనూరుకు విచ్చేసి విఠలదేవ మహారాజు ఆస్థానం సందర్శించమని అభ్యర్థిస్తాడు. రామానుజులు ఒప్పుకోక తొండనూరు నంబిని వెనక్కి పంపుతారు. తొండనూరు నంబి తొండనూరు చేరుకుంటాడు.

## రామానుజాచార్యులు తొండనూర్ దర్శించుట

తొండనూర్ నంబి రాజదంపతుల బాధ చూచి సానుభూతితో వారిని ఓదార్చి తమ గురుదేవులు రామానుజులు సాలిగ్రామం విచ్చేశారని, వారు యువరాణి సమస్యకు పరిష్కారం సూచించగలరని చెప్పగా, వారు సంతోషించి యతిరాజులను రాజభవనానికి తోడ్కొని రమ్మని నంబిని కోరుతారు.

అంతేగాక యతిరాజుల ఆశీర్వాదంతో తమ కుమార్తె స్వస్థురాలైతే తాము శ్రీవైష్ణవమతాన్ని స్వీకరించి రామానుజుల శిష్యులమౌతామని రాజదంపతులు ప్రమాణపూర్వకంగా చెబుతారు. నంబి సాలిగ్రామం చేరుకొని ఈ విషయం యావత్తు ఆచార్యులకు నివేదించి, మేల్నాడులో శ్రీవైష్ణవం సుస్థిరంగా స్థాపించటానికి ఇదొక సువర్ణావకాశం అని చెబుతాడు. రామానుజులు ఒక శుభముహూర్తాన సాలిగ్రామం నుండి తొండనూర్ రాజప్రాసాదం చేరుకుంటారు.

*(ఇంకా ఉంది)*

# వేయికన్నులు చాలవుగా...

- డా॥చింతకుంట శివారెడ్డి, 9440859872

వై.ఎస్.ఆర్.కడపనగరానికి ఉత్తరదిక్కుగా మూడు కిలో మీటర్ల దూరంలోని దేవునికడప శ్రీలక్ష్మీవేంకటేశ్వరాలయం తిరుమలకు తొలి గడపగా ప్రసిద్ధి.

## పౌరాణికగాథ

తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చిన జనమేజయమహా రాజుకు ఒకరోజు రాత్రి కలలో శ్రీవేంకటేశ్వరస్వామి దర్శన మిచ్చి "నేను ఫలానా ప్రాంతంలో శిలారూపంలో ఉన్నాను, తీసుకెళ్లి పవిత్ర ప్రదేశంలో ప్రతిష్ఠించు" అని చెప్పాడట. ఆ కల ప్రకారం చెరువుకు సమీపంలో నిలువెత్తు స్వామి విగ్రహం చూసి, స్వామి చెప్పినచోటే తిరుమలకు వాయవ్యంగా పది ఆమడల దూరంలో పుష్కరిణికి దగ్గరగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్ఠించాడు. ఆలయంలో ఆంజనేయస్వామి ఒక పెద్దరాతిపై సుమారు 10అడుగుల ఎత్తు చెక్కబడి ఉన్నాడు. ఆంజనేయునికి ఎదురుగా వేంకటేశ్వరస్వామి ప్రతిష్ఠ జరిగింది. అలా ప్రతిష్ఠించిన స్వామిని మొదట 'కడప వేంకటేశ్వర స్వామి'గా పిలిచేవారు.

మరొక ఐతిహ్యం ప్రకారం స్వామివారిని 'కృపా చార్యులు' ప్రతిష్ఠించారని, అందువల్ల ఈ ప్రాంతాన్ని 'కృపా పురం'గా, తరువాత కడపగా మారిందని అంటారు.

## చారిత్రక నేపథ్యం

ఆలయంలోని రాజగోపురం, ముఖమండపం, గర్భా లయం, అంతరాలయం, ఆలయంలోని పద్మావతి అమ్మవారు, వినాయకుడు, ఆండాల్ అమ్మవారు, ఆళ్వార్లమందిరాలు, చుట్టూ ప్రాకారాన్ని మట్లి అనంతభూపాలుడు నిర్మించాడు. వైదుంబులు, ఓరుగంటిరాజులు, వల్లూరు పాలకులు, సంబెటరాజులు, సాళువ, సంగమ, తుళువ వంశీకులు ఈ క్షేత్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. శ్రీకృష్ణదేవరాయలు పలుసార్లు స్వామిని దర్శించుకుని బంగారు ఆభరణాలు, మాన్యాలు సమర్పించాడు. నంద్యాల అవుభలేశ్వరదేవ మహారాజు ఈ స్వామికైంకర్యానికై భూదానం చేశాడు. మహామండలేశ్వర తిమ్మయదేవ మహారాజు ఉదయగిరి ప్రాంతంలోని ఒక గ్రామంయొక్క రాబడిని ఈ గుడికి ఇచ్చాడు. అరణం సర్వప్ప అనే ఆయన కిరీటాన్ని సమర్పించాడు. మహా మండలేశ్వర ఓబులరాజు మాన్యాలను, చిన్న అవుభళరాజు స్వామి పూలతోటకై భూమిని ఇచ్చినట్లు ఆలయానికి గోడలపై నున్న శాసనాలు చెబుతున్నాయి. ఆలయ రాజగోపురం మట్లి రాజుల కాలంలో పునర్నిర్మితమైంది. గోపురద్వారానికి ఇరు వైపులా రాయల వంశీకుల శిల్పాలు ఉన్నాయి. ఈ గుడిలోని గోపురం, తిరుపతి శ్రీగోవిందరాజస్వామి ఆలయంలోని గోపురం రెండూ ఒకే కాలంలో నిర్మించినట్లు తెలుస్తోంది.





## రథోత్సవం

ప్రతి ఏటా మాఘశుద్ధ పాడ్యమినుండి సప్తమివరకు స్వామివారికి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. చివరి రోజైన రథసప్తమి రోజు రథోత్సవం జరుగుతుంది. ఈ రథం నిర్మాణంలో ఒక ప్రత్యేకత ఉంది. ఈ రథాన్ని సుమారు వందేళ్ల క్రితం తయారుచేసినట్లు, రథానికి వాడిన ఇనుప ఇరుసులను, రథం లాగేందుకు ఇనుప గొలుసుల్ని లండన్ నుండి ప్రత్యేకంగా ఓడలో తెప్పించారట. రథానికి సాధారణంగా ఉండే నాలుగు చక్రాలతోపాటు మధ్యలో ప్రత్యేకంగా రెండు చిన్న చక్రాలు అదనంగా ఉన్నాయి. ఉత్సవంలో పొరపాటున పెద్దచక్రాలు ఏమైనా దెబ్బతింటే, ప్రమాదం తప్పేందుకు వీలుగా ఈ చిన్న చక్రాలు ఏర్పాటు చేశారు.

స్వామి అమ్మవార్లను ఉదయాన్నే అభిషేకించి, అర్చనాది పూజాకార్యక్రమాలను పూర్తిచేసి అర్చకులు సూర్యోదయ సమయానికే అలంకరించిన రథంపై ఆసీనులను గావిస్తారు. ఉదయం నుండి మధ్యాహ్నంవరకు స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులను రథంపైకి ఎక్కించి స్వామివారిని దర్శించుకునే సదవకాశాన్ని ప్రతిఏటా కల్పిస్తారు. రథాన్ని ఆనందపరవశంతో ఎక్కిన భక్తులు రథంపై ఆసీనులైన స్వామివారిని దర్శించి ఆనందపరవశులౌతారు. ఆవిధంగా ఉదయమంతా రథంపై స్వామివారిని దర్శించుకునే అవకాశం కల్పించి, మధ్యాహ్నం తరువాత రథాన్ని ఊరేగింపుకు సిద్ధం చేస్తారు. అదేసమయంలో రథం చక్రాల కిందన ఇరువైపులా మరో రెండు గుమ్మడికాయలను ఉంచి వాటిని తొక్కిచ్చుకుంటూ ముందుకు సాగుతారు.

రథాన్ని కదిలించేటప్పుడు రథం, స్వామివార్లకు గుమ్మడికాయతో ద్రిష్టితీసి ఆ గుమ్మడికాయను పక్కగా పగలగొడతారు. రథం ముందువైపు పదులకొద్దీ భక్తులు రెండు పెద్ద తాళ్లను 'గోవింద' నామస్మరణతో లాగుతుంటారు. వెనుక వైపు ఇద్దరు చక్రాలకు కిందివైపు రెండు పెద్ద పెద్ద చెక్కలను ఉంచుతూ రథాన్ని మలుపులు తిరిగేలా చూస్తుంటారు. తిరుమలలో మాఢవీథుల్లో స్వామివారు ఊరేగినట్లు దేవుని కడపలో ఆలయం ముందువైపు బయలుదేరిన రథం గుడి చుట్టూ వచ్చి కల్యాణకట్టకు దగ్గరగా ఉన్న దారిగుండా తిరిగి గుడికి ఎదురుగా వచ్చేలా రథోత్సవం నిర్వహిస్తారు. చుట్టూ ఒక కి.మీ. దూరం మాత్రమే ఉంటుంది. కానీ స్వామివారు



బయలుదేరిన యథాస్థానానికి రావడానికి సుమారు మూడు నుండి నాలుగుగంటల మధ్య సమయంపడుతుంది. మార్గ మధ్యంలో నిండు బిందెలతో నీళ్లుపోసే భక్తులు, స్వామివారికి కర్పూరహారతి, టెంకాయలు, పండ్లు సమర్పించే భక్తులు. గోవిందనామస్మరణతో వేలాదిమంది భక్తుల సమక్షంలో దేవేరి సమేతుడైన స్వామివారు రథంపై ఊరేగుతారు. అర్చకస్వాములు మధ్యమధ్యలో స్వామివారికి కర్పూరహారతి నిస్తూంటారు. అందంగా అలంకరించబడ్డ రథం, స్వామివార్లను చూడడానికి రెండుకళ్లు సరిపోవేమో అన్నంత సుందరంగా కన్నులపండుగగా స్వామివారు దర్శనమిస్తారు.

ఈ రథోత్సవాన్ని చూసేటందుకు జిల్లా నలుమూలల నుండి స్వామివారి భక్తులు దేవునికడప చేరుకుంటారు. అసలే మాఘమాసం, మరోవైపు తీవ్రమైన ఎండను ఏమాత్రం లెక్క చేయక భక్తులు వేలాదిమంది స్వామివారి దర్శనార్థం వస్తారు. ఒకవైపు చెన్నూరు ప్రాంతం నుండి వచ్చిన చెరుకులు దారి పొడుగునా ఉంటాయి. రథోత్సవానికి వచ్చిన భక్తులంతా కచ్చితంగా చెరుకు గెడలను తీసుకెళ్తుంటారు. మరోవైపు పప్పులు, బొరుగులు, ఇతర మిఠాయిలు అమ్మేవాళ్లు మరోవైపు, పిల్లలకోసం ఆటబొమ్మలు అమ్మేవారు మరొకవైపు, రంగుల రాట్నాలు మరొకవైపు ఇలా ఆ ప్రాంతమంతా ఒక జాతర కోలాహల వాతావరణంలా మారిపోతుంది.

ఉభయదేవేరీ సమేతుడైన శ్రీవేంకటేశ్వరస్వామిని భక్తులు కనులారా దర్శించి, వారు కూడా కొంతదూరం రథాన్ని లాగి ఆనందంతో వెనుతిరుగుతారు.

గృహలక్ష్మి

# మాఘ పూర్ణిమ

*- శ్రీ గరిమెళ్ల శరవణ దీక్షితులు*

వెండి వెలుగుల పందిరి మాఘపౌర్ణమి. చిమ్మచీకటికి చంద్రుడు వెన్నెల వెలుతురుల తోరణాలు కడతాడు. అందుకే పౌర్ణమి నాటి రేయి ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. మన మనసులను ఆనందపరవశులను చేస్తుంది. మాఘమాసంలో వచ్చే పున్నమినాడు చంద్రుడు పదహారు కళలతో వెలుగులీను తాడు. మాఘమాసంలో వచ్చే పౌర్ణమినే మహామాఘం అనే పేరుతో పండుగలా పాటిస్తారు.

చంద్రుడు మఘనక్షత్రాన ఉండే మాసం మాఘం. 'మఘం' అంటే యజ్ఞం. యజ్ఞయాగాది క్రతువులకు మాఘ మాసం శ్రేష్ఠమైంది. ఈ మఘాధిపత్యాన క్రతువులు జరిగే మాసం గనుక ఈ మాసానికి మాఘమాసం అనే పేరు వచ్చింది.

## పవిత్రం... మాఘస్నానం

సూర్యుని తేజస్సుకు సాటి వచ్చే కాంతి మరొకటి లేనట్టే, మాఘస్నానానికి సాటి వచ్చే క్రతువు గాని, క్రియ గాని మరొకటి లేదు. పాపరాహిత్యం కోసం నదీస్నానాలు చేయడం మాఘమాస సంప్రదాయం. మాఘస్నానాలు సకల కలుషాలను హరిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి. మాఘస్నాన మాహాత్మ్యాన్ని బ్రహ్మాండపురాణం పేర్కొంటోంది. కల్యాణ కారక మైన ఈ మాసంలో చేసే స్నానం పరమపవిత్రం. మాఘ మాసంలో ప్రత్యూషకాలంలో చేసే స్నానానికి ఎంతో విశిష్టత ఉంది. మాఘస్నానం వల్ల అందం, ఐశ్వర్యం, ఆరోగ్యం, ఆయు ర్దాయంతో పాటు మంచితనం, ఉత్తమశీలం లభిస్తాయని పద్మ పురాణంలో ఉంది. మృకండు, మనస్విల మాఘస్నానఫలమే వారి కుమారుడైన మార్కండేయుని అపమృత్యువుని తొలగిం చిందని పురాణకథనం.

ఏదైనా కారణంవల్ల మాఘస్నానం చేయలేకపోతే కనీసం స్నానం చేసిన వారిని దర్శించి, వారిని దక్షిణతాంబూలా దులు ఇచ్చి సత్కరించి, నమస్కరించినా పుణ్యం వస్తుంది. సమంత్రకంగా, సంకల్పం చెప్పుకుని చేసేదే మాఘస్నానం. నిత్యవిధిగా చేసే స్నానం మాఘస్నానం కాదు. సంకల్పం చెప్పుకుని శాస్త్రవిధానం పాటిస్తూ చేసే స్నానమే మాఘస్నానం.

మాఘమాసంలో సూర్యోదయానికి పూర్వం సంకల్ప ప్రకారం చేసే నదీస్నానం అనంతకోటి ఫలితాన్నిస్తుంది. కనీసం గృహస్నానం చేసినా ఆరు సంవత్సరాలు అఘమర్షణ స్నానం చేసిన ఫలితం వస్తుంది. బావినీటి స్నానం 12 సంవత్స రాల ఫలాన్ని, తటాకస్నానం ద్విగుణం, నదీస్నానం చతుర్గుణం, మహానదీ స్నానం శతగుణం, గంగాస్నానం సహస్రగుణం, త్రివేణీ సంగమస్నానం నదీశతగుణ ఫలితాలను ఇస్తాయని పురాణాలు చెబుతున్నాయి.

దుఃఖదారిద్ర్యనాశాయ శ్రీ విష్ణోస్తోషణాయ చ
ప్రాతః స్నానం కరోమ్యద్య మాఘే పాపవినాశనం।
మకరస్థే రవౌ మాఘ గోవిందాచ్యుత మాధవ
స్నానేనానేన నమో దేవ యథోక్తఫలదో భవ ॥

అనే శ్లోకం పఠిస్తూ, ప్రయాగను స్మరించుకుంటూ మాఘస్నానం చేయాలి. అనంతరం సూర్యునికి అర్ఘ్యం ఇవ్వాలి. ఆ తర్వాత ఏదైనా ఆలయానికి వెళ్లి, దీపారాధన చేయాలి. ఈ మాసంలో శివాలయంలో నువ్వులనూనెతో దీపారాధన చేస్తే ఎంతో మంచిది.

సూర్యుడు చరించే రాశిని బట్టి ప్రత్యూషకాలంలో సూర్యకిరణాలు ఒక ప్రత్యేక కోణంలో భూమిని చేరుతాయి. ఆ సమయంలో సూర్యకిరణాల్లో ఉండే లోహిత, అతినీల లోహిత, పరారుణ కిరణాల సాంద్రతల్లో మార్పులు వస్తాయి. ఆధునిక వైజ్ఞానికులు కూడా జనవరి 20 నుంచి మార్చి 30 వరకు సూర్యోదయానికి పూర్వం చేసే స్నానం శ్రేష్ఠమైందని, ఎంతో ఆరోగ్యకరమైందని చెబుతున్నారు. ఈ కోణంలో చూసినా మాఘస్నానం ఎంతో ఆరోగ్యకారకం. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు కదా పెద్దలు.

## సముద్రస్నానం ఎందుకు చేయాలి?

"నదీనాం సాగరో గతిః" - సకల నదీ నదాలు తమ ప్రవాహం పూర్తి చేసుకుని చివరకు సముద్రంలోనే సంగ మిస్తాయి. కనుక, సముద్రస్నానం చేస్తే సకల నదులలోనూ స్నానం చేసిన పుణ్యఫలం దక్కుతుంది. ముఖ్యంగా సముద్రుడి ప్రత్యేకత ఏమిటంటే... నిత్యం సూర్యకిరణాల వల్ల ఎంతో

నీరు ఆవిరి అవుతున్నా సముద్రపరిమాణం తగ్గదు. అలాగే, ఎన్నో జీవనదులు తనలో కలుస్తున్నా సాగరుని పరిమాణం పెరగదు. స్థిరత్వం ఆయన ధర్మం. అలాగే, ఎన్ని ఆటుపోటులు ఎదురైనప్పటికీ మనిషి స్థిరత్వాన్ని కోల్పోకూడదు. సాగరస్నానం అందించే సందేశం ఇదే.

సాగరుడు సంతోషప్రదుడు. సంవత్సరంలో నాలుగు సార్లు సాగరస్నానం చేయాలనీ, అవి కూడా "ఆషాఢపూర్ణిమ, కార్తికపూర్ణిమ, మాఘపూర్ణిమ, వైశాఖపూర్ణిమ"లలో చేయాలని, అలా సాగరస్నానాలు చేసినవారికి సముద్రుడు సంపూర్ణ ఆరోగ్యం కలుగజేస్తాడని పురాణాలు చెబుతున్నాయి. నదీ ప్రవాహవేగానికి ఎదురుగా నడుము మునిగే వరకూ నిలబడి, కనీసం 48నిమిషాలపాటు స్నానం చేయాలని విధి. అది కూడా సూర్యోదయానికి గంటన్నర ముందు కాలంలోనే చేయాలి.

నీటిలో విద్యుచ్ఛక్తి ఉందని సైన్సు చెబుతుంది. కానీ, ఈ సైన్సు పుట్టుక ముందే ఈ సత్యాన్ని గుర్తించిన మన మహర్షులు బ్రాహ్మీముహూర్తాన్ని నదీ/ సాగరస్నానానికి అనుకూల సమయంగా నిర్ణయించారు. సూర్యోదయకాలం నుంచి, సూర్యాస్తమయం వరకూ ప్రసరించే సూర్యకిరణాలలోని విద్యుచ్ఛక్తిని నదీజలాలు, సాగరజలాలు తమలో నిక్షిప్తం చేసుకుంటాయి. చంద్రుడు తన కిరణాలలోని అమృతత్వాన్ని, ఔషధీ విలువలను నదీజలాలకు అనుగ్రహిస్తాడు. నీటిలో ఉండే ఈ అద్భుతశక్తులు తిరిగి సూర్యకిరణాలకు పరావర్తనం చెంది అంతరించిపోతాయి. అందుకే సూర్యోదయానికి పూర్వమే స్నానం పూర్తి చేయాలనే నియమాన్ని విధించారు పెద్దలు.

మరి "నడుము మునిగే వరకూ ఎందుకు నదీ ప్రవాహవేగానికి ఎదురుగా ఎందుకు నిలబడాలి" అన్న సందేహం రావచ్చు. గర్భస్థ శిశువుగా ఉన్న పిండానికి నాభినాళం ద్వారానే జీవశక్తులు అందుతాయన్నది ఎవరూ కాదనలేని సత్యం. సాగర, నదీజలాలలో నిక్షిప్తమైన సౌరశక్తి, సోమశక్తులు, ఈ నాభి నుంచి శరీరం గ్రహిస్తుంది. అందుకే నాభి మునిగే వరకూ నదిలో నిలబడి స్నానం చేయాలి. సముద్రానికి ప్రవాహం లేకపోయినా, ఉత్తుంగ తరంగాలు తమ తాకిడితో ఆ శక్తులను శరీరానికి అందజేస్తాయి. కనుకనే సముద్రుణ్ణి పూజిస్తూ చేసే నాలుగు స్నానాలలో "మాఘపూర్ణిమ" స్నానం ముఖ్యమైంది.



మాఘమాసంలో దేవతలు తమ సర్వశక్తులు, తేజస్సులను జలాల్లో ఉంచుతారు. అందువల్ల మాఘస్నానం చాలా గొప్పది. సముద్రం, నదులు అందుబాటులో లేని పరిస్థితిలో బావుల దగ్గరగానీ, చెరువుల వద్దగానీ "గంగ, సింధు, కావేరి, కృష్ణ, గౌతమి" నదుల పేర్లు స్మరిస్తూ స్నానం చేస్తే ఆయా నదుల్లో స్నానంచేసిన ఫలితం వస్తుంది. దేనికైనా భక్తిప్రధానం. అది లేనప్పుడు ఎన్నిసార్లు కాకిలా మునిగి, కప్పలా తేలినా ఫలితం శూన్యం.

మాఘమాసంలో సూర్యోదయానికి పూర్వం గృహస్నానం చేసినా ఆరు సంవత్సరాల పాటు అఘమర్షణ స్నాన ఫలం లభిస్తుందని శాస్త్ర వచనం. బావినీటి స్నానం పన్నెండేళ్ళ పుణ్యఫలాన్ని, తటాకస్నానం ద్విగుణం, నదీస్నానం చతుర్గుణం, మహానదీస్నానం శతగుణం, గంగాస్నానం సహస్రగుణం, త్రివేణీసంగమస్నానం నదీశతగుణఫలాన్ని ఇస్తాయి. మాఘస్నానంలో దివ్యతీర్థాలను స్మరించి పాపవినాశనం కోరుతూ స్నానంచేయడం సంప్రదాయం. స్నానసమయంలో 'ప్రయాగ'ను స్మరిస్తే ఉత్తమఫలం లభిస్తుంది.

స్నానానంతరం సమస్త జీవరాశికి ఆధారమైన సూర్యభగవానుడికి అర్ఘ్యం సమర్పించాలి. వైష్ణవ, శివాలయానికి గానీ వెళ్ళి దర్శనం చేసుకోవాలి. అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించడమే కాకుండా శక్తిమేరకు దానధర్మాలు చేయాలి. ఈ రోజున గొడుగు, నువ్వులు దానం చేస్తే విశేషఫలం లభిస్తుంది.

దీనివల్ల జన్మజన్మలుగా వెంటాడుతున్న పాపాలు, దోషాలు నశిస్తాయి.

మహామాఘి పర్వం సందర్భంగా శ్రీకాకుళంజిల్లా నుంచి నెల్లూరుజిల్లా వరకు ఉన్న సముద్రతీరాలన్నింటా మాఘ స్నానాలు చేస్తారు. తెలంగాణ రాష్ట్రంలో నదీస్నానాలు అనేక పుణ్యక్షేత్రాలలో జరుగుతాయి. మీదు మిక్కిలి దేవాలయాలు, తీర్థాలుగా పేర్గాంచిన సముద్రతీరాలలో మరింత వైభవంగా ఉంటుంది. విశాఖ, గుంటూరుజిల్లా బాపట్ల, సూర్యలంక, నిజాం పట్నం, కృష్ణాజిల్లా మచిలీపట్నం బీచ్‌లలో పెద్దసంఖ్యలో ప్రజలు మాఘస్నానాలు ఆచరిస్తారు. తూర్పుగోదావరి జిల్లా అంతర్వేది గోదావరినదీపాయ సముద్రంలో సంగమించే స్థలం. కృష్ణాజిల్లా హంసలదీవి వద్ద కృష్ణానదీ సాగర సంగమస్థలి. ఇటువంటి నదీసాగర సంగమస్థలిలో చేసే మాఘస్నానాలను సింధూస్నానా లని కూడా అంటారు. తెలంగాణ పవిత్రనదీతీర ఆలయాలలో వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో, గోదావరీ నదీ తీర బాసర జ్ఞానసరస్వతి ఆలయంలో, కాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలో మాఘస్నానాలు విశేషంగా జరుగుతాయి.

# రథసప్తమి నోము

**- డా॥ డి. ఉదయ కుమార్, 70134 66957**

అనగనగా ఒక రాజ్యంలో ఒక రాజు ఉండేవాడు. ఆ మహారాజుకు లేక లేక ఒక కూతురు పుట్టింది. ఆ పాపాయిని అల్లారుముద్దుగా పెంచుకోసాగారు. కానీ రాకుమారి పుట్టగానే రాజ్యంలో కొన్ని దుస్సంఘటనలు జరిగాయి. మహా రాజు ఏ పని తలపెట్టినా సకాలంలో పూర్తి కాలేకపోయేది. దీంతో పురోహితులను, పురప్రముఖులను పిలిపించి శాంతి హోమాలు చేయించాలనుకున్నాడు. దీంతో దేశం నలుమూలలా అన్వేషించి గొప్ప పురోహితులను పిలిపించాడు. జరిగిన విష యాల్ని పూసగుచ్చినట్టు వివరించాడు. తమరాజ్యం ఎలాంటి ఉపద్రవాలకు లోనుకాకుండా ఉండే మార్గాన్ని తెలియజేయమని అభ్యర్థించాడు. విజ్ఞులు, అనుభవజ్ఞులైన విప్రోత్తములందరూ ఆలోచించుకుని ఏకాభిప్రాయానికి వచ్చారు.

"మహారాజా! మీ కుమార్తె ఇంతకుముందు జన్మలో గాక అంతకు ముందుజన్మలో ఒక రథకారుని భార్య. ఈమె భర్తకు అనుకూలవతి కాదు. రథకారుడు చేసే ప్రతీ పనిని విమర్శించి అతని పనులకు అడ్డు తగులుతుండేది. అందువల్ల గతజన్మలో భర్తను పోగొట్టుకుంది. అంతేగాక కుటుంబపోషణ కోసం కొన్ని చేయరాని పనులు చేసింది. ఈ జన్మలో మీ కూతురుగా జన్మించింది. ఈమెచే రథసప్తమినోము చేయిస్తే తమకు, తమ రాజ్యానికి గండాలు, ఉపద్రవాలు ఉండవు. గతజన్మ పాతకాలన్నీ తొలగిపోతాయి" అని తెలియజేశారు.

పురోహిత ప్రముఖులు తెలియజేసిన రథసప్తమి నోమును రాజు తన కూతురుచేత నోయించాడు. దీంతో అరిష్టా లన్నీ తొలగిపోయాయి. ప్రజలు, ప్రభువు సుఖశాంతులు పొందారు.

## ఉద్యాపన

సూర్యభగవానుడు మానవుల కర్మలకు సాక్షి. ప్రతి రోజూ సూర్యోదయకాలంలో ఆ ప్రత్యక్ష భగవానుడికి నమస్క రించుకుని మనం దైనందినకార్యకలాపాలకు ఉపక్రమించాలి..

పుష్య బహుళదశమి నుండి మాఘశుక్లసప్తమి వరకు ప్రతి రోజూ పరమాన్నం నివేదించాలి. రథసప్తమి పర్వదినం రోజున సూర్యభగవానుణ్ణి పూజించాలి. మొక్కపెసలను నివేదనగా ఆయన దిక్కుగా నివేదించాలి. శ్రీ సూర్యనారాయ ణుడిని పువ్వులతో పూజించాలి. ముత్తయిదువకు ఆరోజు భోజనం పెట్టి ఫల, పుష్ప, తాంబూలాలతో సత్కరించి పాద నమస్కారం చేసుకోవాలి. ఈ నోము నోచిన స్త్రీలు సమస్త సన్మంగళాలు పొందుతారు.



# పరిశోధక ప్రభాకరుడు

-డా॥తొండాటి రాజశేఖర్,
81797 30107

తెలుగులో ప్రామాణిక పరిశోధకుడు శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి. నిరంతరసాహితీ అధ్యయనం, పరిశీలనాదృష్టి, నూతన విషయాలు సాహితీలోకానికి అందించాలనే కుతూహలం పుష్కలంగా కలిగిన పరిశోధకుడు ఈయన. ప్రభాకరశాస్త్రి బహుగ్రంథకర్త కూడా. గ్రంథపరిష్కరణ, శాసన సంశోధన, భాషాచరిత్ర, లిపి సంస్కరణ అధ్యయనం, గ్రంథాలకు వ్యాఖ్యానం, జీర్ణతాళపత్రప్రతుల్లోని పద్యసేకరణ వంటి అంశాలు ఆయనను మేటి పరిశోధకునిగా తెలుగు సాహిత్య రంగంలో నిలబెట్టాయి.

సొంతఊరు కృష్ణాజిల్లా పెద్దకళ్ళేపల్లిలోనే వేటూరి ప్రభాకరశాస్త్రి వైదికవిద్యల్ని నేర్చుకున్నారు. చల్లపల్లిలో అద్దేపల్లి సోమనాథశాస్త్రి దగ్గర మంత్ర, పతంజలి, యోగశాస్త్రాలు అధ్యయనం చేశారు. బందరు వెళ్లి చెళ్లపిళ్ల వారి దగ్గర శిష్యులై అవధానాలు, సాహిత్యగోష్ఠుల్లో నిష్ణాతులయ్యారు. శాస్త్రిగారిలోని శ్రద్ధాసక్తులే ఆయనను పండితుణ్ణి చేశాయి. ఉద్యోగరీత్యా మద్రాసు ప్రాచ్యలిఖిత భాండాగారంలో, తంజావూరు సరస్వతిమహల్‌లోనూ, తిరుపతి ప్రాచ్యపరిశోధనాలయంలో 1910 నుండి 1950 వరకు దాదాపు 40సంవత్సరాలు నిర్విరామ పరిశోధన గావించారు. ఆయన పరిశోధన- గ్రంథపరిష్కరణ, పీఠికలు, వ్యాసాలు-ప్రతిపాదనలు, వ్యాఖ్యానాలు, శాసనపరిశోధన, సంకలనగ్రంథాలు, అనువాదాలు... ఇలా బహుముఖంగా సాగింది.



## గ్రంథపరిష్కరణ - పీఠికలు

వేటూరి ప్రభాకరశాస్త్రి తాను పరిష్కరిస్తున్న తాళపత్రప్రతికి సంబంధించిన అనేక ప్రతులను ఓపికతో సేకరించి ఒకే చోట చేర్చి పాఠనిర్ణయానికి వచ్చేవారు. పరిష్కరించే గ్రంథానికి విపులమైన పీఠిక రాయడం, ఆ పీఠికలు కూడా సుదీర్ఘంగా ఉండటం, ఆ పీఠికల్లో పూర్వరంగం, ప్రస్తుతపరిశోధన, కవి వివరాలు, పాఠాంతరాలు చర్చించడంవల్ల ప్రభాకరశాస్త్రిని పీఠికా ప్రబంధ పరమేశ్వరుడిగా పరిశోధకులు కొనియాడారు. క్రీడాభిరామం, ఉత్తరహరివంశం, బసవపురాణం, మనుచరిత్ర, రంగనాథ రామాయణం, శ్రీవేంకటేశ్వరవచనాలు, అన్నమయ్య సంకీర్తనలు, అన్నమాచార్యచరిత్ర, సుభద్రాకల్యాణం, సార సంగ్రహగణితం, శృంగారమరుకంవంటి గ్రంథాల్ని పరిష్కరించి, సుదీర్ఘపీఠికలతో ప్రకటించారు.

1940సం॥లో తి.తి.దే.వారి ఆహ్వానంమేరకు తిరుపతి, ప్రాచ్యపరిశోధనాలయానికి వచ్చిన తర్వాత తాళ్లపాక కవుల సాహిత్యానికి జగద్విఖ్యాతి కలిగించే ప్రయత్నం చేశారు. అన్నమాచార్య సంకీర్తనలు 4,5వ సంపుటాలను పరిష్కరించి 1947 సం॥లో ప్రకటించారు.

తాళ్లపాక చినతిరువెంగళనాథుడు రాసిన 'అన్నమాచార్య జీవితచరిత్ర'ను పరిష్కరించి 133 పుటల విపుల పీఠికతో ప్రకటించారు వేటూరి. ఈ పీఠికలో అన్నమయ్య జనన మరణ తేదీలను నిర్ధారించారు. అన్నమయ్యజయంతి ఉత్సవాలను జరిపించారు. సుభద్రాకల్యాణం ప్రతిని పరిష్కరించి, తాళ్లపాక తిమ్మక్కను తొలి తెలుగుకవయిత్రిగా నిర్ణయించారు. ఇంకా కందుకూరి రుద్రకవి రచించిన 'సుగ్రీవ విజయం' అనే యక్షగానాన్ని, కాటమరాజుకథను వేటూరి ప్రభాకరశాస్త్రి పరిష్కరించి పీఠికలతో ప్రచురించారు.

## వ్యాసాలు

శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి వందల వ్యాసాలు రాసి నాటి ప్రముఖపత్రికల్లో ప్రచురించారు. ఆయన వ్యాసాలన్నీ సింహావలోకనం, తెలుగు

మెరుగులు, మీగడతరకలు అనే మూడుగ్రంథాలుగా సంపుటీకరింప బడ్డాయి. ఆయన వ్యాసాలు సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక విషయాలకు ఆలంబనలై ప్రతి విషయం కూడా చారిత్రక విషయాలతో ముడి వేయడం వారి పరిశోధన నైపుణ్యం.

## వ్యాఖ్యానాలు

శ్రీవేటూరిప్రభాకరశాస్త్రి రాసిన కొన్ని వ్యాఖ్యలు పూర్తిగా, మరి కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. కుమార సంభవం, ఉత్తరహరివంశాలకు వీరు వ్యాఖ్యానమందించారు. వ్యాఖ్యానంలో వేటూరి ప్రభాకరశాస్త్రి గారిది విలక్షణ శైలి.

## శాసన సంశోధన

బహుముఖంగా సాగిన వేటూరి వారి పరిశోధనలో శాసనసంశోధన కూడా ఒక భాగం. వీరి శాసన సంశోధన ఎలా సాగిందంటే కేవలం లిపి స్వరూపచరిత్ర, శాసన కాల నిర్ణయం, పాఠప్రచురణ, అర్థవివరణలతో ఆయన తృప్తిపడక ఆనాటి సంఘచరిత్రను, సాహిత్యచరిత్రను, సంస్కృతి లక్షణా లను వివేచించే వరకు సాగింది. 'నాగబు' శబ్దం ప్రభాకర శాస్త్రి కృషి ద్వారానే లభించింది.

## సంకలన గ్రంథాలు

సాహిత్యాన్ని శోధించాలనే తపన, ఏ తాళపత్రంలో ఏముందో తెలుసుకోవాలనే జిజ్ఞాస వేటూరి వారిని నిరంతర పరిశ్రమకు ప్రేరేపించాయి. చెన్నైలోని 'ప్రాచ్యలిఖిత భాండా గారం ఆయనకు నిధి నిక్షేపం. అక్కడి గ్రంథాలు, అముద్రితాలు పరిశీలిస్తూండేవారు. ఆ సందర్భంలోనే జీర్ణమైపోతున్న తాళ పత్రప్రతుల్లోని పద్యాలను రాసుకుని అందులోని చమత్కార పద్యాలను సంకలనగ్రంథాలుగా ప్రకటించారు ప్రభాకరశాస్త్రి. ప్రబంధరత్నావళి, చాటుపద్యమణిమంజరి, లక్షణోద్ధారము, శ్రీవేంకటేశ్వర లఘుకృతులు వెలయించాడు. ఈ నాలుగు గ్రంథాలు కూడా వెలయించడంలో ఆయన కృషి శ్లాఘనీయం.

## తిరుమలలో మహాశివరాత్రి



వేంకటాచలక్షేత్రంలో 'రుద్రుడు' క్షేత్రపాలకునిగా రెండుస్థలాల్లో వేంచేసిఉన్నాడు. తిరుమల శ్రీవారి ఆలయంలోని ధ్వజస్తంభమండపంలోనే బలిపీఠానికి నాలుగైదు అడుగులదూరంలో సరిగ్గా ఈశాన్య మూలలో సుమారు రెండు అడుగుల ఎత్తు శిలా రూపంలో, చిన్నబలిపీఠం ఆకారంతో వెలసిఉన్నాడు. ప్రతిరోజు మూడుపూటలా శ్రీనివాసునికి జరిగే నివే దనల సమయంలో ఆలయంలో ఉన్న ఈ రుద్రునికి బలి నివేదనను సమర్పిస్తారు. అంతేగాక ప్రతిరోజు అర్చకస్వాములు తెల్లవారుజామున తొలిగా ఆలయంలో ప్రవేశించగానే ధ్వజస్తంభం, బలిపీఠాల దగ్గర ఉన్న క్షేత్రపాలకశిలకు నమస్కరించి, తాళాల గుత్తిని ఆ రుద్రునికి తాకించి ప్రదక్షిణంగా ఆలయంలోకి వెళ్తారు. మళ్లీ రాత్రి ఏకాంతసేవ తర్వాత ఉదయం మాదిరిగానే ఆలయం తాళాలగుత్తిని ఈ రుద్రశిలకు తాకించి, నమస్కరిస్తూ ఇంటికి వెళ్తారు. క్షేత్రపాలకుడైన రుద్రుడు శ్రీవారి ఆలయంలోని ఈ చిన్నశిలగా మాత్రమేకాక, ఆలయానికి ఈశాన్య మూలలో నాలుగైదు కిలోమీటర్లదూరంలో ఉన్న గోగర్భ(పాండవ) తీర్థంలో పూర్ణాంశలతో శివుడు "క్షేత్రపాలకుడు"గా పెద్దరాతిగుండు రూపంలో వేంచేసి ఉన్నాడు.

ఆలయంలో నిత్యమూ నివేదనలు మాత్రమే గాక ప్రతి ఏటా 'మహాశివరాత్రి' పండుగ నాడు ఉదయం 9-10గంటల సమయంలో, శ్రీవారిఅలయంనుండి అర్చకులు, వేదపండి తులు ఆలయఅధికారులు, భక్తులు ఛత్ర చామరాలతో పూజాద్రవ్యాలతో, మంగళ వాద్యపురస్సరంగా ఊరేగింపుగా పాండవ తీర్థానికి వెళ్తారు. 'ఆ తీర్థంలో వేంచేసివున్న క్షేత్రపాలకుడైన రుద్రునికి ఏకాదశ నమక చమకరుద్రమంత్రాలతో అభిషేకాన్ని చేస్తారు. అనంతరం క్షేత్రసంప్రదాయం ప్రకారం వేంకటేశ్వరుని భక్తుడైన రుద్రునికి వెండి నామాలను(ఊర్ధ్వపుండ్రాలను), నేత్రాల్ని అలంకరించి పుష్పాలం కరణ చేసిన తర్వాత శాస్త్రోకంగా ధూపదీపనివేదనలు నిర్వహిస్తారు. చివరగా రుద్రునికి ఆరగింపుగా వడపప్పుపణ్ణారం, పానకం, పండ్లతోపాటు తాంబూలాన్ని సమర్పిస్తారు. అక్కడి భక్తులందరికీ తీర్థప్రసాద వినియోగం అయిన తర్వాత అర్చకులు, వేదపండితులు అధికారులు మంగళవాద్యసహితంగా తిరిగి ఆలయానికి చేరు కుంటారు. మహాశివరాత్రి సందర్భంగా గోగర్భతీర్థం (పాండవ తీర్థం)లో తి.తి.దేవస్థానం వారిచేత హరికథ, భజనకార్యక్రమాలు ఏర్పాటు చేయబడతాయి.

– శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

## గ్రంథసమీక్ష

# పిల్లలమఱ్ఱి పినవీరభద్రకృత
# జైమిని భారతము
## శ్రీలలితానందినీ వ్యాఖ్య

వ్యాఖ్యాత- 'భారతభారతి' పుత్తా పుల్లారెడ్డి; సైజు-ఎ4 సైజు; పుటలు-866; ధర-రూ. 2,000/-(పోస్టేజి అదనం); ప్రతులకు- పుత్తాపుల్లారెడ్డి, 1/435/6/1, మారుతినగర్, కడప-516 001. సెల్-86393 84271.

శ్రీపుత్తాపుల్లారెడ్డిగారు సాహితీక్షేత్రంలోకి చాలా ఆలస్యంగా ప్రవేశించినా, చిరస్థాయిగా నిలిచిపోయే సాహిత్య ఫలాలను అందించారు. ముఖ్యంగా ఆంధ్రమహాభారతాన్ని కథారూపంలో అందించడంలోను, ఆంధ్రమహాభారత, భాగవత, హరివంశాలకు నామసర్వస్వాలు రూపొందించడం లోను, మహాభారతవిజ్ఞాన సర్వస్వాన్ని నాలుగు సంపుటాలుగా అందించడంలోనూ ఈయన కృషి ఆచంద్రతారార్కం. పుత్తా పుల్లారెడ్డిగారు వృత్తిరీత్యా ఇంజనీరు అయినప్పటికీ సాహిత్య రంగంలో విశేషకృషి చేసి సుమారు 20కి పైగా గ్రంథాలను రచించారు. పెద్దపెద్దసాహితీసంస్థలు, విశ్వవిద్యాలయాలు చేయాల్సిన పనిని ఒంటి చేత్తో సాధించారు. ప్రస్తుతం పుత్తాపుల్లారెడ్డిగారు పిల్లలమఱ్ఱి పినవీరభద్రుని జైమిని భారతానికి 'శ్రీలలితానందినీ' అనేపేరుతో విస్తారమైన వ్యాఖ్యను రచించి పాఠకలోకానికి అందించారు.

ఎన్నోకోణాల్లో విశేషప్రాముఖ్యత కలిగింది పుత్తా పుల్లారెడ్డిగారి వ్యాఖ్యానం. ప్రతి ముఖ్యపదానికి సుప్రసిద్ధ నిఘంటువు ల్లోని అర్థాలన్నీ వివరించడం, అర్థాన్ని వివరించే పదానికి నిఘంటువులు ఆ పద్యాన్నే ఉదాహరణగా చూపించినట్లయితే దాన్ని కూడా పేర్కొనడం, సంస్కృత మూల 'జైమినీయ అశ్వమేధపర్వాన్ని' పరిశీలించి, తెలుగుకావ్యాలతో సరిపోల్చడం, మూలశ్లోకాలను ఆయా పద్యాల క్రింద పేర్కొనడం, పాఠాంతరాల్ని సూచించడం, మూలశ్లోకాలతో పోల్చి అర్థనిర్ణయం చేయడం, అవసరమైన చోట గోరఖ్‌పూరు వారి హిందీవ్యాఖ్యను పరిశీలించడం, ఆయా సందర్భాలకు తగినట్లుగా శ్లోకాల్ని, పద్యాల్ని ఇతర గ్రంథాలనుండి ప్రదర్శించడం, పద్యాల్ని ఔచితీదృష్టితో విశ్లేషించడం, కొన్నిసార్లు కొన్నిపదాలకు నూతన అర్థనిర్ణయం చేయడం, పౌరాణికవిషయాల్ని సమన్వయించడం ఈ గ్రంథంలో పుత్తాపుల్లారెడ్డిగారు చూపిన వ్యాఖ్యావైభవం.




ఈ వ్యాఖ్యానగ్రంథంలో పుత్తాపుల్లారెడ్డిగారు పినవీరభద్రుని అనువాదవిధానాన్ని ఒక మేటిపరిశోధకుని లాగానే విశ్లేషించారు. అవసరమైన చోట తమ అభిప్రాయాన్ని మొహమాటం లేకుండా ప్రకటించారు. ముఖ్యంగా ఈ గ్రంథంలో ఇచ్చిన అను బంధాలు విజ్ఞానసర్వస్వాలని చెప్పు కోవచ్చు. ఈ 'శ్రీలలితానందినీ' వ్యాఖ్య పిల్లలమఱ్ఱి పినవీరభద్రుని సుకవితాపరీ మళాల్ని బహుముఖీనంగా వ్యాపింపజేసిం దనడంలో సందేహంలేదు. సంప్రదాయ కవిత్వప్రేమికులు, పరిశోధకులు తప్పక, కొని చదవాల్సిన వ్యాఖ్యానగ్రంథమిది. పట్టుమని పదిపుటలు రాయలేక చతికిల పడిపోతున్న వాళ్లు ఉన్న ప్రస్తుతపరిస్థితుల్లో వయోభారాన్ని అధిగమించి ఇంత బృహత్తర వ్యాఖ్య వెల యించిన పుత్తాపుల్లారెడ్డిగారికి అభినందనలు!

*- డా॥ కె. రాధారమణ.*

## డిసెంబరు నెల క్విజ్-29 సమాధానాలు

| | | |
|---|---|---|
| 01) 22 ఏండ్లు | 08) హనుమంతుడు | 15) పాంచరాత్రం |
| 02) శ్రీశుకమహర్షి | 09) పరమశివుడు | 16) వికాసం |
| 03) దయ | 10) ఇదంబుడు | 17) దేవయజ్ఞం |
| 04) ధార్మికచింతన | 11) బ్రహ్మదండం | 18) బుద్ధికి |
| 05) వైష్ణవ | 12) నందిరాజు | 19) శాంత |
| 06) లక్ష్మణుడు | 13) 84 | 20) ఈశ్వర |
| 07) హనుమ | 14) దైవనాయకన్ | |

### సరైన సమాధానాలు వ్రాసినవారు

| | |
|---|---|
| 01) ఎస్.సిద్ధార్థసాయి, కుప్పం | 06) పైళ్ల జాహ్నవ్, ఖమ్మం |
| 02) ఎన్.సుహాంత్ అమర్త్య, తిరుపతి | 07) రుత్విక సాయి, ఖమ్మం |
| 03) వెలిచేటి తన్మయి, రాజమహేంద్రవరం | 08) సంకరి సాత్విక, మెదక్ |
| 04) కె.గౌతమ్, పెదనడిపల్లి | 09) బలివాడ సాధ్విక, రెడ్డిపేట |
| 05) ఎన్.యతీశ్వరి, హైదరాబాదు | 10) టి.రుత్విక్, కరీంనగర్ |

విశ్వదాభిరామం     వేమన పద్యసూక్తి



## గడ్డి దర్భ కాదు

దాత గానివాని తరచుగా వేడిన,
వాడు దాత యౌనె వసుధలోన?
అవురు దర్భ యౌనె అబ్ధిలో ముంచిన?
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** అవురు= (ఒకరకమైన) గడ్డి; దర్భ= ఇవి పవిత్రమైన గడ్డి, కుశ; అబ్ధి= సముద్రం.

**భావం:** ఇచ్చేగుణం లేనివాణ్ణి ఎంత బతిమాలినా వాడు ఏమీ ఇవ్వడు. దాత కాడు. సముద్రంలో ముంచినా అవురుగడ్డి దర్భ కాలేదు గదా!

**వివరణ:** ధనం కానీ, వస్తువు కానీ, కావలసినవాడు ఆప్రాంతంలో ఇచ్చేవాడుగా పేరుబడినవాడెవరో విచారించి, వారినడిగి పొందుతారు. ఇది లోకంలో సహజం. ఇవ్వనివాడిదగ్గరకు ఎవరూ వెళ్లరు. అడిగినా వాడు ఇవ్వడు కాబట్టి. ఇచ్చే బుద్ధి లేని లోభిని దాత చేద్దామని వాడిని ఎంత బ్రతిమిలాడినా, వాడు ఇవ్వడు దాత కాడు. అలాగే గడ్డి సాధారణమైంది. దర్భ పవిత్రం. మామూలు గడ్డిని దర్భను చేద్దామని దాన్ని సముద్రంలో ముంచి తీసినా, గడ్డి గడ్డే అవుతుంది. కానీ దర్భ కాదు. దుర్గుణాలు కలవాడికి మంచిగుణాలు కలిగిద్దామని ఎంత ప్రయత్నించినా, సాధ్యం కాదు. మంచిగుణాలు సహజంగా ఉండాల్సిందే కాని నేర్పితే వచ్చేవి కావు.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

భాస్కరశతకం

## ఎంతలో ఉండాలో అంతలోనే ఉండాలి!

చ. వలవదు క్రూరసంగతి యవశ్య మొకప్పుడు సేయఁపడ్డచోఁ
గొలఁదియెకాని యెక్కువలు గూడవు, తమ్ములపాకు లోపలం
గలసిన సున్నమించుకయకాక మఱించుక ఎక్కువైనచో
నలుగడఁ జుఱ్ఱుజుఱుమని నాలుక పొక్కక యున్నె భాస్కరా!

**తాత్పర్యం–**

భాస్కరా! ఎట్టి పరిస్థితులలోనూ క్రూరులతో సహవాసం చేయరాదు. తప్పని పరిస్థితులలో స్నేహం చేయాల్సి వస్తే అంటీముట్టనట్టు ఉండాలిగాని అతిస్నేహం పనికిరాదు. తమలపాకులో సున్నం కొంచెమే అయితే ఏమి కాదు గాని ఎక్కువైతే నాలుకంతా పొక్కి భగభగమని మండకుండా ఉండదు కదా!

దుష్టునికి దూరంగా ఉండాలని సూక్తి. చెడును పదిచ్చి వదిలించుకోవాలని సామెత. మనం ఎంత ప్రయత్నించినా కొన్ని సందర్భాల్లో దుష్టుల సాంగత్యం తప్పని సరి అవుతుంది. అటువంటి సమయంలో ఏమరుపాటుగా ఉండకూడదు. పనిపూర్తి అయ్యేవరకు ఆచితూచి వ్యవహరించాలని శతక కవి ప్రబోధిస్తున్నాడు. తాంబూలాన్ని దృష్టాంతంగా కవి వివరించిన వైనం మనోహరంగా ఉంది. తమలపాకులో సున్నంవక్కలు వగైరాలు వేసి తాంబూలం సిద్ధంచేస్తారు. ఐతే అందులో సున్నం పాలు విషయంలో జాగ్రత్తగా ఉండాలి. తగినంత సున్నం వేస్తే ప్రమాదం ఏమీ ఉండదు గాని, సున్నం ఎక్కువైతే మాత్రం నోరు పొక్కుతుంది, నాలుక భగ్గుమని మండుతుంది. కొన్నిరోజుల పాటు ఆ బాధ అనుభవించాల్సి వస్తుంది. కనుక సున్నాన్ని జాగ్రత్తగా తగినంత వాడుకోవాలి. ఆ విధంగానే తప్పనిసరి పరిస్థితుల్లో దుష్టుల సాంగత్యం తటస్థించినపుడు జాగ్రత్తతో వ్యవహరించాలి. దుష్టుల నుండి ప్రమాదాన్ని తప్పించుకోవాలి అని శతక కవి చక్కని దృష్టాంతంతో వివరించాడు.

– డా॥ వద్దేపల్లి శ్రీనివాసరావు




- శ్రీ బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, 98854 81939

ప్రకాశంజిల్లా, కనిగిరి పట్టణంలోని మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన నేను బాల్యం నుండి శ్రీవేంకటేశ్వరస్వామినే నమ్ముకున్నాను. డిగ్రీప్యాసయ్యాక సరైన ఉద్యోగంరాక కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. అన్నామలై యూనివర్శిటీద్వారా ప్రైవేటుగా బి.ఈడి., సీటు పొందాను కానీ పరీక్షలు రాసే ధైర్యం చేయలేక పోయాను. ప్రతిరోజూ శ్రీవేంకటేశ్వరస్వామినే మౌనంగా ప్రార్థించుకునేవాడిని. నాకు గురుతుల్యులైన శ్రీ వి.వి.చలపతి రావు మాష్టారు గారి చేత నన్ను ఒప్పించి పరీక్షలు రాసేందుకు పంపించారు ఆ స్వామి. ఆ సంఘటనే నా జీవితాన్ని మలుపు తిప్పి గెలిపించింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డ నేను అడుగడుగునా ఆపదమొక్కులవాడినే ప్రాధేయపడేవాడిని. అనేక సందర్భాలలో, వివిధ సంఘటనలలో ఎవరో ఒకరిద్వారా నాకు అండదండలందించేవాడు. ఆవిధంగా నేను ప్రైవేటుగానే యం.ఎ., యం.ఈడి., కూడా పూర్తి చేయగలిగాను.

ఒక సాధారణకవినైన నేను ఏడుకొండలవాడి దయ చేతనే అనేక ఆధ్యాత్మికరచనలు కూడా చేయగలిగాను. తిరుమల తిరుపతి హిందూ ధర్మప్రచారపరిషత్ వారి శుభప్రదం కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులకు దైవభక్తి, దేశభక్తి విషయాలలో ప్రసంగాలద్వారా ప్రబోధం అందించాను. అలాగే ఉద్యోగవిరమణ చేశాక తి.తి.దే. హిందూ ధర్మప్రచారపరిషత్ వారి ఆధ్వర్యంలో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లావ్యాప్తంగా దాదాపు దశాబ్దం పాటు అనేకగ్రామాలలోని వివిధ దేవస్థానాలలో రామాయణ, మహాభారత, భాగవతాలపై ప్రవచనాలు చెప్పగలిగే భాగ్యాన్ని శ్రీనివాసుడే ప్రసాదించాడు.

నేను ఏమాత్రం ఊహించని విధంగా 90 సంవత్సరాల వయసున్న శ్రీవేంకటేశ్వరస్వామి భక్తుడు ఒకాయన పట్టుపట్టి నాచేత 30 రోజులలో 30 పాశురాలను కవితలరూపంలో రాయించి 'పాశురగీతాసౌరభం' పేరుతో ప్రచురింపజేశారు. ఇదంతా స్వామివారి అనుగ్రహమే! అనునిత్యం ఆధ్యాత్మిక చింతనతో ఆత్మానందాన్ని పొందుతుంటాను. భౌతికసంపదల కన్నా దైవికసంబంధాలకే అధిక ప్రాధాన్యత ఇస్తుంటాను. అందులోనే అంతులేని ఆత్మానందాన్ని అనుభవిస్తుంటాను.



గత సంవత్సరమే(2024) ఆ దేవదేవుని అపారకృపా కటాక్షాలు నామీద వర్షించాయి. నేను కలలో కూడా ఆశించలేని అద్భుతఅవకాశం తిరుమల తిరుపతి దేవస్థానములవారినుండి అందుకున్నాను. అదేమిటంటే "రథసప్తమి" పర్వదినంనాడు తిరుమలమాడవీథులలో స్వామివారికి జరిగే వాహనాల ఊరేగింపులలో రెండువాహనాలకు ప్రత్యక్షవ్యాఖ్యానం చేయటంతో పాటు తిరుపతిలోని గోవిందరాజస్వామికి జరిగే ఊరేగింపులలో ఒక వాహనానికి ప్రత్యక్షవ్యాఖ్యానం చేయటం. ఆ సేవలలో పాల్గొన్న సందర్భంగా నేను పొందిన ఆత్మానందం ఆ పరమాత్మకే తెలుస్తుంది! ఒక మిత్రుడి కోరికపై 'వాసవీ చాలీసా', 'శివ చాలీసా'లను రచించాను. వాటిని నా చేత రాయించింది కూడా శ్రీవేంకటేశ్వరస్వామేనని నమ్ముతాను. తద్వారా నా జన్మ ధన్యమైనట్లుగా తృప్తి చెందాను. జీవితంలో నేను అందుకున్న వన్నీ ఆ స్వామి అనుగ్రహంవల్లేనని అనుదినం అనుభూతి చెందుతుంటాను. కలియుగదైవం శ్రీవేంకటేశ్వరస్వామిలీలలు కోకొల్లలు. అనంతమైన ఆ స్వామికరుణలో అణువంతైనా నాకు ప్రాప్తించటం ఎన్నో జన్మల పుణ్యఫలంగా భావిస్తుంటాను.

ఆయుర్వేదం

# నీరసం తగ్గాలంటే...

– డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

ఈ రోజుల్లో వయసు, స్త్రీ, పురుష తారతమ్యం, శారీరక బరువు, శారీరకమానసిక ఆరోగ్యపరిస్థితులతో నిమిత్తం లేకుండా అత్యధిక శాతం మంది వివిధకారణాల రీత్యా చీటికి మాటికి అలసట, బడలిక, నిస్త్రాణకు గురవుతున్నారు. వీటికి తోడు యాత్రలు, దీక్షలు, ఉపవాసాలు, జాగరణలు చేసేవారు, పండుగలు, పర్వదినాలు ఇతర హైందవ సంప్రదాయ ఆచార వ్యవహారాల్లో భాగంగా నియమనిష్ఠలతో ఉంటున్నారు. ఇందు వల్ల బడలిక, నీరసం, నిస్త్రాణ దరిచేరకుండా ఉండేందుకు ఈ క్రింది విధివిధానాలు చక్కగా ఉపకరిస్తాయి.

రోజూ రెండు మూడుసార్లు గ్లాసు నీటిలో అరబద్ధ నిమ్మరసం, 3,4 టీ స్పూన్ల తేనె కలిపి సేవిస్తుండాలి. కొబ్బరి నీరు, చెరుకురసం, బత్తాయి, దానిమ్మ, కమల, పుచ్చకాయ వంటి పళ్లరసాలు శక్తిదాయకంగా ఉంటాయి.

గుప్పెడు వేరుశనగలని తగినన్ని నీటిలో రాత్రంతా నానించి ఉదయం అందులో గ్లాసు నీరు పోసి ఒక అరటి పండు, ఒకటి, రెండు స్పూన్ల తేనె, తగినంత నీరు చేర్చి మిక్సీలో వేసి జ్యూస్ చేసుకుని త్రాగాలి.

రోజూ ఉదయం 200 మి.లీ. కాచిన పాలలో ఒక అరటిపండు ముక్కలు, ఒక టీ స్పూన్ పటికబెల్లంపొడి, రెండు ఎండు ఖర్జూరంకాయలపెచ్చులు కలిపి మిక్సీలో వేసి త్రాగాలి.

రాత్రి పడుకునేటప్పుడు కప్పు వేడిపాలలో చిటికెడు పచ్చ కర్పూరం పొడి, అర టీస్పూన్ బెల్లం కలిపి త్రాగాలి.

7, 8 గంటలు నీటిలో నానించిన వేరుశనగ పప్పులో నాలుగైదు స్పూన్ల పచ్చికొబ్బరి కోరు, 10–15 ఖర్జూరం పళ్ళు కలిపి తినాలి.

100 గ్రాముల బాదంపప్పు, 100 గ్రాముల పటిక బెల్లం పొడి, 10 గ్రాముల ఏలకులపొడి కలిపి ఉంచుకొని రోజూ ఒకసారి కప్పు పాలలో ఒక టీస్పూన్ పొడి కలిపి సేవించిన కూడా మంచి ఫలితం కలుగుతుంది.

బాదం, పిస్తా, జీడి, ప్రొద్దుతిరుగుడు, గుమ్మడిలాంటి విత్తనాలు అన్ని కలిపి 30–40 గ్రాముల వరకు తీసుకొని 6–8 గంటలు తగినన్ని నీటిలో నానించి తిని తాజా పళ్ళు, ఖర్జూరం, కిస్‌మిస్, అంజీర వంటి వాటిని నంజుకుని తింటున్నా నీరసం, నిస్త్రాణ దరిచేరకుండా వుంటాయి.



పూర్వం ఉపవాసాలు, దీక్షలు చేసేవారు త్వరగా ఆకలి వేయకుండా ఉండేందుకు, నీరసం రాకుండా ఉండేందుకు రోజూ ఉదయం గ్లాసుపాలలో ఒకట్రెండు స్పూన్ల ఉత్తరేణి బియ్యం వేసి కాసేపు నానించి పాయసంలా చేసుకుని త్రాగేవారు.

రాత్రి పడుకునేటప్పుడు 100 మి.లీ. నీటిలో గుప్పెడు (25గ్రాముల వరకు) కిస్‌మిస్ పళ్ళు, ఒక నిమ్మరసం వేసి ఉదయం వాటిని తిని మిగిలిన పానీయం సేవించాలి.

రోజూ ఒకసారి ఆయుర్వేద ఔషధాలు అయిన చ్యవన ప్రాశ లేదా కూష్మాండావ లేహ్యాన్ని టీ స్పూను వంతున సేవిస్తున్నను నీరసం, బలహీనత దరిచేరవు.

అశ్వగంధచూర్ణం లేదా శతావరి చూర్ణంలాంటి ఆయుర్వే దౌషధాలను రోజూ ఒకసారి కప్పుపాలలో అర టీస్పూన్ పౌడర్‌ని కలిపి త్రాగుచున్న బలహీనత దరిచేరకుండా ఉంటుంది.

అశ్వగంధ చూర్ణం, ఉసిరిక చూర్ణం సమానంగా కలిపి ఉంచుకుని రోజూ ఒకసారి 100 మి.లీ. నీటిలో అర టీస్పూన్ చూర్ణాన్ని కలిపి సేవిస్తుంటే కూడా శారీరక, మానసిక అలసటలు దరిచేరవు. ఉత్సాహంగా, ఉల్లాసంగా, ఆరోగ్యవంతులుగా ఉంటారు.

**గమనిక: షుగర్ వ్యాధిగ్రస్తులు పంచదార, బెల్లం, తేనె, తియ్యటి పళ్ళు వాడుక విషయంలో వైద్యుల సూచనలు, సలహాలు పాటించవలసి ఉంటుంది.**

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం**–వృత్తివ్యాపారాలలో ధైర్యం, ఆత్మస్థైర్యం ప్రదర్శించి లాభాలు పొందుతారు. కొత్త వ్యాపారాలకు శ్రీకారంచుడతారు. ఉద్యోగవిషయాలు ఆశాజనకంగా ఉంటాయి. వైవాహికజీవనం ఆనందమయంగా ఉంటుంది. నెలాఖరులో ఆర్థికవిషయాలు మిశ్రమంగా ఉంటాయి.



**వృషభం**– ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి. పోటీపరీక్షలలో రాణించి రెవిన్యూఅధికారిగా, లేదా పోలీసుశాఖలో ఉన్నత ప్రభుత్వ అధికారాన్ని పొందే అవకాశం ఉంది.



**మిథునం**– చట్టపరమైన సమస్యలు వస్తాయి. ఆరోగ్యపరంగా జాగ్రత్త అవసరం. తలనరాల నొప్పి, అజీర్ణం, రక్త ప్రసరణ సమస్యలు, పైల్స్ వంటి అనారోగ్యం సమస్యలు వస్తాయి, కొన్ని అనవసర ఖర్చులు, నష్టాలు కలుగుతాయి.



**కర్కాటకం**–వ్యయరాశిలో కుజవక్రం ముగియడం శుభఫలితాలను, ఆరోగ్యాన్ని, మరిన్ని ఆదాయ వనరులను కల్పిస్తుంది. మీరు స్నేహితుల నుండి మద్దతు పొందుతారు. రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు సరైన సమయం.



**సింహం**–జీవితభాగస్వామి, పిల్లలతో సమయాన్ని గడపడానికి ఇష్టపడతారు. కొత్త స్నేహితులను కూడా సంపాదించుకుంటారు. ఆనందకరమైన జీవనశైలిని కలిగి ఉంటారు. పిల్లల విషయం సంతోషాన్ని కలిగిస్తుంది.



**కన్య**– ఉద్యోగంలో వికాసం, ఉన్నతి కలుగవచ్చు. వృత్తివ్యాపారాల్లో ఇతరులపై ఆధిపత్యం ప్రదర్శిస్తారు. ధనాదాయం పెరుగుతుంది.



**తుల**– మిత్రులతోనూ, బంధువులతోనూ అవగాహనాలోపం వల్ల చిక్కులు. ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉంటుంది. వైద్యసహాయం అవసరమవుతుంది. ఆరోగ్యం కుదుటపడుతుంది. ధనానికి లోటుండదు.



**వృశ్చికం**– వ్యవసాయం ఫలించి ధనం వస్తుంది. కొత్తగా పారిశ్రామికసంస్థలలో పెట్టుబడులు లేక వాటాలు తీసుకోవడం అవుతుంది. కుటుంబంలో వంశోద్ధారకులు పుట్టే అవకాశం ఉంది.



**ధనుస్సు**– కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో సత్సంబంధాలు కలిగి ఉంటారు. మీ పిల్లలు విద్యలలో రాణిస్తారు. తోబుట్టువులతో ఆనందంగా గడిపే అవకాశం కూడా ఉంది.



**మకరం**– విద్యార్థులు వక్తృత్వపు పోటీలలో, చర్చావేదికలలో రాణించి బహుమతులు గెలుచుకుంటారు. వ్యక్తిగతంగా విలువ పెంచుకోవడం అంటే ఇదే. ఉద్యోగనియామకపు పరీక్షలలో నెగ్గుతారు.



**కుంభం**– వృత్తివ్యాపారాలలో అనూహ్యమైన అవకాశాలను, లాభాలను తెస్తుంది. ఆర్థికస్థితి మెరుగుపడుతుంది. ఆరోగ్యవిషయాలు కూడా అనుకూలం. దూరప్రయాణాలు కలిసివస్తాయి.



**మీనం**– సోదరులు, స్నేహితులు మీ బలానికి మూలస్తంభాలవుతారు. మీలోని సృజనాత్మకశక్తి పెరిగి రాణిస్తారు. అధిక ఆదాయాన్ని పొందుతారు. ఆరోగ్యం కూడా సంతృప్తికరంగా ఉంటుంది. మీ సామాజికస్థితి బాగుంటుంది. ఊహించని లాభాలు వస్తాయి.

చిత్ర కథ

# భక్తితో ఏదైనా సాధ్యమే!

కథ- డా॥కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు- శ్రీ తుంబలి శివాజీ





శివుడు ప్రసాదించిన మామడిపండును చూసిన పునీతవతి భర్త చింతలో పడిపోయాడు.
దైవాంశసంభూతురాలైన ఈమెతో నేను భౌతిక సంబంధాలను ఎలా కొనసాగించడం? అందుకే వ్యాపారం కోసమని చెప్పి పాండ్యనాడు వెళ్లిపోతాను.
అల్లుడు వేరొక ఊరిలో స్థిరపడ్డాడని తెలిసి పునీతవతి తండ్రి తన కూతురుని ముత్యాలపల్లకిలో తీసుకొని పాండ్యనాడుకు వచ్చాడు.
అయితే పునీతవతి భర్త అక్కడ మరో యువతిని పెండ్లాడాడు. తనకు పుట్టిన కూతురుకు పునీతవతి అనే పేరు పెట్టుకున్నాడు.
పరమేశ్వరా! ఏ భర్తకోసమైతే ఈ శరీరాన్ని, సౌందర్యాన్ని కాపాడుకుంటూ వచ్చానో ఆ భర్తే నన్ను నిరాకరిస్తే నాకీ అందం ఎందుకు? నన్ను యోగినిగా మార్చి ఆ రూపం ప్రసాదించు.
పునీతవతి వృద్ధురాలైన శివయోగినిగా మారిపోయింది.
శివా! బొందితో కైలాసం వస్తున్నాను. దర్శనమీవయ్యా!
పార్వతీ! మనల్ని పూజించే మన తల్లి వచ్చింది చూడు.
చెప్పు అమ్మా! నీకేం కావాలి?
నీ నామస్మరణ, నీ సాన్నిధ్యం శాశ్వతంగా అనుగ్రహించు దేవా!
తిరిగి వచ్చిన కారైక్కాల్ అమ్మ ఆలంగాడులో.. ప్రతి సాయంత్రం శివుని నృత్యాన్ని ప్రత్యక్షంగా దర్శిస్తూ, ఆయనను కీర్తిస్తూ ధన్యురాలైంది. బొందితో కైలాసం పోయి, శివునితో అమ్మా అని పిలిపించుకుని తిరిగి వచ్చిన ఈ మహా భక్తురాలి కథ శివరాత్రి పర్వదినాన తలచుకున్నవారి కోరికలన్నీ నెరవేరుతాయి!
2

## పదంలో పదం చెప్పుకోండి చూద్దాం!

01) సరిహద్దు లోని 'బేసి'కి వ్యతిరేకం
02) విపత్తులు లోని గింజలు
03) ఆకురాయిలోని పచ్చదనపు చెట్టుభాగం
04) పరాజిత లోని రేఖ
05) విరివి లోని పువ్వు
06) కామంచిమొక్క లోని 'చెడు'కు వ్యతిరేకం
07) నడవడి లోని వేగం
08) నమస్కారం లో మోసగించి వెళ్ళడం
09) జగపతి లోని భూమి తల్లి
10) పుంజుకుని లోని పెట్టకు పుంలింగం
11) ప్రభంజనం లోని విరుచుట
12) మలయ లోని మెట్టు / పర్వతం
13) చెలియలికట్ట లోని స్నేహితురాలు
14) కాటిరేడు లోని చంద్రునికి వికృతిపదం (నానార్థానికి)
15) భేతాళము లోని ఒక వాద్యసాధనం

-: జవాబులు:-

01) సరి 02) విత్తులు 03) ఆకు 04) రాజి
05) విరి 06) మంచి 07) వడి 08) మస్కా
09) జగతి 10) పుంజు 11) భంజనం 12) మల
13) చెలియ 14) రేడు 15) తాళము

## రెండు సంఖ్యలు

ఆ రెండు సంఖ్యల భేదం ఎనిమిది. ఆ భేదంతో రెండు సంఖ్యలను భాగించితే ఒకటి శేషంగా వస్తుంది. పదితో మొదటి సంఖ్యను భాగించితే తొమ్మిది శేషంగా వస్తుంది. పదకొండుతో మొదటి సంఖ్యను భాగించితే రెండు, రెండో సంఖ్యను భాగించితే ఐదు శేషంగా వస్తుంది. అలాగే పన్నెండుతో మొదటి సంఖ్యను భాగించితే తొమ్మిది, రెండో సంఖ్యను భాగించితే ఒకటి శేషంగా వస్తుంది. ఈ ఆధారాలతో ఆ రెండు సంఖ్యలేవో కనుక్కోండి?

జవాబులు- 49, 57



## చుక్కలు కలపండి!

## రంగులు వేద్దాం..!!




పై చిత్రాన్నిచూసి రంగులు వేయండి









# ఎప్పుడు ఏది పనికొస్తుందో తెలీదు!

- డా॥నల్లాని రాజేశ్వరి, 99086 02443

**చా**లా సంవత్సరాలకు ముందు దక్షిణప్రాంతంలో వసంతవాడ అనే మహానగరం ఉండేది. ఆ నగరంలో బంగారు శెట్టి అనే వ్యాపారి ఉండేవాడు. అతని భార్య తాయారమ్మ. బంగారుశెట్టికి ధనాశ చాలా ఎక్కువ. దైవభక్తి తక్కువ. ఒకరోజు ఆయన పొరుగూరు వెళ్లాడు. ఆ సాయంత్రం ఒక వృద్ధబ్రాహ్మణుడు బంగారుశెట్టి భార్యను చూచి "తల్లీ! నేను వృద్ధుడను. మా ఊరికి చేరుకోవా లంటే ఇంకా పది ఆమడలు వెళ్లాల్సి ఉంది. చీకటి పడి పోయింది. ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నాయి. చలిగాలికి తాళలేకపోతున్నాను. శరీరం వణికిపోతోంది. మీ ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుని, ప్రాతఃకాలంలో మాఘస్నానం చేసి వెళ్లి పోతాను" అని అభ్యర్థించాడు.

తాయారమ్మకు జాలి కలిగింది. వెంటనే తమ అరుగు మూల శుభ్రం చేసి, చాప వేసి, కప్పుకోవడానికి దుప్పటి నిచ్చి విశ్రాంతి తీసుకోమనింది. ఆమె దయాహృదయానికి ఆ వృద్ధ బ్రాహ్మణుడు సంతోషపడ్డాడు. తాయారమ్మ ఒక పండు తీసుకు వచ్చి, ఆ బ్రాహ్మణుడి కిచ్చి తినమంది. తర్వాత తీరికగా "స్వామి! మాఘస్నానం చేసి వెళ్తానన్నారు కదా! ఆ మాఘస్నాన మంటే ఏమి? నాకు తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది." అని అడిగింది. ఆ బ్రాహ్మణుడు "అమ్మా! మాఘమాసం గురించి చెప్పడం నాకు తరం కాదు. ఈ నెలలో సూర్యోదయం తర్వాత నదీస్నానం చేసి విష్ణుమందిరానికి వెళ్లి తులసీ దళాలతో, పూలతో పూజచేసి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలి. తర్వాత మాఘపురాణాన్ని చదవాలి. ఇలా ప్రతిరోజూ వదిలి పెట్టకుండా నెలరోజులు చేసి చివరన బ్రాహ్మణ సమారాధన, దానధర్మాలు చేయాలి.



ఇలా చేసినట్లయితే, మనుషులను నరకంపాలు చేసే మహాపాపాలన్నీ నశించిపోతాయి. ఒక వేళ ఈ నెల రోజులూ చేయలేని వారు, ముసలివాళ్లు, రోగులు ఒక్కరోజైనా అంటే ఏకాదశిరోజు గాని, ద్వాదశిరోజుగాని లేక పౌర్ణమినాడుగాని పై ప్రకారం చేసినట్లయితే సమస్తపాపాలు తొలగి సిరిసంపదలు, పుత్రసంతానం కలుగుతుంది." అని చెప్పాడు. అతని మాటలు తాయారమ్మను ఆలోచింపజేశాయి. తాను కూడా ప్రాతఃకాలంలో బ్రాహ్మణుడితో పాటు వెళ్లి నదీస్నానం చేయాలనుకుంది.

ఇంతలో పొరుగూరు నుండి భర్త తిరిగి వచ్చాడు. మాఘస్నానం గురించి తాయారమ్మ, భర్తతో చెప్పింది. అతడు భార్య మాటలకు అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. "ఓసీ వెర్రిదానా! మాఘమాసమేంది? స్నానమేమిటి? వ్రతమూ, దానమూ ఏమిటి? నీకేమైనా పిచ్చి పట్టిందా? చాలు, చాలు.. నీ అధిక ప్రసంగం. ఎంతో కష్టపడి, వీళ్లను, వాళ్లనూ అధిక వడ్డీలతో బాధించి కూడబెట్టిన సొమ్మును దానం పేరుతో పరులపాలు చేస్తావా? చలిలో చన్నీళ్ల స్నానం చేసి, పూజలు, దానాలు చేస్తే, ఒళ్లూ, ఇల్లూ గుల్లయి, నెత్తిన చెంగేసుకుని, నడివీధుల్లో భిక్షమెత్తాల్సిందే జాగ్రత్త!" హెచ్చరించాడు.

ఆ రాత్రి తాయారమ్మకు నిద్రపట్టలేదు. ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడెప్పుడు నదీస్నానం చేద్దునా అని

తెల్లార్లు కునుకుతీయనేలేదు. ఆకాశం తెల్లారగానే భర్తకు తెలీకుండా, అతనికి చెప్పకుండా, ఆ వృద్ధ బ్రాహ్మణుడితో పాటు వెళ్లి నదీస్నానం చేస్తోంది. ఈలోగా బంగారుశెట్టి ఒక దుడ్డుకర్ర తీసుకువచ్చి, భార్యను కొట్టడానికి ప్రయత్నించాడు. ఆ పెనుగులాటలో భార్యాభర్తలిద్దరూ నీట మునిగారు. దాంతో ఇద్దరికీ మాఘమాసఫలం దక్కింది. మొత్తం మీద బంగారుశెట్టి భార్యను చితక బాది ఇంటికి తీసుకువచ్చాడు.

ఇది జరిగిన కొన్ని సంవత్సరాలకు భార్యాభర్తలిద్దరూ అనారోగ్యంతో చనిపోయారు. బంగారు శెట్టిని తీసుకుపోవ డానికి యమభటులు వచ్చి తీసుకుపోసాగారు. తాయారమ్మను తీసుకుపోవడానికి విష్ణుదూతలు వచ్చారు.

అప్పుడు తాయారమ్మ యమభటులతో "ఏమిటి ఈ అన్యాయం! నన్ను వైకుంఠానికి తీసుకుని పోవడమేమిటి? నా భర్తను యమలోకానికి తీసుకుని పోవడమేమిటి ? ఇద్దరమూ సమానమే కదా!" అని అడిగింది.

అందుకు వాళ్లు- "అమ్మా ! నీవు మాఘమాసంలో ఒకరోజు నదీస్నానం చేశావు గనుక నీకీ ఫలం దక్కింది. కానీ, నీ భర్త అన్యాయంగా ధనార్జన చేశాడు గనుక యమలోకానికి తీసుకుపోతున్నాం" అని చెప్పారు.

అందుకామె మళ్లీ వాళ్లతో "నేను ఒక రోజు స్నానం చేసినందుకే పుణ్యఫలం కలిగినప్పుడు నన్ను కొట్టుతూ నా భర్త కూడా నీటిలో మునిగాడుకదా! శిక్షించడంలో ఇంత వ్యత్యాస మెందుకొచ్చింది?'' అని అడిగింది. యమభటులు ఈ విషయాన్ని చిత్రగుప్తుని దృష్టికి తెచ్చారు. అతడు పాపపుణ్యాల పట్టిక చూచాడు. ఇద్దరికీ సమానమైన పుణ్యఫలం రాసి ఉంది. జరిగిన పొరబాటుకు చిత్రగుప్తుడు విచారించి బంగారుశెట్టిని కూడా విష్ణులోకం పంపాడు. ఎప్పుడు దేనివల్ల మనకు ఏ ప్రయోజనమొస్తుందో ఎవరూ ఊహించలేరు.

భార్యవల్ల భర్తకు కూడా మోక్షం కలిగింది. భర్త ధనాశాపరుడుగా వ్యవహరించినా భార్య యథాలాపంగా ఒక్క రోజు మాఘమాస స్నానం చేసినందువల్ల ఇద్దరికీ మోక్షప్రాప్తి కలిగింది. కనుక మాఘస్నానం నెలరోజులు చేస్తే మరింత మోక్షదాయకం!

**గ్రంథసమీక్ష**

సంకుసాల నరసింహకవి

# కవికర్ణ రసాయనము అవతారిక

వ్యాఖ్యాత- డా॥కంపల్లె రవిచంద్రన్; సైజు-1/8 డెమ్మీ; పుటలు-171; ధర-రూ. 250/-; ప్రతులకు-రచయిత సెల్ నెం.-98487 20478.

సంకుసాల నృసింహకవి విరచిత 'కవికర్ణ రసాయన' ప్రబంధ అవతారికకు సుమనోజ్ఞమైన వ్యాఖ్యను సంతరించిన డా॥కంపల్లె రవిచంద్రన్ తమ వ్యాఖ్యా రూపంలో విష్ణుభక్తితత్పరతను ప్రతిఫలింపచేశారు. పరంధా ముని ఉపాసించారు. ఈ ప్రబంధ అవతారికలోని వంద పద్యాలకు పండిత, పామరులు ప్రశంసింపదగ్గ, సార్థకమైన వ్యాఖ్యలో శ్రీమహావిష్ణువు శ్రీరంగక్షేత్రంలో కొలువు తీరిన వృత్తాంతాన్ని ప్రామాణికమైన ఉపపత్తులతో, ఉపనిషదాది సూత్రాలతో వ్యాఖ్యాత సమకూర్చాడు. అతిసాధారణ భక్తునికైనా మనస్సులో ముద్రపడే రీతిలో వ్యాఖ్యాత అందించిన వివరణలు సరళసుందరంగా సాగాయి.

సందర్భోచితంగా భగవత్సంబంధమైన అనేకాంశాలను ఉటంకిస్తూ కవికర్ణరసాయన ప్రబంధం అవతారిక పరమార్థాన్ని ఈ వ్యాఖ్యానం ఆవిష్కరించింది. ఆద్యంతమూ భగవదనుభూతిని అందించిన వ్యాఖ్యానం. డా॥కంపల్లె రవిచంద్రన్ బహుముఖీన ప్రతిభను ఈ వ్యాఖ్య మరింత తేటపరిచింది. భక్తులు, సంప్రదాయ సాహిత్య పఠనాభిలాషులు ముఖ్యంగా విశ్వవిద్యాలయ పరిశోధకవిద్యార్థులు పదిలపరచుకోవాల్సిన వ్యాఖ్య ఇది.




ఈ వ్యాఖ్యాత కూడా తమ వ్యాఖ్యను అవతారికకే పరిమితం చేయకుండా పూర్తి ఆశ్వాసాలకు వ్యాఖ్య అందిస్తే చాలా బాగుంటుంది!

*- డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి.*

# క్విజ్ 31

01) భోగిభూషణుడు ఎవరు? జ)..........

02) 'సిరిగల వానికి చెల్లును' అనే చాటువు ఎవరిది? జ)..........

03) రంహణ స్వభావం కల్గింది? జ)..........

04) శివుని నిర్మాల్యం పై అధికారమున్నవాడు? జ)..........

05) మాఘమాసంలో వచ్చే శుక్లపక్షపంచమి? జ)..........

06) సరస్వతీదేవి వాహనం? జ)..........

07) పశుపతినాథ్ ఆలయం ఉన్న ప్రదేశం? జ)..........

08) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రపండుగ హోదా కల్పించిన తిరునాళ్లు? జ)..........

09) భీష్ముడి అసలు పేరు? జ)..........

10) అంబ ప్రేమించిన రాజు? జ)..........

11) అర్జునుడు దేనికి ప్రతీక? జ)..........

12) తొలితెలుగు కవయిత్రి? జ)..........

13) సుగ్రీవవిజయ కర్త? జ)..........

14) ప్రతినెలలోనూ బహుళ చతుర్దశినాడు వచ్చేది? జ)..........

15) మాఘమాసంలో బహుళ చతుర్దశినాడు వచ్చేది? జ)..........

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-02-2025.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వ బడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........

పాఠశాల: .......... తరగతి: ..........

పేరు: ..........

చిరునామా: ..........

..........

..........

.......... పిన్‌కోడ్: ..........

ఫోన్ సంఖ్య: ..........

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి.ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

1. పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

2. కావలసినభాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

3. సంవత్సరచందా : ☐ రూ.240/-
జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

4. విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

5. చందా పునరుద్ధరణ :
(అ) చందానెంబరు :
(ఆ) భాష :

6. చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :
.................................................... తేది :..................

ప్రదేశం :
తేది :
చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 109




**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)మాఘబహుళచతుర్దశి రోజున వచ్చే పండుగ(6); 4)మాఘబహుళఏకాదశికి గల పేరు(3); 6)పార్వతి అవతారం(2); 7)పాకశాస్త్రంలో ప్రవీణుడు(3); 8)కర్ణుని పెంచిన తల్లి(2); 11)సరస్వతివీణ పేరు(3); 13)జనకమహారాజు ఉన్న నగరం(3); 14)'ముక్క' అనే పదానికి పర్యాయపదం(3); 15)రుద్రభూమి(2); 18)మాఘమాసంలో ఈ రోజున సముద్రస్నానం చేస్తారు(3); 19)తుమ్మెద(3); 21)సముద్రము(4)

**నిలువు** 1)వసంతపంచమికి మరో పేరు(6); 2)త్రిమూర్తులలో ఒకడు(3); 3)నన్నయ ఎవరి ఆస్థానకవి(8); 5)మాఘ శుద్ధ ఏకాదశికి గలపేరు(2); 9)మాఘమాసంలో తిరుపతిలో బ్రహ్మోత్సవాలు ఎవరకి జరుగుతాయి(7); 10)మాఘశుద్ధ అష్టమి ప్రత్యేకత(4); 11)కాశీలో ఒక తీర్థం(7); 12)ఒక తెగ మామిడి(3); 15)అడవి(2); 16)శివరాత్రిరోజు రాత్రి ఉపవాసం ఉండి, కుబేరుడు అయ్యాడు(4); 17)మరీచికుమార్తె(3); 20)నేపాల్‌లో గల ఒక పుణ్యతీర్థం(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు




Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., Dip. in Ephigraphy, Dip. in Yoga on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

తిరుమల తిరుపతి దేవస్థానములు

# శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు, శ్రీనివాసమంగాపురం



| తేదీలు | పగలు ఉత్సవములు | రాత్రి ఉత్సవములు |
|---|---|---|
| 17-02-2025 | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 18-02-2025 | తిరుచ్చిఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 19-02-2025 | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 20-02-2025 | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 21-02-2025 | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 22-02-2025 | పల్లకీలో మోహినీఅవతారోత్సవం | గరుడవాహనం |
| 23-02-2025 | హనుమద్వాహనం, సా॥వసంతోత్సవం | గజవాహనం |
| 24-02-2025 | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 25-02-2025 | రథోత్సవం | అశ్వవాహనం |
| 26-02-2025 | పల్లకీఉత్సవం, తిరుచ్చిఉత్సవం, తీర్థవారీ, అవభృథం, చక్రస్నానం | తిరుచ్చిలో ధ్వజావరోహణం |

తిరుమల తిరుపతి దేవస్థానములు

# శ్రీ కపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు, తిరుపతి

| తేదీలు | పగలు ఉత్సవములు | రాత్రి ఉత్సవములు |
|---|---|---|
| 18-02-2025 | -- | మూషికవాహనంపై వినాయకస్వామి, అంకురార్పణం |
| 19-02-2025 | (పల్లకీఉత్సవం) ధ్వజారోహణం | హంసవాహనం |
| 20-02-2025 | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 21-02-2025 | భూతవాహనం | సింహవాహనం |
| 22-02-2025 | మకరవాహనం | శేషవాహనం |
| 23-02-2025 | తిరుచ్చిఉత్సవం | అధికారనందివాహనం |
| 24-02-2025 | వ్యాఘ్రవాహనం | గజవాహనం |
| 25-02-2025 | కల్పవృక్షవాహనం | అశ్వవాహనం |
| 26-02-2025 | రథోత్సవం | నందివాహనం (మహాశివరాత్రి) |
| 27-02-2025 | పురుషామృగవాహనం | కల్యాణోత్సవం, తిరుచ్చి ఉత్సవం |
| 28-02-2025 | సూర్యప్రభవాహనంలో నటరాజస్వామి, త్రిశూలస్నానం | ధ్వజావరోహణం, రావణాసురవాహనం |



SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthnams Printing on 25-01-2025 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 5th of Every Month.

